
మంగళవారం 12 మే 2026 https://www.telugudesam.org



# చైతన్యరథం



సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు



## ఏపీకి నిధులివ్వండి

కేంద్ర మంత్రులు అమిత్ షా, సీఆర్ పాటిల్‌తో సీఎం భేటీ

- వివరాలు 3 లో..




### ఉత్తమ పాలసీలతోనే

# ఏపీకి పెట్టుబడులు




- ఏపీని చూడండి.. పెట్టుబడులు పెట్టండి
- ప్రభుత్వం - పరిశ్రమలు - విద్యాసంస్థల ఉమ్మడి కృషితోనే అభివృద్ధి
- ప్రధాని మోదీ 8 అంశాల నేషనల్ మిషన్ అనుసరిద్దాం
- ఆదాయం లేకుండా సంక్షేమం సాధ్యం కాదు..
- ఢిల్లీలోని సీఐఐ బిజినెస్ సమ్మిట్‌లో సీఎం చంద్రబాబు పిలుపు

2

### భవిష్యత్ సాంకేతిక రంగాల్లో

## యువతకు భారీ అవకాశాలు



- డీప్ టెక్ స్కిల్లింగ్‌తో అందుబాటులోకి ప్రపంచస్థాయి టెక్నాలజీ
- టెక్నాలజీ డే సందర్భంగా ఏపీలో భారీ డీప్‌టెక్ స్కిల్లింగ్ మిషన్
- ఎన్పీటీఈఎల్ పరీక్షల్లో సత్తా చాటిన ఏపీ విద్యార్థులకు అభినందనలు
- టెక్నాలజీ డే సందర్భంగా ఎక్స్ వేదికగా చంద్రబాబు అభిప్రాయాలు

3

## చేనేత సహకార సంఘాల నుంచే వస్త్రాలు



- నేరుగా దగ్గరకొచ్చే కొనుగోలు చేస్తాం
- నాణ్యమైన సరుకును ఆప్కోకు విక్రయించండి
- నేతన్నలకు స్కిల్ పెంచేలా శిక్షణ ఇస్తాం
- ట్రెండ్‌కు తగ్గట్లు రెడీమేడ్ వస్త్రాలు నేయండి
- చేనేతల ఆదాయం రెట్టింపు కూటమి లక్ష్యం
- మహానాడులో ప్రత్యేక స్టాళ్లు ఏర్పాటు చేస్తాం
- ఆప్కోకు తొలిసారి టీటీడీ ఆర్డర్ ఇచ్చింది
- ఆసక్తి కలిగి ముందుకొస్తే అవకాశమిస్తాం
- త్వరలో నేతన్న భరోసాకు శ్రీకారం
- చేనేత జౌళి శాఖ మంత్రి సవిత

6

## ఆయుష్ వైద్యసేవలపై కీలక నిర్ణయం



- ఇక నకిలీ వైద్యులు, చికిత్సలకు చెక్
- క్లినిక్‌లు, ఆసుపత్రులకు గుర్తింపు తప్పనిసరి
- విధివిధానాల ఖరారుకు 3 ప్రత్యేక కమిటీలు
- కేరళ, తమిళనాడు, ఇతర రాష్ట్రాలపై అధ్యయనం
- ప్రాచీన వైద్యసేవలు మరింత చేరువ చేసేందుకు కృషి
- వైద్య ఆరోగ్య మంత్రి సత్యకుమార్ యాదవ్

10

### అమరావతిలో పుంగోల్ తరహా

## ఇంటిగ్రేటెడ్ టౌన్‌షిప్!





- భారతదేశంలోనే మోడల్ టౌన్‌షిప్‌గా నిర్మాణం చేపడతాం
- ఏపీలో సింగపూర్ తరహా గ్లోబల్ మైస్ ఏర్పాటుకు చర్యలు
- ఆగ్నేయ, తూర్పు ఆసియాలకు సులభతర వాణిజ్యంపై దృష్టి
- ఆర్‌టీజీఎస్‌లో సింగపూర్ అనుభవాన్ని ఉపయోగించుకుంటాం
- జాయింట్ ఇంప్లిమెంటేషన్ స్టీరింగ్ కమిటీ భేటీలో మంత్రి లోకేష్

4

### సింగపూర్ -ఏపీ మధ్య

## పోర్టు వాణిజ్య కారిడార్



- పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభించాలని పతిపాదన
- మిర్చి ఎగుమతులకు సీఐసీ ప్లాట్‌ఫాం ద్వారా సహకరించండి
- ఏపీ-సింగపూర్ జెసీటీ రౌండ్‌టేబుల్ ఏర్పాటు చేయండి
- ఓడరేవుల ఆధారిత పారిశ్రామికీకరణపై దృష్టి సారించిన ఏపీ
- కమాడిటీస్ ఇంటిలిజెన్స్ సెంటర్ సీఈవో గ్లోరియా ఊతో మంత్రి లోకేష్ భేటీ

4


## ప్రపంచస్థాయి “మైస్” కేంద్రంగా ఏపీ



- అంతర్జాతీయ ఈవెంట్ల అనుమతులకు ప్రత్యేక బ్యూరోల ఏర్పాటు
- అమరావతిలో నాలుగు కన్వెన్షన్ సెంటర్ల ఏర్పాటుకు అనుమతి
- సింగపూర్ సన్ టెక్ సిటీని సందర్శించిన మంత్రి నారా లోకేష్

5

# ఉత్తమ పాలసీలతోనే ఏపీకి పెట్టుబడులు







- ఏపీని చూడండి.. పెట్టుబడులు పెట్టండి
- ప్రభుత్వం-పరిశ్రమలు- విద్యాసంస్థల ఉమ్మడి కృషితోనే అభివృద్ధి
- ప్రధాని మోదీ 8 అంశాల నేషనల్ మిషన్ అనుసరిద్దాం
- ఆదాయం లేకుండా సంక్షేమం సాధ్యం కాదు..
- ఢిల్లీలోని సీఐఐ బిజినెస్ సమ్మిట్‌లో సీఎం చంద్రబాబు పిలుపు

ఢిల్లీ (చైతన్య రథం): ఉత్తమ పాలసీల రూపకల్పనతోనే ఏపీకి పెద్దఎత్తున పెట్టుబడులను ఆకర్షించగలుగుతున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వ్యాఖ్యానించారు. సీయింగ్ ఈజ్ బిలీఫ్ అనే విధానంలో ఏపీకి ఒక్కసారి వచ్చిచూసి అప్పుడు పెట్టుబడులు పెట్టాలని పారిశ్రామికవేత్తలకు పిలుపునిచ్చారు. ఢిల్లీలోని తాజ్ ప్యాలస్‌లో భారత పరిశ్రమల సమాఖ్య నిర్వహించిన యాన్యువల్ బిజినెస్ సమ్మిట్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు హాజరై కీలక ప్రసంగం చేశారు. దేశానికి వచ్చిన విదేశీ పెట్టుబడుల్లో ఏపీ 25శాతం మేర పెట్టుబడులను ఆకర్షించగలిగిందని ఆయన వివరించారు. గడచిన 23 నెలల్లో 23లక్షల కోట్ల పెట్టుబడులు ఏపీకి వచ్చాయని..తద్వారా 24లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు కలుగుతాయని అన్నారు.భవిష్యత్ అవసరాలను అంచనా వేసి ఐబీఎం, టీసీఎస్, ఎల్ అండ్ టీ లాంటి సంస్థలతో కలిసి క్వాంటం కంప్యూటింగ్ కేంద్రం ఏర్పాటు చేస్తున్నామని ఆయన వివరించారు. ఇప్పటికే క్వాంటం రిఫరెన్సు ఫెసిలిటీని కూడా ఏర్పాటు చేసినట్టు తెలిపారు. త్వరలో క్వాంటం కంప్యూటర్‌కు అవసరమైన పరికరాలనుకూడా ఉత్పత్తి చేసేలా కార్యాచరణ ప్రారంభించామని పారిశ్రామికవేత్తలకు తెలియచేశారు. పారిశ్రామిక రంగానికి అనుకూలమైన రాష్ట్రంగా ఏపీలో ఎంఎస్‌ఎంఈలను పెద్దఎత్తున ఏర్పాటు చేసేలా వన్ ఫ్యామిలీ వన్ ఎంట్రప్రెన్యూర్ అనే విధానాన్ని అమలు చేస్తున్నట్టు వివరించారు. ఏపీ ప్రజలు కూడా పరిశ్రమలు ఏర్పాటు చేయటంలో ఎప్పుడూ ముందు ఉంటారని అందుకే వారికి ఆంధ్రాప్రెన్యూర్స్ అనేపేరువచ్చిందని అన్నారు. సీఐఐ సంస్థ అమరావతిలో గ్లోబల్ లీడర్షిప్ సెంటర్ ఏర్పాటుకు ముందుకు రావటం సంతోషదాయకమన్నారు. ఏపీలో క్లీన్ ఎనర్జీ, ఎలక్ట్రానిక్స్, డ్రోన్స్ ఏరోస్పేస్, డిఫెన్స్ తదితరరంగాల పరిశ్రమల్ని పెట్టుబడుల్ని ఆకర్షించేలా వివిధపాలసీలను అమలులోకి తెచ్చామని.. ఏపీలో పెట్టుబడులకు ఇదే సరైన సమయం అని సీఎం పారిశ్రామికవేత్తలకు పిలుపునిచ్చారు.

## ప్రధాని మిషన్‌ను ముందుకు తీసుకెళ్దాం

దేశంలో అమలు చేసిన ఆర్థిక సంస్కరణలు మనకు అవకాశాలు తెచ్చిపెట్టాయని సీఎం వ్యాఖ్యానించారు. దేశ, రాష్ట్ర ప్రయోజనాలే తన అజెండా అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. వివిధ రంగాల్లోని గ్లోబల్ ట్యాలెంట్ దేశ లక్ష్యాలు సాధించటంలో కీలకంగా మారుతుందని ఆయన స్పష్టం చేశారు. ప్రస్తుతం కేంద్రంలోనూ, రాష్ట్రాల్లోనూ సుస్థిరమైన ప్రభుత్వాలు ఉన్నాయని ఆయన అన్నారు. పశ్చిమ బెంగాల్ లాంటి రాష్ట్రాల్లో మంచి ఫలితాలు వచ్చాయని.. గతంలో ఆ రాష్ట్రం దేశానికే ఆదర్శంగా ఉండేదని గత కొంతకాలంగా ఆ రాష్ట్రానికి అభివృద్ధి ఆలోచనలే లేకుండా పోయాయన్నారు. సంస్కరణల వాది అయిన ప్రధాని మోదీ నేతృత్వంలో భారత్ అగ్రస్థానానికి చేరుకుంటుందన్నారు.

8 అంశాలతో కూడిన నేషనల్ మిషన్‌ను ప్రధాని మోదీ ప్రకటించారని దానిని అనుసరించి ముందుకు వెళ్దామని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు. బంగారం కొనుగోలును వాయిదా వేయటం, ఇంధనాన్ని పొదుపు చేయటం, ప్రతీ ఇల్లు, పరిశ్రమ, పొలం విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలుగా మార్చటం, ప్రజా రవాణా వినియోగం లాంటి అంశాలను పాటించి వనరుల్ని సద్వినియోగం చేద్దామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. యుద్ధానంతర పరిస్థితుల నేపథ్యంలో దేశవ్యాప్తంగా గ్యాస్ సరఫరాలో ఇబ్బందులు చూశామని ఇలాంటి వాటిని సమర్థంగా ఎదుర్కోవాల్సి ఉందన్నారు. వర్క్ ఫ్రమ్ హోమ్ అన్న నినాదాన్ని కూడా ప్రధాని ఇచ్చారని దానికి సంబంధించిన మౌలిక సదుపాయాలు మనకు ఉన్నాయన్నారు. స్వయం సమృద్ధి అనే అంశాన్ని కూడా ప్రధాని ప్రస్తావించారని ప్రకృతి సేద్యం ద్వారా ఎరువుల దిగుమతి తగ్గిద్దామని అన్నారు. ఏపీలో 20లక్షల ఎకరాలు ప్రకృతి సేద్యంలో ఉన్నాయని తద్వారా భూసారం పెంచటంతో పాటు సర్టిఫికేషన్, ట్రేసబిలిటీని సాధించేలా ప్రయత్నాలు చేస్తున్నామన అన్నారు.ఈ జాతీయ టాస్క్ ను మనం అంతా కలిసి సాధించాలన్నారు. ప్రతీ సవాలూ ఓ అవకాశాన్ని సృష్టిస్తుందని భారత్ ఇక అన్ స్టాపబుల్ అని.. గ్లోబల్ జెయింట్‌గా ఇండియా మారుతుందన్నారు. గ్రీన్‌ఎనర్జీ బయోగ్యాస్, ఇథనాల్, ఈవీ, వికేంద్రీకృత ఇంధన వ్యవ స్థలు ఇప్పుడు మనకు కావాలని అన్నారు. ఏపీలో ప్రోజ్యూమర్ అనే విధానాన్ని ఇప్పటికే పాటిస్తున్నామని.. సోలార్ రూఫ్ టాప్ ద్వారా దీనిని సాధించనున్నట్టు వివరించారు. మైక్రో గ్రిడ్ వ్యవస్థ ద్వారా ట్రాన్స్ మిషన్ నష్టాలను కూడా ఎదుర్కోనేలా ఏపీ సిద్ధమవుతోందన్నారు.



## ఉమ్మడిగా సాధిద్దాం

భవిష్యత్ పారిశ్రామిక అవసరాల కోసం విద్య సంస్థలు, ప్రభుత్వం, పారిశ్రామిక రంగం కలిసి ఉమ్మడిగా కృషి చేయాల్సి ఉందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. పరిశ్రమలకు అవసరమైన నిపుణులైన మానవ వనరుల్ని, ఆవిష్కరణల్ని విద్యా సంస్థలు తయారు చేయాల్సి ఉందని, ప్రభుత్వాలు పెట్టుబడులు తీసుకువస్తాయని ఈ మూడు కలిసి పనిచేస్తేనే ఫలితాలు వస్తాయని ముఖ్యమంత్రి విశ్లేషించారు. గ్లోబల్ టెక్ రంగంలో భారత్ లీడర్ గా మారాలంటే అంతా కలిసి పనిచేయాల్సి ఉందని పిలుపునిచ్చారు. పట్టభద్రులను నిపుణులుగా మార్చుకోడానికి పరిశ్రమలకు నెలల సమయం వృధా చేస్తే లక్ష్యాన్ని సాధించలేమని ఆయన వ్యాఖ్యానించారు. ఎంప్లాయబిలిటీని జాతీయ మిషన్‌గా మార్చుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. పరిశోధన, స్కిల్లింగ్, స్టార్టప్ , మాన్యుఫాక్చరింగ్, గవర్నెన్స్, ఇన్నోవేషన్ లాంటి సమీకృత విధానాలపైనే దేశ అభివృద్ధి అధారపడి ఉందని స్పష్టం చేశారు. 2047 నాటికి ఏపీ 2.4 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా తయారు కావాలని ప్రణాళికలు చేసుకున్నామని అన్నారు. భారత 500 గిగావాట్ల ఇంధన ఉత్పత్తి లక్ష్యంలో ఏపీ 160 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీని ఉత్పత్తి చేసేలా ప్రణాళికలు రూపొందించినట్టు వివరించారు. సంస్కరణల వల్లే విశాఖకు దేశంలోనే అతిపెద్ద విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి వచ్చిందని.. గూగుల్ తో పాటు రిలయన్స్ కూడా ఏపీలో డేటా సెంటర్ ఏర్పాటు చేస్తోందన్నారు. ఏపీలో మొదటి సారి విద్యుత్ కొనుగోళ్ల వ్యయాన్ని 30 పైసలకు తగ్గించామని త్వరలోనే దీనిని రూ.1.30 కి తగ్గించేలా లక్ష్యం పెట్టుకున్నామని అన్నారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్, స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్సు విధానాలతో ముందుకు వెళ్తున్నట్టు తెలిపారు. టెక్నాలజీ ఇంటిగ్రేటెడ్ నగరంగా ఏపీ రాజధాని అమరావతిని నిర్మిస్తున్నట్టు సీఎం వివరించారు. సమాజానికి తిరిగి ఇవ్వడంతో పాటు పేదల జీవన ప్రమాణాలు పెంచేలా ఏపీలో పీ4 కార్యక్రమం చేపట్టామని తెలిపారు. ఏజింగ్ సమస్యకు చెక్ పెట్టేలా పాపులేష్ మేనేజ్మెంట్ పాలసీ తీసుకువచ్చామన్నారు. సంపద వస్తేనే సంక్షేమం అని.. ప్రభుత్వానికి ఆదాయం లేకుండా ఏ రాజకీయనాయకుడూ సంక్షేమ పథకాలు ప్రకటించలేరన్నారు.






# ఏపీకి నిధులివ్వండి

## కేంద్ర మంత్రులు అమిత్ షా, సీఆర్ పాటిల్‌తో సీఎం భేటీ








ఢిల్లీ (చైతన్య రథం): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి వివిధ కేంద్ర ప్రాయోజిత పథకాలతోపాటు గతంలో హామీ ఇచ్చిన మేరకు నిధులు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా ఇవాళ ఉదయం కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో, కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌తో వేర్వేరుగా భేటీ అయ్యారు. విభజన అంశాలతోపాటు వివిధ పెండింగ్ ప్రాజెక్టులకు సంబంధించిన నిధుల్ని మంజూరు చేయాలని ఆయన కేంద్ర హోంమంత్రికి విజ్ఞప్తి చేశారు. ప్రస్తుత కేంద్ర బడ్జెట్‌లో చేసిన కేటాయింపులతోపాటు రాష్ట్ర అభివృద్ధికి అవసరమైన సహకారాన్ని అందించాలని ఆయన కోరారు. అనంతరం కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌తో సమావేశమైన ముఖ్యమంత్రి పోలవరం ప్రాజెక్టులో కీలకమైన అంశాలను పరిష్కరించాలని కోరుతూ విజ్ఞప్తి చేశారు. 2027 గోదావరి పుష్కరాలలోపు ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టును పూర్తి చేసేందుకు పూర్తి సహకారం అందించాలని కోరారు. తొలిదశలో 41.15మీటర్లమేర నీటిని నిల్వ చేసేందుకు అవసరమైన నిర్మాణాలను పూర్తి చేయాలని పేర్కొన్నారు. ఇప్పటికే తాను స్వయంగా 5 మార్లు ప్రాజెక్టును సందర్శించి పనుల పురోగతిని సమీక్షించినట్టు వెల్లడించారు. 2026 ఏప్రిల్ 2నాటికి కొత్త డయాఫ్రామ్ వాల్ నిర్మాణం పూర్తైందని, గ్యాప్ 1, గ్యాప్ 2లలో కీలకమైన ఎర్త్ కమ్ రాక్ ఫిల్ డ్యామ్ పనులు కూడా వేగంగా జరుగుతున్నాయని వెల్లడించారు. ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో ప్రజాభిప్రాయ సేకరణ పెండింగ్‌లో ఉందన్న కారణంతో 2011లో ఇచ్చిన స్టాప్ వర్క్ ఆర్డర్ ఉత్తర్వులను శాశ్వతంగా ఉపసంహరించుకోవాలని కేంద్ర జలశక్తి మంత్రిని ముఖ్యమంత్రి చంద్రబాబు కోరారు. దీనివల్ల పోలవరం ప్రాజెక్టు పనులు ఎలాంటి ఆటంకాలు లేకుండా వేగంగా చేపట్టేందుకు వీలవుతుందని స్పష్టం చేశారు. సాగునీటి అవసరాల దృష్ట్యా మొదట నిర్ణయించిన దానికంటే కుడి, ఎడమ కాలువల సామర్థ్యాన్ని 17,500 క్యూసెక్కులకు పెంచినట్టు సీఎం తెలియచేశారు. ప్రస్తుతం కుడి కాలువ 95 శాతం మేర ఎడమ కాలువ పనులు 78 శాతం మేర పూర్తి అయినట్టు లేఖలో వెల్లడించారు. కాలువల సామర్థ్యం పెంచిన మేరకు నిధులను రీయింబర్స్ చేయాలని జల శక్తి శాఖ మంత్రికి విజ్ఞప్తి చేశారు. ప్రాజెక్టు తదుపరి పనులకు సంబంధించి అవసరమైన నిధులను కూడా మంజూరు చేయాలని కేంద్ర మంత్రిని కోరారు.

### హర్ ఖేత్ కో పానీ పథకం కింద నీటి పంపిణీకి నిధులు

ప్రధాన మంత్రి కృషి సించాయి యోజన కింద రాష్ట్రంలోని వివిధ పథకాల పునరుద్ధరణ, ఆధునీ కరణకు నిధులు మంజూరు కోరుతూ మరో లేఖను ముఖ్యమంత్రి అందించారు. హర్ ఖేత్ కో పానీ కార్యక్రమంలో భాగంగా చెరువులు, కుంటల మరమ్మ తులు, పునరుద్ధరణ ,ఆధునీకరణ, కాలువల పూడిక తీత, గట్ల బలోపేతంలాంటి పనులుచేపట్టాల్సి ఉందని వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా 297 నీటి వనరుల పునరుద్ధరణకు రూ.285 కోట్ల నిధుల్ని విడుదల చేయాలని కోరారు. సుప్రీం కోర్టు తుది తీర్పు వచ్చేంత వరకూ ఆలమట్టి ఎత్తు పెంచే అంశంపై గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయవద్దని కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్‌కు విజ్ఞప్తి చేశారు. ఆనకట్ట ఎత్తును 519.60 మీటర్ల నుండి 524.256 మీటర్‌లకు పెంచితే ఏపీ ప్రయోజనాలకు విఘాతం కలుగుతుందని ఎలాంటి సాంకేతిక, పాలనాపరమైన అనుమతులు మంజూరు చేయవద్దని స్పష్టం చేశారు. అప్పర్ కృష్ణా ప్రాజెక్ట్ ఫేజ్-3 కింద భూసేకరణ ఇతర సన్నాహక పనులు చేయకుండా కర్ణాటకను ఆదేశించాలని, సుప్రీం కోర్టు తుది తీర్పు వచ్చేంత వరకూ యథాతథ స్థితిని కొనసాగించాలని వివరించారు. రాయలసీమ, దక్షిణ కోస్తాంధ్ర ప్రాంతాల దాహార్తిని తీర్చే పోలవరం బనకచర్ల లింక్ ప్రాజెక్టుకు అనుమతులు మంజూరు చేయాలని.. గోదావరినుంచి సముద్రంలోకి వృధాగాపోయే 200 టీఎంసీ వరద జలాలను మళ్లించేలా పోలవరం బనకచర్ల లింక్ ప్రాజెక్టును చేపడుతున్నట్టు వెల్లడించారు. వంశధారపై నేరడి బ్యారేజ్ నిర్మాణానికి జారీ చేసిన గెజిట్ నోటిఫికేషన్ ప్రకారం ముందుకు వెళ్తామని పేర్కొన్న ముఖ్యమంత్రి చంద్రబాబు, ఏపీ నీటి అవసరాలకు అనుగుణంగా 8 వేల క్యూసెక్కుల సామర్థ్యంతో కుడివైపున హెడ్ స్లూయిస్ నిర్మాణం చేపడతామని స్పష్టం చేశారు. దీనికి అవసరమైన భూసేకరణ కోసం ఒడిశాను ఆదేశించాల్సిదిగా కేంద్ర జలశక్తి శాఖకు సీఎం చంద్రబాబు లేఖ ఇచ్చారు. ముఖ్యమంత్రి వెంట ఏపీ జలవనరుల మంత్రి నిమ్మల రామానాయుడు ఇతర అధికారులు పాల్గొన్నారు.

---

### భవిష్యత్ సాంకేతిక రంగాల్లో

# యువతకు భారీ అవకాశాలు

- డీప్ టెక్ స్కిల్లింగ్‌తో అందుబాటులోకి ప్రపంచస్థాయి టెక్నాలజీ
- టెక్నాలజీ డే సందర్భంగా ఏపీలో భారీ డీప్‌టెక్ స్కిల్లింగ్ మిషన్
- ఎన్పీటీఈఎల్ పరీక్షల్లో సత్తా చాటిన ఏపీ విద్యార్థులకు అభినందనలు
- టెక్నాలజీ డే సందర్భంగా ఎక్స్ వేదికగా చంద్రబాబు అభిప్రాయాలు

ఢిల్లీ(చైతన్యరథం): “జాతీయ సాంకేతిక దినోత్స వం సందర్భంగా భారత భవిష్యత్తును సాంకేతికత, ఆవిష్కరణల ద్వారా నిర్మిస్తున్న శాస్త్రవేత్తలు, ఆవిష్క ర్తలు, పారిశ్రామికవేత్తలు, యువతకు హృదయ పూర్వక శుభాకాంక్షలు. ఇవాళ భారత శాస్త్రీయ విజ యాలను స్మరించుకునే రోజు. పోఖ్రాన్ విజయాన్ని గుర్తు చేసుకునే రోజు. పోఖ్రాన్ విజయంతో మన దేశ సామర్థ్యాన్ని, శక్తిని, ప్రతిభను ప్రపంచానికి చాటిచెప్పాం. నాలెడ్జ్, రీసెర్చ్, ఇన్నోవేషన్స్, హ్యూ మన్ రిసోర్సెస్ వంటి అంశాలతో స్థిరమైన అభివృద్ధి సాధ్యమనే విషయాన్ని పోఖ్రాన్ విజయం నిత్యం గుర్తు చేస్తూనే ఉంటుంది. ఆ దిశగానే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అడుగులు వేస్తోంది. భవిష్యత్ సాంకేతిక రంగాల్లో బలమైన ఎకోసిస్టమ్‌ను నిర్మిస్తూ, ఆవిష్కర ణలకు అనుకూల వాతావరణాన్ని పెంపొందించేం దుకు రాష్ట్రం కట్టుబడి ఉంది” అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

“ఐబీఎం స్కిల్స్‌బిల్డ్, ఏపీఎస్‌సీహెచ్‌ఈ, ఏపీఎస్ఎస్‌డీసీ, అమరావతి క్వాంటమ్ వ్యాలీతో కలిసి రాష్ట్ర వ్యాప్తంగా భారీస్థాయి డీప్-టెక్ స్కిల్లింగ్ శిక్షణ కార్యక్రమాన్ని చేపడుతున్నామని ప్రకటించడం ఎంతో ఆనందంగా ఉంది. క్వాంటమ్ టెక్నాలజీస్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా అనలిటిక్స్, సైబర్ సెక్యూరిటీ, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ వంటి రంగాలను కవర్ చేస్తూ 2026-27 నాటికి 2 లక్షలమంది విద్యార్థులకు శిక్షణ ఇవ్వనున్నాం. అలాగే వచ్చే ఐదేళ్లలో 10లక్షల మందికి శిక్షణ ఇచ్చే లక్ష్యంతో శిక్షణ కార్యక్రమం రూపొందించాం. డిజిటల్ లెర్నింగ్ ప్లాట్‌ఫాంలు, పరిశ్రమలతో అనుసంధాన మైన శిక్షణ, అంతర్జాతీయ గుర్తింపు పొందిన సర్టిఫికేషన్ల ద్వారా ఈ ప్రోగ్రామ్ అమలు చేస్తున్నాం. ఈ టెక్నాలజీ ఎకోసిస్టమ్‌ను మరింత బలోపేతం చేసేలా నాగార్జున యూనివర్శిటీలో ఎన్ఐఈఎల్ఐటీ ఇన్నోవేషన్ మరయు స్కిల్లింగ్ సెంటర్ కీలక పాత్ర పోషించనుంది. క్వాంటమ్ కంప్యూటింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, క్వాంటమ్ కమ్యూనికేషన్, సెమీకండక్టర్ టెక్నాలజీలపై ఈ కేంద్రం ప్రత్యేక దృష్టి సారించనుంది. ఈ విద్యా సంవత్సరంలోనే కార్యకలాపాలు ప్రారంభంకా నున్నాయి. దీని ద్వారా ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలు, అత్యాధునిక ప్రయోగశాలలు, పరిశ్రమల అవసరాలకు అనుగుణమైన శిక్షణ అందుబాటులోకి వస్తుంది. దీంతో వేలాది విద్యార్థులు, పరిశోధకులు, ఆవిష్కర్తలు లబ్ధి పొందనున్నారు” అని సీఎం పేర్కొన్నారు.

“జాతీయ సాంకేతిక దినోత్సవం సందర్భంగా ఎన్పీటీఈఎల్ జాతీయ పరీక్షల్లో 4 బంగారు పతకాలు, 14 రజత పతకాలు సాధించిన మన ఆంధ్రప్రదేశ్ విద్యార్థులను అభినందిస్తున్నా. మన రాష్ట్రంలోని ప్రతిభ, కృషి, అభివృద్ధి చెందుతున్న సాంకేతిక ఎకోసిస్టమ్‌కు ఈ విజయాలే నిదర్శనం. క్వాంటమ్ వ్యాలీ విజన్‌తో భవిష్యత్‌ను అందిపుచ్చు కునేలా రాష్ట్రాన్ని తీర్చిదిద్దుతున్న క్రమంలో మరింతమంది విద్యార్థులు అడ్వాన్స్‌డ్ లెర్నింగ్ ప్లాట్‌ఫార్ములు, అభివృద్ధి చెందుతున్న సాంకేతిక కోర్సులు, జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనాలని కోరుకుంటున్నాను” అని పేర్కొన్నారు.

---

### భారత నాగరికతకు స్ఫూర్తి..

# సోమనాథ్

**- ఎక్స్ ట్వీట్‌లో సీఎం చంద్రబాబునాయుడు**

అమరావతి (చైతన్య రథం): “మనది విశ్వాసానికి గౌరవం లభించే నేల. అది ప్రతి ఒక్కరినీ ఏకం చేసే శక్తిగా పనిచేస్తుంది. సోమనాథ దేవాలయం కేవలం ఒక ప్రార్థనా స్థలమే కాదు, భారతదేశ నాగరిక స్ఫూర్తికి శాశ్వత చిహ్నంగా నిలుస్తుంది. చరిత్ర పొడవునా దీనిని రక్షించి, పునర్నిర్మించిన వారి త్యాగానికి, భక్తికి ఇది ప్రతిబింబం” అని సీఎం చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. ఈమేరకు ఎక్స్‌లో పోస్టుపెడుతూ.... “ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో, ఎన్డీఏ ప్రభుత్వం ‘వికాస్ భీ, విరాసత్ భీ’ (అభివృద్ధి భీ, విరాసత్ భీ) స్ఫూర్తిని స్వీకరించి, భారతదేశ అభివృద్ధి పయనం మన శాశ్వతమైన సాంస్కృతిక, ఆధ్యాత్మిక వారసత్వ పరిరక్షణ, పునరుజ్జీవనంతో పాటుగా సాగేలా చూస్తోంది. ఇది భారతదేశ అభివృద్ధికి, దాని గొప్ప సాంస్కృతిక, ఆధ్యాత్మిక వారసత్వ పరిరక్షణకు సమానంగా కృషి చేసిన వారిని గౌరవించే ఒక దార్శనికత. సోమనాథ అమృత్ మహోత్సవం సందర్భంగా, ప్రపంచవ్యాప్తంగా ఉన్న భక్తులకు నా శుభాకాంక్షలు, ఆశీస్సులు తెలియజేస్తున్నాను. హర హర మహాదేవ్” అని పేర్కొన్నారు.

## అమరావతిలో పుంగోల్ తరహా

# ఇంటిగ్రేటెడ్ టౌన్‌షిప్!



- భారతదేశంలోనే మోడల్ టౌన్‌షిప్‌గా నిర్మాణం చేపడతాం
- ఏపీలో సింగపూర్ తరహా గ్లోబల్ మైస్ ఏర్పాటుకు చర్యలు
- ఆగ్నేయ, తూర్పు ఆసియాలకు సులభతర వాణిజ్యంపై దృష్టి
- ఆర్‌టీజీఎస్‌లో సింగపూర్ అనుభవాన్ని ఉపయోగించుకుంటాం
- జాయింట్ ఇంప్లిమెంటేషన్ స్టీరింగ్ కమిటీ భేటీలో మంత్రి లోకేష్



సింగపూర్ (చైతన్య రథం): సింగపూర్‌లోని పుంగోల్ జిల్లా తరహాలో అమరావతిలో నిర్మించబోయే ఇంటిగ్రేటెడ్ టౌన్‌షిప్... ఏపీలోని ఇతర పట్టణ ప్రాంతాలకు మాత్రమే కాకుండా, భారతదేశంలోనే ఒక మోడల్ టౌన్ షిప్‌గా నిలుస్తుందని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. ఇందుకోసం ప్రపంచ బ్యాంకు నుండి అవసరమైన మద్దతు తీసుకోవడంతో పాటు విధివిధానాల ఖరారును వేగవంతంగా చేయాల్సిందిగా జాయింట్ ఇంప్లిమెంటేషన్ వర్కింగ్ కమిటీని కోరారు. రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ మంత్రి నారా లోకేష్ నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధి బృందం... సింగపూర్ వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వశాఖ జాయింట్ ఇంప్లిమెంటేషన్ స్టీరింగ్ కమిటీ ప్రతినిధులతో సింగపూర్‌లో సమావేశమైంది. సమావేశంలో మంత్రి లోకేష్ మాట్లాడుతూ... "మీ మద్దతుతో అమరావతి ఆర్థిక ప్రాంతాన్ని అత్యుత్తమంగా అభివృద్ధి చేయాలని మేము కోరుకుంటున్నాం. అమరావతి ఎకనమిక్ రీజియన్ అభివృద్ధిలో ఆసక్తిగల భాగస్వాములను ఆహ్వానిస్తూ ఆర్‌ఎఫ్‌పి (ప్రతిపాదనల కోసం అభ్యర్థన)పై ఇప్పటికే నోటిఫికేషన్ జారీచేశాం. అమరావతి రాజధానికి ఇప్పుడు జాతీయ చట్టబద్ధత ఉంది. దీనివల్ల ఈ ప్రాంతంలో పెట్టుబడులకు ఇన్వెస్టర్లలో విశ్వాసాన్ని పెంచుతుంది" అన్నారు.

"ఆంధ్రప్రదేశ్ నుంచి... సింగపూర్ ద్వారా ఆగ్నేయాసియా, తూర్పు ఆసియాల మధ్య వాణిజ్యాన్ని సులభతరం చేయడానికి గల అవకాశాలను పరిశీలించండి. సింగపూర్ తరహాలో ఆంధ్రప్రదేశ్ కూడా ఒక గ్లోబల్ వీ×జజు గమ్యస్థానంగా మారాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఆంధ్రప్రదేశ్‌లో కూడా అలాంటిది ఏర్పాటుచేసేందుకు సింగపూర్ సన్‌టెక్ సిటీని అధ్యయనం చేస్తాం. ఆంధ్రప్రదేశ్‌లో రియల్ టైమ్ గవర్నెన్స్ ను బలోపేతం చేయడానికి సింగపూర్ అనుభవాన్ని ఇకముందు కూడా ఉపయోగించుకుంటాం. ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడి పెట్టిన, పెట్టడానికి సుముఖత వ్యక్తంచేస్తున్న కంపెనీలకు సానుకూల వాతావరణం ఏర్పాటు చేస్తా"మని లోకేష్ అన్నారు.

"మన రెండు ప్రభుత్వాల నడుమ ఇప్పుడు పటిష్టంగా భాగస్వామ్యం ఏర్పడింది. ఎంవోయులోని అంశాల అమలుపై వర్కింగ్ గ్రూపుల ద్వారా ప్రతినెలా సంప్రదింపులు జరుగుతూనే ఉన్నాయి. ఏపీ ప్రభుత్వానికి చెందిన ఆరుగురు మంత్రులు రెండు వారాల క్రితం సింగపూర్ -ఏపీ గవర్నెన్స్ ఎక్సలెన్స్ (సేజ్) కార్యక్రమంలో భాగంగా వారంరోజులపాటు శిక్షణా తరగతులకు హాజరై పరిపాలనలో తమ అనుభవాలను పంచుకున్నారు. ఏపీకిచెందిన 37మంది ప్రభుత్వ ఉపాధ్యాయులు కూడా తాజాగా శిక్షణను పూర్తి చేసుకున్నారు. వారి అనుభవాన్ని, శిక్షణలో నేర్చుకున్న అంశాలను మా విద్యా వ్యవస్థలో పొందుపరుస్తాం. గత సమావేశంలో చర్చించిన అజెండా అంశాలపై వర్కింగ్ గ్రూప్ విస్తృతంగా పనిచేసింది. ఇప్పుడు ఆ పటిష్టమైన పునాదిపై మరింత ముందుకు సాగాల్సిన సమయం ఆసన్నమైంది" అని మంత్రి లోకేష్ చెప్పారు.

ఆంధ్రప్రదేశ్‌లో ఇంటిగ్రేటెడ్ మోడల్ టౌన్‌షిప్, అమరావతి ఎకనామిక్ రీజియన్, డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్/ రియల్ టైమ్ గవర్నెన్స్‌పై గత నవంబర్‌లో సింగపూర్ ప్రభుత్వంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఆ ఎంవోయు పురోగతిపై ఎప్పటికప్పుడు సమీక్షించేందుకు జాయింట్ ఇంప్లిమెంటేషన్ స్టీరింగ్ కమిటీ ఏర్పాటుచేశారు. జెఐఎస్‌సీ ఆమోదించిన పనులను ముందుకు నడిపించేందుకు జాయింట్ ఇంప్లిమెంటేషన్ వర్కింగ్ కమిటీని కూడా ఏర్పాటు చేశారు. వీటితోపాటు గతంలో పెండింగ్‌లో ఉన్న అంశాల పురోగతిపై తాజా సమాచారం, భవిష్యత్ కార్యాచరణ అంశాలపై సింగపూర్‌లో తాజాగా ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు.

సమావేశంలో సింగపూర్ వాణిజ్యం, పరిశ్రమలు, విదేశాంగ మంత్రి గాన్ సియో హువాంగ్, సింగపూర్ వాణిజ్యం, పరిశ్రమల మంత్రిత్వశాఖ సీనియర్ డైరెక్టర్ ఫ్రాన్సిస్ చోంగ్, సింగపూర్ కో-ఆపరేషన్ ఎంటర్ ప్రైజ్ డిప్యూటీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ టే లియాన్ చూ, ఎంటర్‌ప్రైజ్ సింగపూర్ సౌత్ ఆసియా ఎకనమిక్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ ఆడ్రీ టాన్, సింగపూర్ కో-ఆపరేషన్ ఎంటర్‌ప్రైజ్ మిడిల్ ఈస్ట్, నార్త్ ఆసియా డిప్యూటీ డైరెక్టర్ లిమ్ చీ కియా, మినిస్ట్రీ ఆఫ్ ట్రేడ్ అండ్ ఇండస్ట్రీ డైరెక్టర్ జీన్ యీ, సింగపూర్ కోఆపరేషన్ ఎంటర్‌ప్రైజ్ సీనియర్ మేనేజర్ (మిడిల్ ఈస్ట్, నార్త్ ఆసియా) నిషా శారద, భారత హైకమిషనర్ శిల్పక్ అంబులే, ఎస్.జోషి, ఏపీ ప్రభుత్వం తరపున సీనియర్ ఐఏఎస్ అధికారులు దత్తి సురేంద్ర, అనంతశంకర్, పీయూష్‌కుమార్, కాటంనేని భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# సింగపూర్-ఏపీ మధ్య పోర్టు వాణిజ్య కారిడార్

- పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభించాలని ప్రతిపాదన
- మిర్చి ఎగుమతులకు సీఐసీ ప్లాట్‌ఫాం ద్వారా సహకరించండి
- ఏపీ-సింగపూర్ జెసీటీ రౌండ్‌టేబుల్ ఏర్పాటు చేయండి
- ఓడరేవుల ఆధారిత పారిశ్రామికీకరణపై దృష్టి సారించిన ఏపీ
- కమాడిటీస్ ఇంటిలిజెన్స్ సెంటర్ సీఈవో గ్లోరియా ఊతో మంత్రి లోకేష్ భేటీ



సింగపూర్ (చైతన్య రథం): సింగపూర్ కమాడిటీస్ ఇంటిలిజెన్స్ సెంటర్ సీఈవో గ్లోరియా ఊతో రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ మంత్రి నారా లోకేష్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ... సీఫుడ్, వ్యవసాయం, ఖనిజాలు, ఫార్మాస్యూటికల్ రంగాల్లో వాణిజ్య అనుసంధానం, ఎంఎస్ఎంఈ ఎగుమతిదారుల చేరిక, కమాడిటీ ఇంటిలిజెన్స్ సమాచార మార్పిడివంటి అంశాల్లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం -సీఐసీ మధ్య సహకారాన్ని కోరుతున్నామని తెలిపారు. సీఐసీ బ్లాక్‌చెయిన్ ప్లాట్‌ఫామ్‌ను ఉపయోగించి కాగితరహిత వాణిజ్య ప్రక్రియ, సరుకుల పారదర్శకత కోసం సింగపూర్, విశాఖపట్నం లేదా కృష్ణపట్నం పోర్టు మధ్య ఒక డిజిటల్ వాణిజ్య కారిడార్‌ను పైలట్ ప్రాజెక్ట్‌గా ప్రారంభించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. మిర్చితోపాటు ఏపీనుంచి ఎగుమతికి అనువైన సరుకును గుర్తించేందుకు ఆంధ్రప్రదేశ్‌లోని ఎగుమతిదారులు, సీఐసీ, ఎంటర్‌ప్రైజ్ సింగపూర్, ఎస్‌జీఎక్స్‌లను ఒకచోట చేర్చి, ఏపీ-సింగపూర్ జాయింట్ కమాడిటీ ట్రేడ్ రౌండ్‌టేబుల్ సమావేశాన్ని నిర్వహించాల్సిందిగా సూచించారు.

ఆంధ్రప్రదేశ్ భారతదేశంలోనే అతిపెద్ద ఆక్వాకల్చర్ ఉత్పత్తి చేసే రాష్ట్రం. భారతదేశ మిర్చి ఎగుమతుల్లో ఏపీ 40-45శాతం వాటాను కలిగి ఉంది. సముద్ర ఉత్పత్తులు, ఖనిజాలు, ఔషధ రంగాలలో కూడా బలమైన ఉనికిని కలిగి ఉంది. ప్రస్తుతం మేం ఓడరేవుల ఆధారిత పారిశ్రామికీకరణపై దృష్టి సారిస్తున్నాం. దీనిద్వారా మా ఉత్పత్తులను ప్రపంచానికి ఎగుమతి చేయాలనుకుంటున్నాం. ఆసియా, ప్రపంచ కమోడిటీ మార్కెట్ల అనుసంధానంతో డిజిటల్ ఇంటిగ్రేటెడ్ వాణిజ్య,లాజిస్టిక్స్ కేంద్రంగా మారడంలో సీఐసీ ప్లాట్‌ఫామ్ సామర్థ్యాలు ఆంధ్రప్రదేశ్‌కు ఉపకరిస్తాయని లోకేష్ వివరించారు.

కోవిడ్‌కుముందు సీఐసీ ద్వారా ఏపీ-చైనా మిర్చి వాణిజ్యానికి ప్రయత్నించాం. కానీ కోవిడ్‌వల్ల సంస్థాగత మద్దతు లేకపోవడంతో అవాంతరాలు ఎదురయ్యాయి. ఈ వాణిజ్య కారిడార్‌ను పునరుద్ధరించేందుకు సీఐసీ ప్లాట్‌ఫాం ద్వారా సహకారం అందించండి. దీనివల్ల మా గుంటూరు మిర్చికి కొత్త మార్కెట్ లభిస్తుంది. ఇందుకోసం ఆంధ్రప్రదేశ్ రైతు ఉత్పత్తిదారుల సంఘాలు సరుకు సమీకరణ, గ్రేడింగ్, నాణ్యతను ప్రామాణీకరించి, సరఫరా చేస్తాయి. కొనుగోలుదారులను అనుసంధానించడం, వాణిజ్య ఎగుమతుల ఫైనాన్సింగ్‌ను అందించేలా సీఐసీ సహకరించాల్సి ఉంటుంది. ఈమేరకు తొలుత మిర్చి పైలట్ ప్రాజెక్టును ప్రారంభించండి. ఈ పైలట్ ప్రాజెక్ట్‌ను అమలు చేయడానికి సీఐసీ తన చైనా కొనుగోలుదారుల నెట్‌వర్క్, వాణిజ్య ఫైనాన్స్ యంత్రాంగాన్ని క్రియాశీలం చేయాలని మంత్రి లోకేష్ విజ్ఞప్తి చేశారు.

ఈ సందర్భంగా సీఐసీ సీఈవో గ్లోరియా ఊ మాట్లాడుతూ... ప్రపంచవ్యాప్తంగా ధృవీకరించబడిన కొనుగోలుదారులు, అమ్మకందారులు, లాజిస్టిక్స్ ప్రొవైడర్లు, ఫైనాన్షియర్‌లను అనుసంధానించే డిజిటల్ బీ2బీ మార్కెట్ ప్లేస్ కమాడిటీస్ ఇంటిలిజెన్స్ సెంటర్ అని అన్నారు. కమోడిటీ ఇంటెలిజెన్స్, ట్రేడ్ డేటా సెర్చ్ ఇంజిన్, దిగుమతి-డిమాండ్ అంచనా, ధర సిగ్నల్ పర్యవేక్షణ, బ్లాక్‌చెయిన్ ఆధారిత డాక్యుమెంట్ భద్రత, ఒకే క్లిక్‌తో కస్టమ్స్ క్లియరెన్స్, ఎండ్-టు-ఎండ్ ట్రేసబిలిటీ వంటి కార్యకలాపాలను సీఐసీ నిర్వహిస్తుందని తెలిపారు. సప్లై చైన్ ఫైనాన్స్, క్రెడిట్ అసెస్‌మెంట్, ఎంఎస్ఎంఈ ఎగుమతిదారుల వర్కింగ్ క్యాపిటల్ పరిమితులను సీఐసీ పరిష్కరిస్తుందని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ గ్రీన్ హైడ్రోజన్, పునరుత్పాదక ఇంధన ఆశయాలకు అనుగుణంగా ఉండే సుస్థిరత-అనుసంధానిత వాణిజ్య సాధనాలకు సీఐసీ సహకారం అందిస్తుందని చెప్పారు. ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనలను పరిశీలిస్తామని హామీ ఇచ్చారు.

# ప్రపంచస్థాయి “మైస్” కేంద్రంగా ఏపీ

- అంతర్జాతీయ ఈవెంట్ల అనుమతులకు ప్రత్యేక బ్యూరోల ఏర్పాటు
- అమరావతిలో నాలుగు కన్వెన్షన్ సెంటర్ల ఏర్పాటుకు అనుమతి
- సింగపూర్ సన్ టెక్ సిటీని సందర్శించిన మంత్రి నారా లోకేష్





సింగపూర్ (చైతన్య రథం): రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ సింగపూర్‌లోని సన్ టెక్ సిటీని సందర్శించారు. అక్కడ డీపీ అర్బన్ ఆర్కిటెక్ట్ సంస్థ డైరెక్టర్ ఆనందన్ కరుణా కరన్‌తో లోకేష్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ... ప్రపంచస్థాయి మైస్ (మీటింగ్స్, ఇన్సెంటివ్స్, కాన్ఫరెన్సెస్, ఎగ్జి బిషన్స్) ఈవెంట్లకు కేంద్రంగా మారడమే ఆంధ్రప్రదేశ్ లక్ష్యమని రాష్ట్రమంత్రి లోకేష్ పేర్కొన్నారు. ఇందుకోసం తాముకొత్త మైస్ విధానాన్ని రూపొందిస్తున్నామన్నారు. అంతర్జాతీయ ఈవెంట్ నిర్వాహకులకు సింగిల్ విండో అనుమతులను వేగవంతం చేయడానికి విశాఖపట్నం, అమరావతి, తిరుపతిలలో ప్రత్యేకబ్యూరోలను ఏర్పాటు చేస్తున్నామని లోకేష్ వివరించారు.

“రాబోయే ఐదేళ్లలో రాష్ట్రంలోని హోటల్ గదులసంఖ్య 4 రెట్లు పెరిగి 20,000కు చేరుకుంటుందని మంత్రి లోకేష్ అన్నారు. ప్రముఖ జాతీయ, అంతర్జాతీయ హాస్పిటా లిటీ సంస్థలు అమరావతికి వస్తున్నాయి. మైస్ పరిశ్రమను ప్రోత్సహించడానికి అమరావతిలో 4 కన్వెన్షన్ సెంటర్లకు రాష్ట్రం ఆమోదం తెలిపింది. విశాఖపట్నంలో ఒక ప్రపంచ స్థాయి మైస్ కేంద్రాన్ని నిర్మించబోతున్నాం. భారత ప్రభుత్వ ఇండియా ట్రేడ్ ప్రమోషన్ ఆర్గనైజేషన్‌తో భాగస్వామ్యంతో వైజాగ్‌లో ఆంధ్ర మండపాన్ని ఏపీ ఇప్పటికే ప్రకటించింది. విశాఖ తీరప్రాంతం గూగుల్, టీసీఎస్, కాగ్నిజెంట్‌వంటి ప్రముఖ గ్లోబల్ టెక్ కంపెనీలకు ఆతిథ్యం ఇస్తోంది’ అని లోకేష్ తెలిపారు.

డీపీ అర్బన్ ఆర్కిటెక్ట్ డైరెక్టర్ ఆనందన్ కరుణాకరన్ మాట్లాడుతూ... సింగపూర్ డౌన్ టౌన్ వ్యాపార కేంద్రానికి నడిబొడ్డున ఉన్న సన్ టెక్ సిటీని తమ సంస్థ డిజైన్ చేసిందని, ఇది 42వేల మీటర్ల విస్తీర్ణంలో అధునాతన సాంకేతికతతో నిర్మించిన ఈవెంట్ ప్లేస్ అని తెలిపారు. సింగపూర్ ను అగ్రశ్రేణి, సురక్షితమైన, విశ్వసనీయమైన గమ్యస్థానంగా నిలబెట్టడానికి సింగపూర్ టూరిజం బోర్డ్ విస్తృత ప్రచారం కల్పిస్తోంది. 2040 నాటికి మైస్ సందర్శకుల వ్యయాన్ని పెంచడం, తద్వారా టూరిజం ఆదాయాన్ని మూడు రెట్లు పెంచడం సింగపూర్ టూరిజం బోర్డు లక్ష్యం. ఈ పరిశ్రమ సుస్థిరత ధృవీకరణపై ఎక్కువగా దృష్టి సారిస్తుంది. సన్‌టెక్ సిటీ, మెరీనా బే సాండ్స్ వంటి ఇప్పటికే ఉన్న వేదికలపై కొత్త మైస్ హబ్ నిర్మించడానికి సింగపూర్ ప్రణాళికలు రూపొందిస్తున్నట్టు ఆనందన్ కరుణాకరన్ చెప్పారు.

# బీసీ బిడ్డల భవిష్యత్తుకు బలమైన బాట..

## మారుతున్న సంక్షేమానికి ఇదే కొత్త నిర్వచనం - నిర్లక్ష్యం నుంచి నాణ్యత వైపు...

రాష్ట్రంలో బీసీ సంక్షేమ హాస్టళ్ల పరిస్థితి గురించి గత ఐదేళ్ల విధ్వంస పాలనలో వచ్చిన విమర్శలు సాధారణమైనవి కావు. పాడైపోయిన భవనాలు, చెల్లించని డైట్ బిల్లులు, సరైన ఆహారం లేక ఆకలితో చదువుకున్న విద్యార్థులు,తాగునీటి సమస్యలు, పారిశుధ్య లోపాలు,నిర్వహణలో నిర్లక్ష్యం–ఇలా ఎన్నోసమస్యలు బీసీ హాస్టళ్లను కుదిపేశాయి. సంక్షేమ హాస్టల్ అంటే పేద పిల్లల బతుకుదెరువు కోసం ఇచ్చే కనీసవసతి అనే భావనతోనే పాలనసాగింది.విద్యార్థుల భవిష్యత్తునుతీర్చిదిద్దే విద్యాకేంద్రాలుగా కాకుండా, కేవలం సంఖ్యల నిర్వహణగా మాత్రమే చూసిన దుష్పరిణామాలు బీసీ హాస్టళ్లపై స్పష్టంగా కనిపించాయి.

అయితే ఇప్పుడు ఆ దృశ్యం మారుతోంది.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినతర్వాత బీసీ సంక్షేమ హాస్టళ్లలో చోటుచేసుకుంటున్న మార్పులు కేవలం పరిపాలనా చర్యలు మాత్రమే కావు; అవి సంక్షేమాన్ని కొత్తదిశగా తీసుకెళ్తున్న మార్పులసంకేతాలు. ముఖ్యంగా విద్యార్థుల ఆరోగ్యం, ఆహార భద్రత, పరిశుభ్రత, డిజిటల్ సదుపాయాలు, పారదర్శక నిర్వహణ వంటి అంశాలపై ప్రభుత్వం చూపుతున్న దృష్టి బీసీ హాస్టళ్లను రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలబెడుతోంది.

ఇటీవల నిర్వహించిన ఐవీఆర్ఎస్ సర్వేలో 78.20 శాతం సంతృప్తిస్థాయితో బీసీ హాస్టళ్లు రాష్ట్రంలోని ఇతర సంక్షేమ హాస్టళ్లన్నింటికంటే అగ్రస్థానంలో నిలవడం సాధారణవిషయం కాదు. ఇది కేవలం గణాంకం కాదు; ప్రభుత్వ విధానాలు నేలమీద ఫలితాలిస్తున్నాయనే విషయానికి ఇది స్పష్టమైన నిదర్శనం.

### ఆకలి తీర్చిన తర్వాతే విద్యపై దృష్టి:

పేద విద్యార్థి చదువు అంటే కేవలం పుస్తకాలు ఇవ్వడం కాదు. ముందుగా అతని ఆకలితీర్చాలి. శారీరకంగా బలంగా ఉండేలాచూడాలి. అప్పుడే చదువుపై దృష్టికేంద్రీకరిస్తాడు. ఈ మౌలిక వాస్తవాన్ని గుర్తించిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే గత ప్రభుత్వ కాలంనుంచి పెండింగ్‌లోఉన్న సుమారు రూ.110కోట్ల డైట్ బకాయిలను చెల్లించడం ద్వారా పెద్ద నిర్ణయం తీసుకుంది.

గతంలో నెలల తరబడి డైట్ బిల్లులు విడుదల కాకపోవడంతో హాస్టళ్లలో సరైన ఆహారం అందని పరిస్థితులు నెలకొన్నాయి. కొన్నిచోట్ల సరుకులు సరఫరా చేయడానికి కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడం, మరికొన్ని చోట్ల విద్యార్థులు నాసిరకం భోజనం తినాల్సి రావడం వంటి ఘటనలువెలుగు చూశాయి. ఇప్పుడు ఆ పరిస్థితి గణనీయంగా మారింది. డైట్‌బిల్లులు సకాలంలో విడుదల కావడంతో హాస్టళ్లలో మెనూ అమలు మెరుగుపడింది. విద్యార్థులకు సన్నబియ్యంతో పౌష్టికాహారం అందించడం ప్రారంభమైంది.

కేవలం భోజనం పెట్టడమే కాదు, ఆహారం నాణ్యతపై కూడా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టడం గమనార్హం. కుక్‌లు, కమాటీల నియామకం ద్వారా మెనూ అమలును వ్యవస్థీకరించడానికి ప్రయత్నించడం కూడా దీనిలో భాగమే.

### ఆరోగ్య భద్రతపై ప్రత్యేక దృష్టి :

ఒకప్పుడు హాస్టళ్లలో తాగునీరు సమస్య తీవ్రంగా ఉండేది. పారిశుధ్యం లోపించి విద్యార్థులు అనారోగ్యానికి గురయ్యేఘటనలు చోటుచేసుకునేవి. ఇప్పుడు మాత్రం బీసీ హాస్టళ్లలో ఆరోగ్య భద్రతకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. రూ.21కోట్ల వ్యయంతో ఆర్వో ప్లాంట్ల ఏర్పాటు, దోమల నివారణ కోసం కిటికీలకు దోమతెరలు, నిరంతర విద్యుత్ కోసం ఇన్వర్టర్లు, పారిశుధ్య సిబ్బంది నియామకం వంటి చర్యలు సంక్షేమ హాస్టళ్ల నిర్వహణలో ఒక కొత్త ప్రమాణాన్ని సృష్టిస్తున్నాయి.

ప్రత్యేకంగా స్వచ్ఛ భారత్‌మిషన్ పరిధిలో మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టడం, వంటసామగ్రి కొనుగోలు కోసం నిధులు విడుదల చేయడం వంటి చర్యలు విద్యార్థుల జీవన ప్రమాణాలను పెంచుతున్నాయి. విద్య అంటే కేవలం తరగతి గదిలో పాఠాలు మాత్రమే కాదని, వసతి కూడా అంతే ముఖ్యమని ప్రభుత్వం గుర్తించినట్లు ఈ చర్యలు సూచిస్తున్నాయి.

### డిజిటల్ పర్యవేక్షణతో పారదర్శకత:

సంక్షేమ హాస్టళ్ల నిర్వహణలో ఇప్పటివరకు ప్రధాన సమస్యల్లో ఒకటి పారదర్శకత లోపం. విద్యార్థులు ఎంతమంది ఉన్నారు? మెనూ అమలవుతోందా? సరుకుల వినియోగం సక్రమంగానా? అనే ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలు ఉండేవి కావు. ఈ పరిస్థితిని మార్చేందుకు ప్రభుత్వం తీసుకొచ్చిన ఎఫ్‌ఆర్ఎస్ వ్యవస్థ ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

ముఖ ఆధారిత హాజరువిధానం ద్వారా విద్యార్థుల నిజమైన హాజరు నమోదవుతోంది. సిబ్బందికీ ఇదే విధానం అమలు చేయడం వల్ల సమయపాలన పెరిగింది. ముఖ్యంగా నిత్యావసర సరుకుల దుర్వినియోగానికి అడ్డుకట్ట పడిందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రభుత్వం చెబుతున్న లెక్కల ప్రకారం ఈ విధానం వల్ల ఏడాదికి రూ.6కోట్లకు పైగా ఆదా కావడం విశేషం.

ఇది కేవలం ఆదా కథ కాదు; సంక్షేమ నిధులు నిజంగా విద్యార్థుల కోసమే వినియోగం కావాలనే పరిపాలనా సంకల్పానికి ఇది నిదర్శనం. హాస్టళ్లలో ఎఫ్‌ఆర్ఎస్ అమలు చేయడం రాష్ట్రంలోనే తొలిసారి బీసీ హాస్టళ్లలో జరగడంకూడా ప్రాధాన్యమైన అంశం.

దీనికి తోడు హెచ్‌పీటీఎస్యాప్ ద్వారా ప్రతిరోజూ హాస్టళ్ల పరిస్థితుల ఫోటోలు అప్‌లోడ్ చేయించే విధానం కూడా పర్యవేక్షణను మరింత కట్టుదిట్టం చేసింది. మెనూ అమలు, తాగునీరు, పరిశుభ్రత, మరుగుదొడ్ల పరిస్థితి వంటి అంశాలను రాష్ట్ర స్థాయి అధికారులు నేరుగా పరిశీలించే అవకాశం ఏర్పడింది.

### ఐవీఆర్ఎస్ సర్వే చెబుతున్న నిజం :

ప్రభుత్వాలు సాధారణంగా నిధులు విడుదల చేశామని చెప్పుకుంటాయి. కానీ ఆ నిధులు నిజంగా ఫలితాలిస్తున్నాయా లేదా అన్నది ప్రజల అభిప్రాయమే తేలుస్తుంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం చేపట్టిన ఐవీఆర్ఎస్ సర్వే ప్రాముఖ్యత సంతరించుకుంది.

విద్యార్థుల తల్లిదండ్రులకు నేరుగా ఫోన్ చేసి హాస్టళ్ల నిర్వహణపై అభిప్రాయాలు సేకరించడం ఒక మంచి పరిపాలనా విధానం. “మెనూ సక్రమంగా అమలవుతోందా?”, “వార్డెన్ల పనితీరు ఎలా ఉంది?”, “హాస్టల్ నిర్వహణపై మీఅభిప్రాయం ఏమిటి?” వంటి ప్రశ్నలకు వచ్చిన సమాధానాల్లో 78.20శాతం మంది సంతృప్తి వ్యక్తంచేయడం బీసీ హాస్టళ్లలో మార్పు ఎంత వరకు చేరిందో తెలియజేస్తోంది.

ప్రత్యేకంగా మొదటి విడతలో 71.30శాతం ఉన్న సంతృప్తి స్థాయి రెండో విడతలో 78.20శాతానికి పెరగడం కూడా గమనించాల్సిన అంశం. అంటే మార్పు కొనసాగుతోందన్న మాట.

### విద్యా ఫలితాల్లో కనిపిస్తున్న ప్రభావం :

హాస్టళ్లలో వాతావరణం మెరుగుపడితే విద్యార్థుల ఫలితాలపై దాని ప్రభావం తప్పకుండా ఉంటుంది. ఇటీవల విడుదలైన పదో తరగతి ఫలితాల్లో బీసీ హాస్టళ్ల విద్యార్థులు 85.99శాతం ఉత్తీర్ణత సాధించడం యాదృచ్ఛికం కాదు. మంచి ఆహారం, సరైన పర్యవేక్షణ, ప్రశాంతమైన వసతి, డిజిటల్ కంటెంట్ అందుబాటులోకి రావడం–ఈ మార్పులన్నీ ఇప్పుడు విద్యా ఫలితాల్లో స్పష్టంగా ప్రతిఫలించడం ప్రారంభమైంది.

ప్రత్యేకంగా ఎస్.ఆర్. శంకరన్ రిసోర్స్ సెంటర్ల ఏర్పాటు ద్వారా డిజిటల్ లెర్నింగ్‌కు అవకాశాలు కల్పించడం భవిష్యత్ దృష్టితో తీసుకున్న నిర్ణయంగా చెప్పాలి. గ్రామీణ పేద విద్యార్థులు కూడా డిజిటల్ విద్యను అందిపుచ్చుకునే దిశగా ఇది ఒక ముఖ్యమైన అడుగు.

### ప్రత్యేక దృష్టి సారించిన మంత్రి సవిత:

సంక్షేమ శాఖల విషయంలో సాధారణంగా కనిపించే విమర్శ ఏమిటంటే---మంత్రులు కార్యాలయాలకే పరిమితం అవుతారనేది. కానీ బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవితవ్యవహారశైలి మాత్రం భిన్నంగా కనిపిస్తోంది. ఆకస్మిక తనిఖీలు, విద్యార్థులతో నేరుగా మాట్లాడడం, సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించడం వంటి చర్యలు అధికార యంత్రాంగంపై ఒత్తిడి తీసుకువచ్చాయి.

హాస్టళ్ల అభివృద్ధిపై నిరంతర సమీక్షలు నిర్వహించడం, ఫలితాలపై దృష్టి పెట్టడం, పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించడం వంటి చర్యలు పరిపాలనా చురుకుదనాన్ని ప్రతిబింబిస్తున్నాయి. సంక్షేమ హాస్టళ్ల నిర్వహణను కేవలం ఫైళ్ల వ్యవహారంగా కాకుండా, విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడిన బాధ్యతగా చూడడం వల్లే ఈ మార్పులు సాధ్యమయ్యాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

### సంక్షేమానికి కొత్త ప్రమాణం :

రాష్ట్ర రాజకీయాల్లో సంక్షేమం అనే పదం చాలా కాలంగా వినిపిస్తున్నప్పటికీ, నిజమైన సంక్షేమం అంటే ఏమిటన్న దానిపై ఇప్పుడిప్పుడే స్పష్టత వస్తోంది. కేవలం నగదు పథకాలు ప్రకటించడం మాత్రమే సంక్షేమం కాదు. పేద విద్యార్థికి గౌరవప్రదమైన వసతి, ఆరోగ్యకరమైన ఆహారం, పరిశుభ్రమైన వాతావరణం, నాణ్యమైన విద్య, భద్రత కల్పించడం కూడా అంతే ముఖ్యమైన సంక్షేమమే.

బీసీ హాస్టళ్లలో ఇప్పుడు కనిపిస్తున్న మార్పులు అదే విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. గతంలో నిర్లక్ష్యానికి గురైన ఈ హాస్టళ్లు ఇప్పుడు రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలవడం వెనుక పరిపాలనా సంకల్పం, నిరంతర పర్యవేక్షణ, నిధుల సమర్థ వినియోగం, సాంకేతికత వినియోగం–ఇవన్నీ చాలా కీలక పాత్ర పోషిస్తాయి.

ప్రస్తుతం కనిపిస్తున్న మార్పు మాత్రం బీసీ విద్యార్థుల్లో కొత్త ఆత్మవిశ్వాసాన్ని నింపుతోంది. సంక్షేమ హాస్టల్ అంటే ఒకప్పుడు నిర్లక్ష్యానికి ప్రతీకగా కనిపించేది. ఇప్పుడు అదే హాస్టల్ ఆశలకు చిరునామాగా మారుతుండటం–అదే అసలు మార్పు.

# 2027 జూన్‌కి పోలవరం ప్రాజెక్టు పూర్తి

- ప్రధాని మోదీ చేతులమీదుగా జాతికి అంకితం
- రెండో దశ కోసం నిధుల మంజూరుకు విన్నవించాం
- నల్లమలసాగర్‌కు అనుమతులు ఇవ్వాలని కోరాం
- జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు



న్యూఢిల్లీ(చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్‌ని కరువు రహిత రాష్ట్రం గా మార్చే పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణం 2027 జూన్ నాటికి పూర్తవుతుందని జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానా యుడు తెలిపారు. అదే నెలలో గౌరవ ప్రధాని మోదీ చేతుల మీదుగా ఈ ప్రాజెక్టును జాతికి అంకితం చేస్తామని వివరించారు. కేంద్ర జలశక్తి మంత్రి సి.ఆర్.పాటిల్‌ను సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలోని బృందం సోమవారం ఆయన కార్యాలయంలో కలసి గంట పాటు చర్చలు జరిపారు. ఆ వివరాలను మంత్రి నిమ్మల ఢిల్లీలో మీడియాకు వివరించారు. పోలవరం సత్వర పూర్తికి అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తామని జలశక్తి మంత్రి పాటి ల్ హామీ ఇచ్చారని చెప్పారు. అందుకు కేంద్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. ఐదేళ్ల జగన్ పాలనలో పోలవరం ప్రాజె క్టు ప్రశ్నార్థకమైపోయింది. ఎప్పటికి అవుతుందో చెప్పలేమని చేతులెత్తేసిన దుస్థితి నుంచి పోలవరం ప్రాజెక్టు వచ్చే ఏడాది పూర్తి చేస్తామని సగర్వంగా ప్రకటిస్తున్నట్లు చెప్పారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం సాగునీటి రంగానికి ఇస్తున్న ప్రాధాన్యాన్ని జలశక్తి మంత్రికి వివరించి సహకారాన్ని కోరారని చెప్పారు. మైనర్ ఇరిగేషన్ రంగానికి సంబంధించి ప్రతిపాదనల తాలూకు నిధులు కూడా ఇవ్వాలని కోరామని తెలిపారు. కాలువల ద్వారా కాకుండా పైప్‌లైన్ల ద్వారా నీటి సరఫరా చేయడానికి ఎంపికైన విజయనగ రం జిల్లాలో పనులు ముందుకు తీసుకువెళు తున్నట్టు ముఖ్యమంత్రి చెప్పారని వివరించారు. నదుల అనుసంధాన ప్రక్రియ ద్వారా భారతదేశాన్ని సస్యశ్యామలం చేయాలనే నాటి ప్రధాని వాజ్‌పేయి నుంచి నేటి ప్రధాని మోదీ వరకు చేస్తున్న కృషిని చంద్రబాబు అందిపుచ్చుకుని అవిరళ కృషి చేస్తున్నారన్నారు. అందులో భాగం గానే పోలవరం- నల్లమల సాగర్ ప్రతిపాదన తీసుకొచ్చామన్నా రు. అలాగే గోదావరి-కావేరి అనుసంధానానికి కూడా కార్యా చరణ ప్రణాళిక రూపొందించబోతున్నట్లు చెప్పారు. పోలవరం స్టాప్ వర్క్ ఆర్డర్‌ను శాశ్వతంగా రద్దు చేయాలని కేంద్రాన్ని కోరినట్లు వివరించారు.

### కేంద్రం సానుకూలంగా స్పందించింది

పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి నిర్వాసితుల పునరావాసం, పరిహారాలకు సంబంధించి నిధులను సకాలంలో సమకూరు స్తామని కేంద్రం సానుకూలంగా స్పందించినట్లు చెప్పారు. పోల వరం ప్రాజెక్టు రెండో దశలో కీలకమైన భూసేకరణ, పునరా వాసం కోసం వెంటనే నిధులు మంజూరు చేయాలని కోరినట్లు చెప్పారు. ప్రతి ఏడాది గోదావరిలోని 3000 టీఎంసీలు నీరు బంగాళాఖాతంలో కలిసి పోతున్నందున ఈ వృధా జలాలను వినియోగించుకునే విధంగా ప్రతిపాదించిన పోలవరం-నల్లమల సాగర్ ప్రాజెక్టుకు అవసరమైన అన్ని అనుమతులు ఇవ్వాలని, గోదావరి వృథా జలాల వినియోగించుకోవడంలో రెండు తెలుగు రాష్ట్రాలు లబ్ధి పొందాలనేదే ముఖ్యమంత్రి చంద్రబాబు ఉద్దేశమ న్నారు. చిన్నపాటి సమస్యలు ఏమైనా తెలంగాణతో ఉంటే సానుకూల వాతావరణంలో చర్చల ద్వారా సర్దుబాటు చేసుకుంటా మని తెలిపారు. ఆల్మట్టి డ్యామ్ ఎత్తు సుప్రీంకోర్టు పరిధిలో ఉన్నందున ఆర్ అండ్ ఆర్, భూ సేకరణ వంటి వాటికి కర్ణాటక ముందుకు వెళ్లకుండా సహకరించాలని కోరామని చెప్పారు.

# చేనేత సహకార సంఘాల నుంచే వస్త్రాలు

- నేరుగా దగ్గరకొచ్చే కొనుగోలు చేస్తాం
- నాణ్యమైన సరుకును ఆప్కోకు విక్రయించండి
- నేతన్నలకు స్కిల్ పెంచేలా శిక్షణ ఇస్తాం
- ట్రెండ్‌కు తగ్గట్లు రెడీమేడ్ వస్త్రాలు నేయండి
- చేనేతల ఆదాయం రెట్టింపు కూటమి లక్ష్యం
- మహానాడులో ప్రత్యేక స్టాల్లు ఏర్పాటు చేస్తాం
- ఆప్కోకు తొలిసారి టీటీడీ ఆర్డర్ ఇచ్చింది
- ఆసక్తి కలిగి ముందుకొస్తే అవకాశమిస్తాం
- త్వరలో నేతన్న భరోసాకు శ్రీకారం
- చేనేత జౌళి శాఖ మంత్రి సవిత



అమరావతి(చైతన్యరథం): నేతన్నలకు ఆదాయం రెట్టింపు చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, వారికి ఆర్థిక మేలు కలిగే లా చేనేత సహకార సంఘాల దగ్గరకు వచ్చే చేనేత వస్త్రాలను కొనుగోలు చేస్తామని మంత్రి ఎస్.సవిత స్పష్టంచేశారు. ఇండెంట్ లో పేర్కొన్న నాణ్యమైన వస్త్రాలనే ఆప్కోకు విక్రయించాలని, ఆ సంస్థను నిలబెట్టుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని సూచిం చారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తున్నాం. ఇప్పటికే ఉచిత విద్యుత్ అందజేశాం. చేనేతల ఆరోగ్య రక్షణకు యూనివర్సల్ హెల్త్ పాలసీని తీసుకొస్తున్నాం. నేతన్న భరోసా పథకం ద్వారా రూ.25 వేల ఆర్థిక సాయం అందించ డానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న చేనేత సహకార సంఘాల ప్రతినిధులతో మంత్రి సోమవారం భేటీ అయ్యారు. చేనేత సహకార సంఘాల నుంచి చేనేత వస్త్రాల కొనుగోలు, ఇతర సమస్యలపై చర్చించారు. 365 రోజులూ చేనేతలకు ఉపాధి కల్పించాలన్న లక్ష్యంతో కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన 23 నెలల కాలంలో ఆప్కో ద్వారా రూ.190 కోట్ల అమ్మకాలు చేసినట్లు వివరించారు. ఆప్కో షోరూమ్‌లలో అమ్మకాలు పెంచడానికి సిబ్బందికి శిక్షణ ఇచ్చామ న్నారు. ఉచిత విద్యుత్ పథకం ద్వారా నేతన్నల కుటుంబాలకు ఎంతో మేలు జరుగుతుందని వివరించారు. 90 శాతం సబ్సిడీతో మగ్గం పనిముట్లు అందజేస్తున్నామని, నూలు కొనుగోలుపై 15 శాతం సబ్సిడీ ఇస్తున్నామని తెలిపారు. నేతన్నలకు రెట్టింపు ఆదా యం అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని వెల్లడించారు.

### చేనేత అమ్మకాలకు మార్కెటింగ్ సౌకర్యాలు

చేనేత అమ్మకాలకు మార్కెటింగ్ సౌకర్యాలు కల్పిస్తున్నామని, సోషల్ మీడియాలో విస్తృతం ప్రచారం చేస్తున్నామని తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా అమ్మకాలు చేస్తున్నామని, 6,770 చేనేత ఉత్పత్తులను 40ఆప్కో షోరూమ్‌ల ద్వారా ఈ కామర్స్ ద్వారా విక్రయిస్తు న్నామని వెల్లడించారు. జాతీయ, రాష్ట్రస్థాయిలో ఎగ్జిబిషన్లు నిర్వహి స్తున్నామని, వాటికి విశేష స్పందన లభిస్తోందని తెలిపారు. నెల్లూరులో జరిగే మహానాడు సందర్భంగా చేనేత ఎగ్జిబిషన్ స్టాల్లు ఏర్పాటు చేయబోతున్నట్లు చెప్పారు. చేనేతలకు ఆర్థిక మేలు కలిగేలా చేనేత సహకార సంఘాల చెంతకు వచ్చి చేనేత వస్త్రాలను కొనుగోలు చేస్తామని స్పష్టం చేశారు. అధికారులు ఇచ్చిన ఇండెంట్‌ను దృష్టిలో పెట్టుకుని నాణ్యమైన వస్త్రాలను, ప్రస్తుత తరం అభిరుచులకు అనుగుణంగా చేనేత వస్త్రాలను తయారు చేసి ఆప్కోకు విక్రయించాలన్నా రు. చేనేత రెడీమేడ్ వస్త్రాలను తయారు చేయాలని, ఇందుకు అవసరమైన శిక్షణ అందించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని వెల్లడించారు.

### ఆప్కోకు తొలిసారి టీటీడీ ఆర్డర్

ఆప్కో చరిత్రలో తొలిసారిగా తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి రూ.20 కోట్లకు పైబడి ఆర్డర్ వచ్చినట్లు తెలిపారు. కండువాలు, దుశ్శాలువాలు, చీరలు, దుప్పట్లు, బ్లౌజ్‌లను టీటీడీకి అందజేయాల్సి ఉంటుందని తెలిపారు. ఆ వస్త్రాలపై శంకు చక్రాలతో పాటు ఓం నమో వెంకటేశాయ అని ముద్రించాలని సూచించారు. ఆసక్తి కలిగిన వారు ముందుకొస్తే టీటీడీకి వస్త్రాల ను తయారు చేసే అవకాశమిస్తామని తెలిపారు. నేతన్న భరోసా పథకం కింద రూ.25 వేల ఆర్థిక సాయం అందించడానికి ప్రణా ళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. అనంతరం వివిధ జిల్లాలకు చెందిన చేనేత సహకార సంఘాల ప్రతినిధులు తీసుకొచ్చిన చేనేత వస్త్రాలను మంత్రి పరిశీలించారు. వాటి ధరలతో పాటు ఏయే ప్రాంతాల నుంచి తీసుకొచ్చారో అడిగి తెలుసుకున్నారు. అంతకు ముందు రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన చేనేత సహకార సంఘ ప్రతినిధులు మాట్లాడుతూ పలు సమస్యలను పరిష్కరించా లని కోరారు. ఉచిత విద్యుత్ పథకం అందజేసినందుకు కూటమి ప్రభుత్వానికి, సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సమావేశంలో జౌళి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడి యా, కమిషనర్ రేఖారాణి పాల్గొన్నారు.

# కేంద్రమంత్రి నితిన్ గడ్కరీతో పెమ్మసాని భేటీ

- కాజా టోల్‌ప్లాజా ట్రాఫిక్ సమస్యపై వినతి
- రాష్ట్రంలో పలు ప్రాజెక్టులపైనా చర్చ
- రైల్వేమంత్రితో ఎంపీ లావు సమావేశం

ఢిల్లీ: కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ సోమవా రం ఢిల్లీలో పర్యటించారు. తన పర్యటనలో భాగంగా కేంద్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీని కలిశారు. ఈ భేటీలో పలు కీలక అంశాలపై చర్చించారు. గుంటూరు - విజయవాడ జాతీయ రహదారి సమన్వయం చేస్తూ కాజా టోల్‌గేట్ సమీపాన నిర్మించిన వెస్ట్ బైపాస్ వద్ద ఏర్పడుతున్న ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించా లని విజ్ఞప్తి చేశారు. విజయవాడ వెస్ట్ బైపాస్ ఎన్‌హెచ్ - 16తో కలిసే చిన్నకాకాని జంక్షన్ వద్ద ప్రస్తుతం గ్రేడ్ సెపరేటెడ్ ఇంట ర్‌చేంజ్ లేకపోవడంతో ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్నాయని వివరించారు. విజయవాడ వైపు వెళ్లే వాహనాలు హైల్యాండ్ ఫ్లైఓవర్ కింద ఉన్న రెండు లైన్ల సర్వీస్ రోడ్, యూటర్న్ ద్వారా వెళ్లాల్సి వస్తోందని తెలిపారు. దీంతో గంటల తరబడి ట్రాఫిక్ నిలిచిపోవడం, లక్షలాది మంది ప్రయాణికులు ఇబ్బంది పడుతు న్నారని పేర్కొన్నారు. అంతేకాక రాష్ట్రంలో పలు ప్రాజెక్టులపైనా చర్చించారు.

### రైల్వేమంత్రి అశ్విని వైష్ణవ్‌తో లావు సమావేశం

రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌తో తెలుగుదేశం ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు భేటీ అయ్యారు. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించారు. పల్నాడు అభివృద్ధికి సంబంధించి కీలక రైల్వే ప్రాజెక్టులపై మాట్లాడారు. పిడుగురాళ్ల - శ్రావల్యాపురం నుంచి రామాయపట్నం పోర్టుకు రైల్వేలైన్ నిర్మించాలని ఎంపీ విజ్ఞప్తి చేశారు. రామాయపట్నం పోర్టు కనెక్టివిటీతో పల్నాడులో పారిశ్రామిక, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని వివరించారు. నడికుడి లేదా పిడుగురాళ్ల స్టేషన్లలో వందేభారత్ ఎక్స్‌ప్రెస్ (సికింద్రాబాద్ - తిరుపతి) నిలపాలని విజ్ఞపి చేశారు. లింగంపల్లి - విజయవాడ ఎక్స్‌ప్రెస్ (12796) హాల్టింగ్ కోసం కేంద్ర మంత్రికి ఎంపీ వినతిపత్రం అందజేశారు. విజయవాడ - బెంగళూరు మధ్య కొత్తగా వందేభారత్ రైలును ప్రారంభించాలని కోరారు.



విద్యార్థులు, ఐటీ ఉద్యోగులు, వ్యాపారుల సౌకర్యార్థం హైస్పీడ్ కనెక్టివిటీ అవసరమని తెలిపారు. ఎంపీ లావు ప్రతిపాద నలపై సానుకూలంగా స్పందించారు. పల్నాడు ప్రాంత రైల్వే సమస్యల పరిష్కారానికి అశ్విని వైష్ణవ్ హామీ ఇచ్చారు.

చైతన్యరథం

## సోమశిల హై లెవెల్ కెనాల్‌ను పూర్తి చేస్తాం

# చివరి ఆయకట్టుకు నీరు అందిస్తాం

**- దేవాదాయ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి**

ఆత్మకూరు(చైతన్యరథం): సోమశిల హై లెవెల్ కెనాల్‌ను పూర్తి చేసి మర్రిపాడు మండలం చివరి భూముల వరకు నీరు ఇవ్వడమే ప్రధాన లక్ష్యమని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. మర్రిపాడు మండలం పల్లవోలు గ్రామంలో సీతారాముల స్వామి దేవస్థానంలో విగ్రహ ప్రతిష్ఠ, ప్రత్యేక పూజల్లో మంత్రి పాల్గొన్నా రు. పల్లవోలు గ్రామ పంచాయతీలో 25 లక్షలతో నిర్మించిన సిమెంట్ రోడ్లను ప్రారంభించారు. హై లెవెల్ కెనాల్ రూపకల్పన జరిగింది మాతోనే..పూర్తి చేసేది కూడా తమ ప్రభుత్వమేనని తెలిపారు. గత పదేళ్లలో మర్రిపాడు మండలానికి చెందిన ప్రజా ప్రతినిధులు పది రూపాయలు కూడా హై లెవెల్ కెనాల్ కోసం ఖర్చు చేయలేదని చెప్పారు. పదేళ్ల క్రితం తాను ఎలా ప్రారం భించానో ఇప్పటికీ అలాగే ఉంది..మళ్లీ ఇప్పుడు తమ హయాం లోని పనులు మొదలయ్యాయని తెలిపారు. భూసేకరణ పనులు జరుగుతున్నాయి..కాంట్రాక్టర్లు సిద్ధంగా ఉన్నారు. రెండేళ్లలో హై లెవెల్ కెనాల్‌ను పూర్తి చేసి మర్రిపాడు మండలానికి



సాగునీరు, తాగునీరు అందించడమే సంకల్పంగా పనిచేస్తున్నామని వివరిం చారు. అంతకుముందు మర్రిపాడు మండలంలో ముగ్గురు లబ్ధి దారులకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా 2.47 లక్షల విలువైన చెక్కులు పంపిణీ చేశారు. గిరిజన కాలనీలో గిరిజనులు తెలిపిన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. గిరిజనులకు ఇల్లు, ఇళ్ల స్థలాల కోసం సర్వే చేయాలని అధికా రులను ఆదేశించారు.

## నియోజవర్గాలు, పార్లమెంట్లలో మహానాడు

- 18 నుంచి 24 వరకు నిర్వహించాలి
- తీర్మానాలను పార్టీ కార్యాలయానికి పంపాలి
- టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు



మంగళగిరి (చైతన్యరథం): స్వర్గీయ ఎన్టీఆర్ జన్మదినం సందర్భంగా పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు ఆదేశానుసారం అన్ని పార్లమెంట్లు, నియోజకవర్గాలలో మహానాడు ఘనంగా నిర్వహించాలని రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు తెలిపారు. ఈ నెల 18, 19, 20 తేదీలలో నియోజకవర్గ మహానాడులు, 23, 24 తేదీలలో పార్లమెంట్ మహానాడులు నిర్వహించాలని సూచిం చారు. మహానాడులో తీసుకున్న తీర్మానాలను కేంద్ర పార్టీ కార్యా లయానికి పంపించాలన్నారు. నియోజకవర్గ మహానాడు తీర్మానాల ను 21వ తేదీ నాటికి, పార్లమెంట్ మహానాడు తీర్మానాలను 24వ తేదీ నాటికి కేంద్ర పార్టీ కార్యాలయానికి పంపించాలని సూచిం చారు. నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, సానుభూతిపరు లు, మహిళలను మహానాడు కార్యక్రమానికి ఆహ్వానించి జయ ప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

# సూపర్ సిక్స్‌తో ప్రతి ఇంటా ప్రగతి సిరులు

- **2019-24 మధ్య గొడ్డలి పార్టీ రూ.10లక్షల కోట్ల అప్పులతో రాష్ట్రాన్ని నాశనం చేసింది**
- **చంద్రబాబు విజన్‌తో అమలవుతున్న సూపర్ సిక్స్ పథకాలు రాష్ట్ర అభివృద్ధికి మైలురాళ్లు**
- **దేశంలో ఎక్కడా లేని విధంగా వృద్ధులకు రూ.4వేలు, దివ్యాంగులకు రూ.6వేలు పెన్షన్ ఇస్తున్న ఏకైక ప్రభుత్వం మనది**
- **గతంలో పెన్షన్ల కోసం ఏడిపించారు**
- **నేడు మొదటి నెల నుంచే పెంచిన పెన్షన్లు అందిస్తున్నాం**
- **టీడీపీ జాతీయ ఉపాధ్యక్షురాలు పీతల సుజాత**



మంగళగిరి (చైతన్యరథం): గొడ్డలి పార్టీ పాలనలో గత ఐదేళ్లు రాష్ట్రం ఎంతలా చితికిపోయిందో మనందరం చూశాం. 2019 నుంచి 2024 వరకు పది లక్షల కోట్ల రూపాయల అప్పులు చేసి, సామాన్యుడి నడ్డివిరిచి, రాష్ట్రాన్ని అంధకారంలోకి నెట్టేసి వెళ్లిపోయారని మాజీ మంత్రి, టీడీపీ జాతీయ ఉపాధ్యక్షురాలు పీతల సుజాత మండిపడ్డారు. ఆనాడు జరిగిన విధ్వంసం అంతా ఇంతా కాదు. కానీ ఈ రోజు మన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అపారమైన విజన్, కూటమి ప్రభుత్వం యొక్క చిత్తశు ద్ధి వల్ల రాష్ట్రం మళ్లీ కోలుకుంటోందన్నారు. సంక్షేమ రంగంలో 'సూపర్ సిక్స్' పథకాలు ఒక సంజీవనిలా మారి ప్రతి ఇంటికీ వెలుగులు పంచుతున్నాయన్నారు. మంగళగిరిలోనీ టీడీపీ టీడీపీ కేంద్ర కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. 'గత ప్రభుత్వంలో 'అమ్మ ఒడి' అని పేరు పెట్టి, ఇంట్లో ఎంతమంది పిల్లలున్నా ఒక్కరికే ఇస్తామంటూ మోసం చేశారు. అది కూడా వేలాది మందికి ఎగ్గొట్టారు. కానీ మన కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం.. ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉంటే అంత మందికీ 'తల్లికి వందనం' పథకాన్ని వర్తింపజేస్తున్నాం. ఈ రెండు ఏళ్లలో దాదాపు 67లక్షల 27వేల మంది విద్యార్థులకు లబ్ధి చేకూర్చాం. ఏటా ఒక్కో బిడ్డకు రూ.15వేల చొప్పున అందిస్తూ, దాదాపు రూ.10,090 కోట్లను తల్లుల ఖాతాల్లో నేరుగా జమ చేశాం. కుటుంబానికి ఫైనాన్స్ మినిస్టర్ లాంటి తల్లికి ఆర్థిక ఇబ్బంది కలగకూడదని, బిడ్డల చదువు భారమవ్వకూడదనే లక్ష్యంతో చంద్రబాబునాయుడు ఈ నిర్ణయం తీసుకున్నారు. దేశ చరిత్రలోనే ఇలాంటి పథకం ఎక్కడా లేదని గర్వంగా చెప్తున్నాను. మహిళల ఆర్థికాభివృద్ధి కోసం ప్రవేశపెట్టిన ఉచిత బస్సు సౌకర్యం ఈ రోజు ఆడబిడ్డలకు ఎంతగానో ఉపయోగపడుతోంది. ప్రయాణ ఖర్చులు తగ్గి, ఆ డబ్బు పొదుపు రూపంలో కుటుంబానికి ఆసరాగా మారుతోంది. అభివృద్ధితో పాటు సామాన్యుడి ముఖంలో చిరునవ్వు చూడడమేనని మన ప్రభుత్వం నిరూపిస్తోందన్నారు.

### సూపర్ సిక్స్... సూపర్ ఫాస్ట్

'కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తక్కువ కాలంలోనే 'సూపర్ సిక్స్' పథకాలను సూపర్ ఫాస్ట్‌గా అమలుచేసి చూపిస్తున్నాం. ఇది ప్రజల భవిష్యత్తుకు భరోసా ఇచ్చే గ్యారెంటీ. విధ్వంసమైన రాష్ట్రాన్ని పునర్నిర్మించడం చంద్రబాబునాయుడు సారధ్యంలోనే సాధ్యమని నేడు నిరూపితమైంది. రాబోయే రోజుల్లో కూడా ఇదే ఉత్సాహంతో ప్రతి కుటుంబానికీ సంక్షేమ ఫలాలు అందుతాయని, ఆంధ్రప్రదేశ్ మళ్లీ నెం.1 రాష్ట్రంగా నిలుస్తుందన్నాను. పేదల ఆకలి తెలిసిన పార్టీ తెలుగుదేశం పార్టీ. ఆనాడు పేదవాడికి నెల గడవడానికి ఆసరా ఉండాలని స్వర్గీయ నందమూరి తారకరామారావు కేవలం 35 రూపాయలతో ఈ పెన్షన్ పథకాన్ని ప్రారంభించారు. అప్పటి నుంచి తెలుగుదేశం ప్రభుత్వం వచ్చినప్పుడల్లా పేదలకు పెన్షన్లను పెంచుతూనే వచ్చాం. నాడు చంద్రబాబునాయుడు 500 రూపాయలుగా ఉన్న పెన్షన్‌ను ఒకేసారి రూ.2వేలకు పెంచిన విషయం మనందరికీ తెలుసు. ఎన్నికల సమయంలో పెన్షన్లను రూ.4వేలకు పెంచుతామని కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చింది. అధికారం చేపట్టిన వెంటనే ఏమాత్రం ఆలస్యం చేయకుండా అన్న చెప్పినట్టుగానే రూ.4వేలు పెన్షన్ అమలు చేశాం. గత రెండు నెలల పెండింగ్‌తో కలిపి ఒకేసారి రూ.7వేలను ప్రతి ఇంటికీ వెళ్లి పంపిణీ చేసి పేదవాడి ఇంట్లో పండుగ వాతావరణం తీసుకొచ్చాం. దివ్యాంగులకు ఇచ్చే పెన్షన్‌ను రూ.3వేల నుంచి రూ.6వేలకు పెంచి వారి జీవితాల్లో వెలుగు నింపాం. పూర్తిగా మంచానికే పరిమితమైన రోగులకు రూ.15వేలు, కిడ్నీ, తలసేమియా బాధితులకు గతంలో ఉన్న రూ.5వేలు నుంచి రూ.15వేలకు పెన్షన్ పెంచి ఆదుకుంటున్నాం.' అన్నారు.

### ప్రజలను ముప్పుతిప్పలు పెట్టారు

'గత గొడ్డలి పార్టీ హయాంలో పెన్షన్ల పేరుతో ప్రజలను ఎలా ముప్పుతిప్పలు పెట్టారో చూశాం. రూ.3వేలు ఇస్తామని చెప్పి, ఏటా రూ.250 చొప్పున పెంచుతూ ప్రజలను ఏడిపించారు. కానీ చంద్రబాబు నాయుడు గారు బాధ్యత తీసుకోగానే మొదటి నెల నుంచే పెంచిన పెన్షన్లను అందిస్తున్నారు. ఇంత భారీ మొత్తంలో పెన్షన్లు ఇస్తున్న రాష్ట్రం దేశంలోనే మరొకటి లేదు. అప్పుల భారంతో రాష్ట్రం కొట్టుమిట్టాడుతున్నా పేదవాడి కడుపు నింపాలనే సంకల్పంతో చంద్రబాబు ఈ పథకాలను అమలు చేస్తున్నారు. ఇది కేవలం మన కూటమి ప్రభుత్వానికే సాధ్యం. ప్రతినెలా ఒకటో తేదీనే సూర్యోదయానికంటే ముందే ప్రభుత్వ యంత్రాంగం ద్వారా లబ్ధిదారుల చేతికి పెన్షన్ అందుతోందంటే అది మన నాయకుడి దక్షతకు నిదర్శనం. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ఈ ప్రభుత్వం ముందుకు సాగుతోంది'.

### రైతులు, మహిళలకు కొండంత అండ

దేశానికి వెన్నెముక రైతు అయితే కుటుంబానికి ఆధారం మహిళ. ఈ ఇద్దరూ బాగున్నప్పుడే రాష్ట్రం పచ్చగా ఉంటుంది. గత గొడ్డలి పార్టీ పాలనలో రైతు కన్నీరు పెడితే మహిళలు కష్టాల పాలయ్యారు. కానీ చంద్రబాబునాయుడు సారధ్యంలోని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలోనే రైతులకు, మహిళలకు కొండంత అండగా నిలిచింది. గత వైసీపీ ప్రభుత్వం రైతుల్ని నట్టేట ముంచింది. విత్తనాలు, ఎరువుల కోసం వారిని క్యూలైన్లలో నిలబెట్టి లాఠీ దెబ్బలు తినిపించారు. పంట పండితే గిట్టుబాటు ధర లేదు. అమ్ముకున్న పంటకు సకాలంలో పైసా రాలేదు. కానీ మన కూటమి ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకం ద్వారా ప్రతి రైతు కుటుంబానికి ఏటా రూ.20వేలు అందిస్తూ పెట్టుబడి భారానికి చెక్ పెట్టింది. ఇప్పటివరకు 46 లక్షల మంది రైతులకు దాదాపు రూ.9వేల కోట్ల లబ్ధి చేకూర్చాం. రైతు పండించిన పంటను కొనుగోలు చేసిన 24 గంటల్లోనే వారి ఖాతాల్లో డబ్బులు జమ చేస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానిదే. విత్తనం నుంచి విక్రయం వరకు రైతన్నకు తోడుగా ఉంటూ వారిని నిజమైన 'రాజు'గా చూస్తున్నాం. ఆనాడు మహిళలు పొగ చూరిన పొయ్యిల దగ్గర పడే ఇబ్బందులను చూసి చంద్రబాబు మొదటిసారి 'దీపం' పథకాన్ని తెచ్చారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం ద్వారా దీపం-2 పథకాన్ని అద్భుతంగా అమలు చేస్తున్నాం. ఇచ్చిన హామీ ప్రకారం ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లను ఉచితంగా పంపిణీ చేస్తున్నాం. దీని కోసం ప్రభుత్వం ఇప్పటికే రూ.2,684 కోట్లు ఖర్చు చేసింది. కోట్లాది గ్యాస్ సిలిండర్లను మహిళలకు అందించి ఆర్థిక భారాన్ని తగ్గించడమే కాకుండా ఆరోగ్యాన్ని కూడా కాపాడుతున్నాం. గ్యాస్ సిలిండర్ అంటే ఈ రోజు ప్రతి ఇంటి అవసరం.. ఆ అవసరాన్ని ఉచితంగా తీరుస్తున్న నిస్వార్థ నాయకుడు మన చంద్రబాబు.

### ఆకలి విలువ తెలిసిన ముఖ్యమంత్రి చంద్రబాబు

మనిషికి ఎన్నున్నా పట్టెడన్నం పెట్టినప్పుడే అసలైన తృప్తి దొరుకుతుంది. ఆకలి విలువ తెలిసిన నాయకుడు మన ముఖ్యమంత్రి. పేదవాడు ఆకలితో అలమటించకూడదనే గొప్ప సంకల్పంతో గతంలోనే అన్న క్యాంటీన్లను ప్రారంభించాం. కానీ ఆ గొడ్డలి పార్టీ అధికారంలోకి వచ్చాక కక్షగట్టి మరీ ఆ క్యాంటీన్లను మూసేసి పేదవాడి కడుపు కొట్టింది. ఆనాడు వాళ్లు చేసిన పాపానికి ప్రజలు తగిన బుద్ధి చెప్పారు. కూటమి ప్రభుత్వం రాగానే మనం చేసిన మొదటి మంచి పని.. మూతపడ్డ అన్న క్యాంటీన్ల తలుపులు తీయడం. ఈ రోజు రాష్ట్రవ్యాప్తంగా 200లకు పైగా అన్న క్యాంటీన్ల ద్వారా రూ.5కే నాణ్యమైన టిఫిన్, మధ్యాహ్నం, రాత్రి భోజనాన్ని గౌరవప్రదంగా అందిస్తున్నాం. అక్కడ పెడుతున్న భోజనం ఎంత రుచిగా, ఎంత శుభ్రంగా ఉందో సామాన్య ప్రజలే చెబుతున్నారు. భోజనం చేసే ప్రతి ఒక్కరూ చంద్రబాబును దీవిస్తున్నారు. మేము ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కూడా మా నాయకులు, కార్యకర్తలు వెనకడుగు వేయలేదు. గొడ్డలి పార్టీ అరాచకాలను ఎదిరించి మరీ సొంత ఖర్చుతో ఎన్నో నియోజకవర్గాల్లో అన్న క్యాంటీన్లు నడిపి పేదల ఆకలి తీర్చారు. ఇప్పుడు ప్రభుత్వపరంగా ఇంకా అద్భుతంగా లేనిచోట్ల కూడా కొత్త క్యాంటీన్లను ఏర్పాటు చేసి ముందుకు వెళ్తున్నాం. ప్రజల కోసం నిస్వార్థంగా పనిచేసే నాయకుడు ఉంటే ఎంతటి కష్టమైన పనినైనా సాధించవచ్చు అనడానికి ఈ అన్న క్యాంటీన్లే నిదర్శనం. ఒకవైపు ఆర్థిక ఇబ్బందులు ఉన్నా, పేదవాడి ఆకలి తీర్చడమే మొదటి ప్రాధాన్యతగా మా ప్రభుత్వం భావిస్తోంది. అన్న క్యాంటీన్లు కేవలం భోజనం పెట్టే కేంద్రాలు కావు... అవి పేదవాడి ఆత్మగౌరవ ప్రతీకలు. ఈ ప్రగతి రథం ఇలాగే కొనసాగుతుందని ఏ ఒక్కరూ ఆకలితో నిద్రపోని ఆంధ్రప్రదేశ్‌ను నిర్మిస్తామని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను.

### నిరుద్యోగులను నట్టేట ముంచారు

రాష్ట్ర అభివృద్ధి అంటే కేవలం సంక్షేమ పథకాలు మాత్రమే కాదు, మన బిడ్డల చేతికి ఉద్యోగం రావడం, వారి భవిష్యత్తు బాగుండటం. గత గొడ్డలి పార్టీ ఐదేళ్ల పాలనలో నిరుద్యోగులను నట్టేట ముంచింది. ఒక్క నోటిఫికేషన్ లేదు, ఒక్క ఉద్యోగం ఇవ్వలేదు. కేవలం వాళ్ల సొంత పనుల కోసం వలంటీరు వ్యవస్థను వాడుకున్నారే తప్ప చదువుకున్న నిరుద్యోగుల ఆవేదనను ఆనాడు పట్టించుకున్న నాథుడే లేడు. ఈ రోజు మన యువ నాయకుడు నారా లోకేష్ సారధ్యంలో యువతకు ఉద్యోగ కల్పనే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. మా లక్ష్యం స్పష్టం.. రాబోయే రోజుల్లో 25 లక్షల ఉద్యోగాలను సృష్టించి ప్రతి ఇంట్లో వెలుగులు నింపుతాం. అమరావతిలో 'క్వాంటం వ్యాలీ' లాంటి ప్రతిష్టాత్మక ప్రాజెక్టులు వస్తున్నాయి. విశాఖపట్నంలో ఐటీ కంపెనీల సందడి మొదలైంది. మొన్న జరిగిన జ×× సమ్మిట్‌లో లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులకు ఎంవోయూలు చేసుకున్నాం. అంటే లక్షలాది మంది మన బిడ్డలకు ఇక్కడే ఉద్యోగాలు రాబోతున్నాయి. ప్రభుత్వం వచ్చిన వెంటనే మాట నిలబెట్టుకుంటూ వేలాది టీచర్ పోస్టుల భర్తీకి శ్రీకారం చుట్టాం. కానిస్టేబుల్ పోస్టులనూ భర్తీ చేస్తూ నిరుద్యోగుల కలలను నిజం చేస్తున్నాం. ఒకవైపు అభివృద్ధిని వేగవంతం చేస్తూనే మరోవైపు సంక్షేమాన్ని ప్రజల ముంగిట చేరుస్తున్నాం. ఈ 'సూపర్ సిక్స్' పథకాలు కేవలం ఎన్నికల హామీలు కావు.. ఇవి ప్రతి పేదవాడి భవిష్యత్తుకు భరోసా, మన బిడ్డల ప్రగతికి గ్యారెంటీ. చంద్రబాబు విజన్, లోకేష్ కష్టం వల్లే ఈ రోజు ఆంధ్రప్రదేశ్ మళ్లీ గాడిలో పడింది. ప్రజలందరి ఆశీస్సులతో ప్రతి ఇంటికీ ఈ పథకాలు అందేలా, ప్రతి యువకుడికీ ఉపాధి దొరికేలా మా కూటమి ప్రభుత్వం నిరంతరం పనిచేస్తుంది' అని సుజాత చెప్పారు.

# శాంతి భద్రతలు, మౌలిక సదుపాయాలకు తొలి ప్రాధాన్యం

- **ప్రజలకు బెస్ట్ పోలీసింగ్ అందించడమే లక్ష్యంగా పోలీస్ స్టేషన్ల ఆధునికీకరణ**
- **ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర**
- **హోం మంత్రి అనితతో కలిసి కంకిపాడు, ఆత్కూరుల్లో పోలీస్ స్టేషన్ల నూతన భవనాలు ప్రారంభం**

ఆత్కూరు (చైతన్యరథం): రాష్ట్రంలో ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని రాష్ట్ర గనులు, భూగర్భవనరులు, ఎక్సైజ్ శాఖల మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. సోమవారం ఆయన హోం శాఖ మంత్రి వంగలపూడి అనితతో కలిసి పెనమలూరు నియోజక వర్గం కంకిపాడు, గన్నవరం నియోజకవర్గం ఆత్కూరుల్లో పోలీస్ స్టేషన్ నూతన భవనాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి రవీంద్ర మా ట్లాడుతూ... 'ప్రజలకు బెస్ట్ పోలీసింగ్ అందించేందుకు కూటమి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోంది. అందులో భాగంగానే రాష్ట్రంలోని అన్ని పోలీస్ స్టేషన్లను ఆధునికీకరిస్తున్నాం. పోలీస్ స్టేషన్ నిర్మాణానికి రూ.60 లక్షల సొంత నిధులు కేటాయించిన హరికృష్ణకి ప్రత్యేక ధన్యవాదాలు. అత్యాధునిక సదుపాయాలతో పోలీస్ స్టేషన్ నిర్మాణం హర్షణీయం. రాష్ట్రంలో ప్రజలకు మెరుగైన రక్షణ కల్పించడం, శాంతి భద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా చూసుకోవడంలో



ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పాత్ర అత్యంత కీలకం. మహిళలపై కేసుల నివారణలో కృష్ణా జిల్లాను అగ్రస్థానంలో నిలిపిన ఎస్పీకి ప్రత్యేక అభినందనలు తెలిపారు.'

శాంతి భద్రతల పరిరక్షణలో సాంకేతికత వినియోగం పెరిగినపుడే కేసుల పరిష్కారం వేగవంతం అవుతుంది. ఈ మధ్య నిర్వహించిన కలెక్టర్స్ కాన్ఫరెన్స్‌లో ఏఐ వినియోగం పెంచాలని సీఎం సూచించారు. ఇక్కడ ఏర్పాటుచేసిన కార్యక్రమంలో వినియోగించే కెమెరాలను కూడా ఏఐతో అనుసంధానిస్తే నేరస్తులను తక్షణం పట్టుకునే వెసులుబాటు కలుగుతుంది. తాజాగా తిరుమల తిరుపతి దేవస్థానంలో ఏఐ ఆధారిత వ్యవస్థ ఏర్పాటుతో ఏ కంపార్ట్‌మెంట్లో ఎంత మంది భక్తులు ఉన్నారో పర్యవేక్షిస్తూ తోపులాటకు ఆస్కారం లేకుండా చర్యలు తీసుకున్నారు.

ప్రజా రక్షణకు ప్రాధాన్యమిస్తూ తాజాగా పోలీస్ కానిస్టేబుల్ రిక్రూట్‌మెంట్ కూడా పూర్తి చేశాం. సుమారు 6వేల మంది కానిస్టేబుళ్లను నియమించాం. ప్రజల కోసం నిరంతరం ఆలోచించే ముఖ్యమంత్రి ఆలోచనలకు అనుగుణంగా మనం కూడా పని చేద్దామని మంత్రి రవీంద్ర పిలుపునిచ్చారు.

అనంతరం గన్నవరం నియోజకవర్గం ఆత్కూరులో రూ.1.20 కోట్ల ఉపాధి హామీ నిధులతో సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. రాష్ట్రవ్యాప్తంగా గుంతలు లేని రోడ్లు సాకారం చేసే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నాం. రోడ్ల నిర్మాణాల విషయంలో ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చొరవ అభినందనీయమన్నారు. ప్రతి గ్రామంలోనూ మౌలిక సదుపాయాలు కల్పించడం ద్వారా ఆ వాటి రూపురేఖలు మార్చేందుకు వెసులుబాటు కలుగుతుందని పేర్కొన్నారు.

కార్యక్రమంలో ఎమ్మెల్యేలు బోడే ప్రసాద్, యార్లగడ్డ వెంకట్రావు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వీరంకి వెంకట గురుమూర్తి, జనసేన జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ, ఎంపీపీ విజయలక్ష్మి, కలెక్టర్ డీకే బాలాజీ, ఎస్పీ విద్యాసాగర్, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రభుత్వ భూమిని కబ్జా చేశాడు

- **వైసీపీ మాజీ సర్పంచ్‌పై గ్రీవెన్స్‌లో ఫిర్యాదు**
- **కూడేరు మండలంలో భూ దోపిడీ... నోటీసులు లేకుండానే ఆన్‌లైన్ రికార్డుల తారుమారు**
- **దూళంవారిపల్లిలో భూ మాఫియా... న్యాయం చేయాలని వినతి**
- **అర్జీలు స్వీకరించిన ముస్లిం మైనారిటీ, న్యాయ శాఖల మంత్రి ఎన్ఎండీ ఫరూక్, శాసనమండలి చీఫ్ విప్ పంచుమర్తి అనురాధ**
- **సమస్యల పరిష్కారానికి కృషి చేసిన నేతలు**

మంగళగిరి (చైతన్యరథం): మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో సోమవారం ప్రజా వినతుల పరిష్కార వేదిక నిర్వహించారు. రాష్ట్రం నలుమూలల నుంచి విచ్చేసిన వారి నుంచి ముస్లిం మైనారిటీ, న్యాయ శాఖల మంత్రి ఎన్ఎండీ ఫరూక్, శాసనమండలి చీఫ్ విప్ పంచుమర్తి అనురాధ వినతులు స్వీకరించి వాటి పరిష్కారానికి కృషి చేశారు.

వైఎస్సార్ కడప జిల్లా ఒంటిమిట్ట మండలం కొత్త మాధవరానికి చెందిన నరసింహులు అర్జీ... మా గ్రామంలో జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న సుమారు 40 సెంట్ల ప్రభుత్వ భూమిని (విలువ సుమారు రూ.2కోట్లు పైమాటే) వైసీపీ మాజీ సర్పంచ్ ఆక్రమించుకున్నాడు. ఎటువంటి ప్రభుత్వ అనుమతి, పత్రాలు కానీ లేకుండానే ఈ స్థలంలో శాశ్వత కట్టడాలు నిర్మించి వాటిని అద్దెకు ఇస్తూ సొమ్ము చేసుకుంటున్నాడు. పక్కనే ఉన్న ప్రభుత్వ ఖాళీ స్థలాలను కూడా అడ్డగోలుగా విక్రయిస్తున్నాడు. సదరు ఆక్రమిత స్థలానికి ఎటువంటి డాక్యుమెంట్లు లేవని తహసీల్దారు, ఆ కట్టడాలకు ఎటువంటి ఇంటి పన్నులు కట్టట్లేదని పంచాయతీ కార్యదర్శి ధ్రువీకరించారు. అయినా మాజీ సర్పంచ్ నకిలీ అనుబంధ సర్టిఫికెట్లు, ఫోర్జరీ సంతకాలతో కూడిన నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి కోర్టు నుంచి తాత్కాలిక స్టే తెచ్చుకున్నారు. దీనిపై పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. వారిపై చర్యలు తీసుకుని ప్రభుత్వ స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలని విజ్ఞప్తి చేశాడు.

అనంతపురం జిల్లా కూడేరు మండలం కమ్మూరు గ్రామానికి చెందిన లక్ష్మీకాంతమ్మ వినతి. నా తండ్రి ఎం.ఎర్ర సుబ్బన్నకు 2007లో ప్రభుత్వం సర్వే నెం.495/3లో 5 ఎకరాల డి-పట్టా భూమి మంజూరు చేసింది. నా తండ్రి 8.2.25న అనారోగ్యంతో మరణించిన తర్వాత నాకు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండానే స్థానిక తహసీల్దారు, వీఆర్వో కుమ్మక్కై ఆ భూమిని ఆన్‌లైన్‌లో ఇతరుల పేరిట నమోదు చేశారు. నాకు తెలియకుండానే మహమ్మద్ బాషా (05 సెంట్లు), పూజారి ప్రసాద్ (2.45 ఎకరాలు) పేర్లతో ఆన్‌లైన్ రికార్డులను మార్చారు. దీనిపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా, ఆర్డీవో కోర్టులో అప్పీల్ వేసినా ఫలితం లేకుండా పోయింది. కోర్టులో కేసు పెండింగ్‌లో ఉండగానే మళ్లీ ఎ.ప్రదీప్ కుమార్, ఇందిరాదేవి, మారుతీ ప్రసాద్, ఎం.వెంకటరమణ పేర్లపై మరో 2.50 ఎకరాల భూమిని ఆన్‌లైన్ నమోదు చేశారు.

అన్నమయ్య జిల్లా పెద్దతిప్పసముద్రం మండలం మజరా దూలంవారిపల్లి గ్రామానికి చెందిన శ్రీనివాసులు విజ్ఞప్తి... నా తండ్రి (లేట్) సి.వెంకట్రాయప్ప పేరుతో 1989లో ప్రభుత్వం సర్వే నెం.41-4లో 1.58 ఎకరాల వ్యవసాయ భూమి (పట్టా నా.వీ.చీశీ. 923/4/1989) మంజూరు చేసింది. గత 30 ఏళ్లుగా ఈ భూమిపైనే ఆధారపడి వ్యవసాయం చేసుకుంటున్నాం. గత ప్రభుత్వ హయాంలో



కొంతమంది అధికారుల సహకారంతో రికార్డులను తారుమారు చేసి మా భూమిని దూళంవారిపల్లికి చెందిన కడపల ఆనందరెడ్డి దౌర్జన్యంగా ఆక్రమించుకున్నాడు. ఆనందరెడ్డి సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా బలవంతుడు కావడంతో మా భూమిని మేము కాపాడుకోలేక ఇబ్బందిపడుతున్నాం. దీనిపై పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి న్యాయం జరగలేదు.

ప్రకాశం జిల్లా దొనకొండ మండలం గంగాదేవిపల్లి గ్రామానికి చెందిన మయబ్రహ్మాచారి అర్జీ... మా గ్రామంలో సర్వే నెం.601.3లో 1.80 ఎకరాలు, సర్వే నెం.601.4లో 1.90 ఎకరాల మెట్ట భూమి మా తల్లిదండ్రులైన లేటు క్రిష్టపాటి అన్నపూర్ణమ్మ, చంద్రశేఖరాచారి పేరిట ఉంది. ఈ భూమికి సంబంధించి రెవెన్యూ రికార్డుల్లోను, 'మీ భూమి' ఆన్‌లైన్ పోర్టల్‌లోను డిజిటల్ పట్టా పాసు పుస్తకాల్లో స్పష్టంగా మా తల్లి అన్నపూర్ణమ్మ పేరు (ఖాతా నెం.1799) నమోదు చేసి ఉంది. జీవనోపాధి నిమిత్తం గుంటూరులో నివసిస్తుండటాన్ని అదునుగా తీసుకున్న బొరిగొర్ల వెంకటేశ్వర్లు ఈ భూమిని ఆక్రమించుకు న్నాడు. అంతే కాకుండా స్థానిక రెవెన్యూ అధికారులను, రాజకీయ నాయకులను లోబరుచుకుని అతడి పేరిట అక్రమంగా నమోదు చేయించుకున్నాడు. దీనిపై ప్రశ్నిస్తే ... నీకు దిక్కున్న చోట చెప్పుకో, చేనులోకి అడుగుపెడితే నీ అంతు చూస్తా" అని సదరు వ్యక్తి ప్రాణహాని తలపెట్టేలా బెదిరింపులకు పాల్పడుతు న్నాడు.

సత్యసాయి జిల్లా ధర్మవరం మండలం రేగాటిపల్లికి చెందిన పెద్దన్న విన్నపం... మా గ్రామంలో 1997 నుంచీ సాగు చేసుకుంటున్న భూమిని కొంతమంది స్థానిక బలవంతులు ఆక్రమించుకున్నారు. నా అనుమతి లేకుండానే ఆ భూమిని ఇతరులకు కౌలుకు ఇస్తూ మాకు అన్యాయం చేస్తున్నారు. మా భూమిని మాకు ఇప్పించాలని కోరుతూ గతంలో పలుమార్లు తహసీల్దారు, ఆర్డీవో, కలెక్టర్ కార్యాలయాల్లో వినతిపత్రాలు సమర్పించాం. క్షేత్రస్థాయిలో ఎటువంటి చర్యలూ తీసుకోకపోవడంతో ఇప్పటికీ ఆ భూమి ఆక్రమణదారుల గుప్పిట్లోనే ఉంది.

అనంతపురం జిల్లా గుమ్మగట్ట భైరవానితిప్పకు చెందిన హనుమక్క విన్నపం... మా గ్రామంలో సర్వే నెం.392లో 0.02 సెంట్ల స్థలాన్ని ప్రభుత్వం కేటాయించి 28.12.2022న నా పేరిట పట్టా ఇచ్చారు. రూ.లక్ష అప్పు చేసి మరీ బేస్మెంట్ (పునాది) కట్టుకున్నాను. కానీ నేను గ్రామంలో లేని సమయం చూసి కొందరు దుండగులు అన్యాయంగా పునాదులను పీకివేశారు. దీనిపై తహసీల్దారుకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. న్యాయం కోసం రాయదుర్గం సివిల్ కోర్టును ఆశ్రయించాను. కోర్టు నా వైపు న్యాయం ఉందని గుర్తించి నాకు అనుకూలంగా ఇంజంక్షన్ ఆర్డర్ ఇచ్చింది. అయినా వీఆర్వో రమేష్, ఆర్ఐ రామాంజనేయులు, సర్వేయర్ కలిసి నన్ను తీవ్రంగా వేధిస్తున్నారు. కలెక్టర్‌కి ఫిర్యాదు చేసినా... "మీరు కలెక్టర్ దగ్గరకు వెళ్లి ఫిర్యాదు చేస్తారా?" అంటూ ఆ ముగ్గురు అధికారులూ నన్ను ఇష్టమొచ్చినట్లు తిడుతూ మానసికంగా ఇబ్బంది పెడుతున్నారు. కోర్టు ఉత్తర్వులను గౌరవించకుండా పేద మహిళనైన నన్ను ఇల్లు కట్టుకోనివ్వకుండా అడ్డుకుంటున్నారు.

సత్యసాయి జిల్లా కొత్తచెరువు మండలం బంగారుచెన్నేపల్లికి చెందిన రామిరెడ్డి అర్జీ... అనంతపురం టౌన్ రామ్‌నగర్ నివాసి అయిన మాధవరెడ్డి, అతని కుమారుడు విజయ్ మోహన్‌రెడ్డి... నా నుంచి భూమి కొనుగోలు నిమిత్తం ఒప్పందం చేసుకున్నారు. ఇందుకు ప్రతిఫలంగా రూ.10లక్షలు విలువైన చెక్కులను అంద జేశారు. అయితే ఆ చెక్కులను బ్యాంకులో జమ చేయగా చెల్లలేదు. నా డబ్బు గురించి సదరు వ్యక్తులను నిలదీయగా వారు దురుసుగా ప్రవర్తించడమే కాకుండా అటాక్ చేయడానికి ప్రయత్నించారు. పుట్టపర్తి రైల్వే స్టేషన్ సమీపంలో కొత్త వ్యక్తులతో కలిసి నన్ను చంపే ఉద్దేశ్యంతో దాడికి పాల్పడ్డారు. అక్కడ ప్రజలు గుమిగూడ టంతో ప్రాణాలతో బయటపడ్డాను. ముఖ్య నిందితుడు మాధవరెడ్డిపై ఇప్పటికే అనంతపురం టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో పలు క్రిమినల్ కేసులు, ఇతర అక్రమ కేసులు నమోదై ఉన్నాయి. గతంలో రెడ్డిపల్లి సబ్ జైలుకు కూడా వెళ్ళి వచ్చిన ఆ వ్యక్తి రాజకీయ పలుకుబడి ఉపయోగించుకుని అతడిపై నమోదైన పాత కేసులను రద్దు చేసుకున్నాడు.

అన్నమయ్య జిల్లా నందలూరు మండలం టంగుటూరు చెందిన శ్యామలమ్మ విజ్ఞప్తి.... మా మామగారైన అవసాని యద్దయ్యకు ముగ్గురు కుమారులు (నారాయణ, రామచంద్రయ్య, నరసింహులు). పెద్ద కుమారుడైన మా బావగారు నారాయణ 5.12.2009న మరణించారు. ఆయన భార్య ముందే మరణించింది. వారికి సంతానం లేదు. వారసత్వంగా ఆ భూమి మాకు చెందాలి. మా బావగారికి టంగుటూరు రెవెన్యూ గ్రామ సర్వే నెం.1112/3లో రెండెకరాల పట్టా భూమి ఉంది. దానికి సంబంధించిన పట్టాదారు పాస్ పుస్తకాలను పుల్లంపేటకు చెందిన వైసీపీ నాయకులు బండి మారుబాబు, రెవూరు రామచంద్ర కలిసి దొంగతనంగా తీసుకువెళ్లారు. రాజకీయ పలుకుబడి, డబ్బు బలంతో నందలూరు మండల తహసీల్దారు, గ్రామ కార్యదర్శిని లోబరుచుకుని మాకు ఎలాంటి సంబంధం లేని బండి హరిబాబు పేరు మీద ఆ భూమిని అక్రమంగా ఆన్‌లైన్ చేయించుకున్నారు. మా బావగారి డెత్ సర్టిఫికెట్ కోసం ఎన్నిసార్లు దరఖాస్తు చేసినా జిల్లా అధికారుల ఆదేశాలున్నా మండల అధికారులు మంజూరు చేయట్లేదు. భూమి రికార్డులు మార్చవద్దని కోరినా రాజకీయ నాయకుల ఒత్తిడితో అధికారులు మా మాట వినట్లేదు.

అనంతపురం జిల్లా పెద్దవడుగూరు మండలం దిన్మెగుడి గ్రామానికి చెందిన రామాంజనేయులు అర్జీ... బోడగాని దాకి గ్రామ పరిధిలోని సర్వే నెం.44/2లో సుమారు 3.83 ఎకరాల భూమిని ప్రభుత్వం 1950లో మా బంధువు అయిన ఆసాది ఓబులేసుకు 'డి-పట్టా' కింద మంజూరు చేసింది. 76 ఏళ్లుగా ఆ కుటుంబం ఆ భూమిని సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాం. ఓబులేసు మరణించాక ఆర్థిక ఇబ్బందులతో మా కుటుంబ సభ్యులు పనుల కోసం అనంతపురం పట్టణానికి వలస వెళ్లాం. మేము గ్రామంలో లేని సమయాన్ని అదునుగా తీసుకున్న చిన్ను సుబ్బరాయుడు, వి.వెంకటేషులు, టి.బీజన్యం రసూల్ సాబ్, అల్లీ పీరా అనే నలుగురు వ్యక్తులు.. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఆ 'డి-పట్టా' భూమిని చెరో 96 సెంట్ల చొప్పున అక్రమంగా రికార్డుల్లోకి ఎక్కించుకుని రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. దీనిపై పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి న్యాయం జరగలేదు.

పై వాటితో పాటు పలువురు పింఛన్, రేషన్, ఇళ్ల నిర్మాణాల సమస్యలపై అర్జీలు ఇచ్చి పరిష్కరించాలని కోరగా.. మరికొందరు ఉద్యోగాల కోసం రెస్యూమ్‌లు ఇచ్చారు. అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నాం ఆర్థిక తోడ్పాటు కల్పించాలని మరికొందరు అభ్యర్థనలు అందించారు.

చైతన్యరథం

# నిడదవోలు ఆర్‌వోబీ పనులు వేగవంతం

**- మంత్రి కందుల దుర్గేష్ ఆదేశం**

**- నాణ్యతతో నిర్మాణం జరగాలని సూచన**



నిడదవోలు(చైతన్యరథం): పర్యాటక, మంత్రి కందుల దుర్గేష్ నిడదవోలు పట్టణ అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించారు. ఈ నేపథ్యంలో సోమవారం నిడదవోలు పట్టణంలో విస్తృతంగా పర్యటించారు. పట్టణ అభివృద్ధిలో అత్యంత కీలకమైన ఆర్‌ఓబీ (రైల్వే ఓవర్ బ్రిడ్జ్) నిర్మాణ పనులతో పాటు, డ్రైనేజీ వ్యవస్థను ఆయన ప్రత్యక్షంగా పరిశీలించారు. ముందుగా నిర్మాణంలో ఉన్న ఆర్‌వోబీ పనులను పరిశీలించిన మంత్రి దుర్గేష్ పనుల తాజా స్థితిగతులపై అధికారులను ఆరా తీశారు. నీటి మళ్లింపు చేస్తూ ప్రజలకు రాకపోకల పరంగా ఎలాంటి ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పట్టణ ప్రజల దశాబ్దాల కల అయిన ఈ బ్రిడ్జిని యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. నిర్మాణం పూర్తయితే పట్టణంలో ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఆయన పేర్కొన్నారు. అనంతరం జెండాల వీధి నుంచి బస్టాండ్ వరకు జరుగుతున్న డ్రైనేజీ నిర్మాణ పనులను మంత్రి దుర్గేష్ పరిశీలించారు. కొన్ని చోట్ల పనులు నిలిచిపో యాయని స్థానికులు ఫిర్యాదు చేయగా మంత్రి తక్షణమే స్పందించారు. పెండింగ్‌లో ఉన్న డ్రైనేజీ పనులను సత్వరమే పూర్తి చేసి, పట్టణ పారిశుద్ధ్యం మెరుగుపడేలా చూడాలని అధికారులకు కఠిన ఆదేశాలు జారీ చేశారు. ప్రజలకు అసౌకర్యం కలగకుండా అభివృద్ధి పనులు సాగాలని, నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడకూడదని స్పష్టం చేశారు.

# వేగంగా బెయిల్ పిటిషన్ల పరిష్కారం

- **హైకోర్టులకు సుప్రీంకోర్టు మార్గదర్శకాలు**
- **దేశవ్యాప్తంగా పెండింగ్ వివరాలపై ఆరా**
- **15 రోజుల్లో కేసులు విచారించాలని ఆదేశం**



న్యూఢిల్లీ: హైకోర్టులలో బెయిల్ పిటిషన్లు వేగంగా పరిష్కరిం చేందుకు సుప్రీంకోర్టు పలు సలహాలు, సూచనలు చేసింది. బెయి ల్ పిటిషన్ల లిస్టింగ్, విచారణలో పదేపదే జరుగుతున్న ఆలస్యం, కేసులు భారీగా పేరుకుపోతుండటంపై చీఫ్ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ఆందోళన వ్యక్తం చేసింది. సోమవారం సన్నీ చౌహాన్ వర్సెస్ స్టేట్ ఆఫ్ హర్యానా కేసుపై సుప్రీంకోర్టు విచారణ జరిపింది. విచారణకు ముందే దేశవ్యాప్తంగా ఉన్న అన్ని హైకోర్టుల నుంచి పెండింగ్ బెయిల్ అప్లికేషన్స్ వివరాలను ధర్మా సనం తెప్పించుకుంది. విచారణ సందర్భంగా వారం లేదా 15 రోజుల్లో బెయిల్ కేసులు విచారించాలని ధర్మాసనం హైకోర్టులను ఆదేశించింది. విచారణకు ముందే స్టేటస్ రిపోర్టులు తప్పనిసరిగా ఉండాలని తెలిపింది. బెయిల్ దరఖాస్తు కాపీని ఏజీకి తప్పక అందజేయాలని సూచించింది. కొత్త బెయిల్ పిటిషన్లను వారం లోగా విచారణకు తీసుకోవాలని తెలిపింది. దేశవ్యాప్తంగా ఉన్న చాలా హైకోర్టులు సకాలంలో కేసుల పరిష్కారానికి ఇప్పటికే చొరవ తీసుకున్నాయని కూడా ధర్మాసనం వెల్లడించింది. అలహా బాద్ హైకోర్టు గురించి ప్రస్తావిస్తూ.. అక్కడి న్యాయమూర్తులు రోజుకు వందలాది కేసులను విచారిస్తున్నప్పటికీ ఇంకా చాలా కేసులు పెండింగ్‌లో ఉన్నాయని కోర్టు పేర్కొంది. ఫోరెన్సిక్ నివేది కలు ఆలస్యం కావడం వల్ల బెయిల్ ప్రక్రియ ఆగిపోకూడదని, వాటిని సకాలంలో అందించేలా రాష్ట్ర ప్రభుత్వాలతో మాట్లాడి చర్యలు తీసుకోవాలని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తులను ధర్మా సనం ఆదేశించింది. బెయిల్ విచారణ సమయంలో బాధితుల పక్షాన న్యాయవాదులు ఉండేలా.. వారి వాదనలు వినేలా తగిన యంత్రాంగాన్ని రూపొందించాలని సూచించింది.

# కర్నూలు రైతుబజారు విస్తరణకు శ్రీకారం

**- రూ.6 కోట్ల వ్యయంతో పనులకు భూమిపూజ**

**- చంద్రబాబు మాట ఇచ్చారు..నిలబెట్టుకున్నారు**

**- పరిశ్రమల మంత్రి టీజీ భరత్**



కర్నూలు(చైతన్యరథం): నగర అభివృద్ధిలో భాగంగా ప్రభుత్వం మరో కీలక ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టింది. నగరంలోని సి.క్యాంపు రైతు బజార్ విస్తరణ పనులకు పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ భూమిపూజ చేశారు. గతంలో ముఖ్యమంత్రి చంద్రబాబు కర్నూలు పర్యటన సందర్భంగా ఇచ్చిన హామీని నెరవేరుస్తూ సుమారు రూ.6 కోట్ల వ్యయంతో ఈ విస్తరణ పనులను చేపట్టారు. ఈ సందర్భంగా మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ రైతులకు, వినియో గదారులకు మెరుగైన వసతులు కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం. సి.క్యాంపు రైతు బజార్‌లో ప్రస్తుతం ఉన్న రద్దీని దృష్టిలో ఉంచుకుని, అత్యాధునిక సౌకర్యాలతో దీనిని విస్తరిస్తు న్నాం. ఈ పనులను వచ్చే తొమ్మిది నెలల కాలపరిమితిలోగా పూర్తి చేస్తాం. ఇందుకోసం అధికారులకు దిశానిర్దేశం చేశాం. రైతు బజార్ విస్తరణ పూర్తయిన వెంటనే సామాన్యుల సౌకర్యార్థం అక్కడ అన్న క్యాంటీన్‌ను కూడా ఏర్పాటు చేస్తామని వివరించారు. బి.క్యాంపు ప్రాంతంలో హైకోర్టు బెంచ్ ఏర్పాటుతో పాటు నూతన కలెక్టర్ కార్యాలయ నిర్మాణాన్ని కూడా ప్రతిష్టాత్మకంగా చేపట్ట బోతున్నాం. అభివృద్ధి, సంక్షేమం అనే రెండు నినాదాలతో కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోంది. ప్రజలకు మాట ఇచ్చాం.. నిలుపుకుంటున్నామని తెలిపారు.

# దాళ్వా సాగుతో లాభాల పంట

**తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం**

**అధిక దిగుబడులతో రైతుల్లో ఆనందం**

**ఈ ఏడాది పెరగనున్న సాగు విస్తీర్ణం**



పశ్చిమగోదావరి(చైతన్యరథం): దాళ్వా సాగులో రైతన్నలకు లాభాల పంట పండింది. తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించారు. కూటమి ప్రభుత్వ ప్రోత్సాహం, వాతావరణం అనుకూలం దాళ్వా సాగులో రైతులు ఎన్నడూ లేని ఆదాయం చవిచూస్తున్నారు. దాళ్వా పంట దిగుబడులలో సరాసరి దిగుబడి ఎకరానికి 55 బస్తాల నుంచి 60 బస్తాలు ఉండటం వరి సాగుకు మంచి రోజులుగా మారాయి. ఈ దాళ్వా పంటలో 15 వేల ఎకరాల వరకు సాగు భూమి పెరిగింది. 2.17 లక్షల ఎకరాల సాగు కాస్తా 2.31 లక్షల ఎకరాల సాగు జరిగింది. ప్రస్తుత పంట దిగుబడులను బట్టి వచ్చే పంటలలో సాగు విస్తీర్ణం పెరుగుతుందని నిపుణులు అంచనా వేస్తున్నారు.

**70 బస్తాల మైలురాయిని చేరారు**

ఈ ఏడాది దాళ్వా పంటలో రైతన్నలు రికార్డులు సృష్టించారు. ఎన్నడూ చూడని దిగుబడులు సాధించారు. వీరవాసరం మండలం లో ఎకరానికి 60 బస్తాలు పైబడి దిగుబడులు సాధించిన రైతులు ఉన్నారు. ఒక్కో చోట కొట్టు పొట్టుగా అమ్మిన ధాన్యం 70 బస్తాలు దిగుబడిగా వచ్చింది. మిగిలిన మండలాల్లోనూ 60 బస్తాలు చేరువలో పంట పండింది. వరిసాగులో గడిచిన నాలుగు పంటలు గా ధాన్యం దిగుబడి అంచనాలలో అధికారులు లెక్కకన్నా ఎక్కువ ధాన్యం పండుతోంది. ఈ దాళ్వా పంటలోను అదే తరహాలో అంచనా వేస్తున్నారు. ఇప్పటివరకు పశ్చిమగోదావరి జిల్లాలో 2 లక్షల 10 వేల ఎకరాల్లో పంట మాసూళ్ళు అయింది. 6 లక్షల టన్నులు కొనుగోలు జరిగింది. 2 లక్షలకు పైగా టన్నుల ధాన్యం రైతుల వద్ద ఉంది. ఇంకా 21 వేల ఎకరాల మాసూళ్ళు చేయాల్సి ఉంది. దాని లెక్కన 8.50 లక్షల టన్నుల కంటే దిగుబడి పెరగ నుంది. దాళ్వా పంటలో అధిక దిగుబడులు కౌలు రైతుల్లో ఆనం దాలను మిగిల్చాయి.

**పెట్టుబడి తగ్గింది.. లాభం పెరిగింది**

ఈ ఏడాది దాళ్వా పంటలో వాతావరణం అనుకూలించడం వల్ల రైతులకు పెట్టుబడి తగ్గింది. ఎకరానికి రూ.5 వేలు వరకు పెట్టుబడి తక్కువ అయింది. అదే అనుకూల వాతావరణం వల్ల దిగుబడులు బాగా పెరిగాయి. దీంతో పెట్టుబడి తక్కువ... లాభం ఎక్కువ సాగుగా దాళ్వా పంట మారింది. ఎకరానికి 55 బస్తాలు దిగుబడిగా లెక్కవేస్తే రూ. 98 వేలు రాబడి వస్తుంది. పెట్టుబడి ఎకరానికి రూ.35 వేలు వరకు అయింది. అంటే రూ.63 వేలు లాభం వచ్చింది. కౌలు రైతుకు రూ.22 వేలు లీజు తీసివేయగా రూ.46 వేలు మిగులుతుంది. ఈ లాభాలు వచ్చే సాగు చేయడానికి భరోసాగా ఉంటామని రైతులు అంటున్నారు.

# నూజివీడు సుందరీకరణకు శ్రీకారం

- **మొఘల్ చెరువులో వాకింగ్ ట్రాక్**
- **పచ్చదనం పెంపునకు చర్యలు**

నూజివీడు (చైతన్యరథం): నూజివీడు పురపాలక సంఘంగా ఏర్పడి 43 ఏళ్లు గడిచింది. నూజివీడు పట్టణ జనాభా దాదాపు లక్ష జనాభా ఉంది. ఎట్టకేలకు ప్రధాన వీధుల విస్తరణకు శ్రీకారం జరిగింది. మంత్రి పార్థసారథి తన ఎన్నికల ప్రచారంలో భాగంగా ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి ప్రధాన వీధుల విస్తరణ జరిపి నూజివీడు పట్టణాన్ని మోడల్ టౌన్‌గా తీర్చిదిద్దుతానని వాగ్దానం చేశారు. ఆ మేరకు అమలులో భాగంగానే నూజివీడు ఎన్టీఆర్ సర్కిల్ దగ్గర నుంచి పెట్రోల్ బంక్ సెంటర్ వరకు రహదారి విస్తరణ జరిపి డివైడర్‌ను ఏర్పాటు చేయడానికి పనులు ప్రారంభిం చారు. ఇప్పుడు సుందరీకరణపై దృష్టిపెట్టారు. ప్రస్తుతం జరుగుతు న్న రహదారి విస్తరణ పక్కనే ఉన్న మొగల్ చెరువులోకి పట్టణం లోని ప్రధాన డ్రెయిన్‌ల నుంచి మురుగునీరు చేరుతోంది. ఈ రహదారి విస్తరణలో భాగంగానే ఈ చెరువు కట్టను బలపరిచి చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేసే ప్రయత్నాలు చేస్తున్నా రు. చెరువులోని వచ్చే మురుగునీరు నివారణకు ఈ చెరువులో కలిసే ప్రధాన ఓపెన్ డ్రైన్లను చెరువు వద్ద అనుసంధానం చేసి అక్కడ నుంచి పైప్‌లైన్ ద్వారా నూజివీడులోని పోతిరెడ్డిపల్లికి వెళ్లే ప్రధాన రహదారిలో ఉన్న డ్రైన్లకు మళ్లిస్తే చెరువు చుట్టూ ఆహ్లా దకర వాతావరణం ఏర్పడుతుందని భావిస్తున్నారు. ఆ తర్వాత మొగల్ చెరువును సుందరీకరించాలని యోచిస్తున్నారు. అంతేకాక పట్టణంలో పచ్చదనం పెంపునకు చర్యలు చేపడుతున్నారు.



# ఆయుష్ వైద్యసేవలపై కీలక నిర్ణయం

- ఇక నకిలీ వైద్యులు, చికిత్సలకు చెక్
- క్లినిక్‌లు, ఆసుపత్రులకు గుర్తింపు తప్పనిసరి
- విధివిధానాల ఖరారుకు 3 ప్రత్యేక కమిటీలు
- కేరళ, తమిళనాడు, ఇతర రాష్ట్రాలపై అధ్యయనం
- ప్రాచీన వైద్యసేవలు మరింత చేరువ చేసేందుకు కృషి
- వైద్య ఆరోగ్య మంత్రి సత్యకుమార్ యాదవ్

అమరావతి(చైతన్యరథం): ఆయుష్ వైద్యసేవల్లో మరింత నాణ్యత పెంచి విస్తృతం చేసేందుకు, నకిలీ వైద్యానికి కళ్లెం వేసేందుకు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఆయుష్ సేవ ల్లో ముఖ్యమైన మార్పులు తీసుకురావాలని నిర్ణయించింది. వైద్య ఆరోగ్య మంత్రి సత్యకుమార్ యాదవ్ ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు. సంప్రదాయ ఆయుర్వేద, హోమియో, సిద్ధ, యూనాని, నేచురోపతి(ఆయుష్) వైద్యానికి మరింత ప్రాచుర్యాన్ని తెచ్చేందుకు, ప్రజలకు చేరువ చేసేందుకు వీలుగా నియంత్రణ వ్యవస్థను పటిష్టం చేయనున్నట్లు వెల్లడించారు. ఇందులో భాగంగానే ఆంధ్ర ప్రదేశ్ అల్లోపతిక్ ప్రైవేట్ మెడికల్ కేర్ ఎస్టాబ్లిష్‌మెంట్ (రిజిస్ట్రేషన్ అండ్ రెగ్యులేషన్) చట్టం-2022కు సవరణ చేసినట్లు వెల్లడించారు. చట్టసభల ద్వారా ఈ బిల్లుకు లభించిన ఆమోదానికి గవర్నర్ గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో త్వరలో కొత్త విధివిధానాలు రాబోతున్నాయని తెలిపారు. ఈ క్రమంలో విధివిధానాల రూప కల్పనకు మూడు ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేశామని వివరిం చారు. టెక్నికల్ కమిటీ, ఎక్స్‌పెర్ట్ కమిటీ, స్టేక్ హోల్డర్స్ పేర్లతో ఏర్పాటైన కమిటీల్లో ముగ్గురు చొప్పున అధికారులు, సీనియర్ వైద్యులు, నిపుణులు ఉంటారని తెలిపారు. ఈ కమిటీలు ఆయుష్ వైద్య రంగ నిపుణులు, ప్రజలను భాగస్వామ్యం చేసి వారి సూచ నలు, సలహాలను పరిగణలోకి తీసుకుని నివేదిక ఆధారంగా చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. ఈ నెలాఖరు నాటికి పూర్తి చేయాల్సి ఉంటుందని వెల్లడించారు. విధివిధానాల ఖరారు ద్వారా రాష్ట్రంలో ప్రస్తుతం అల్లోపతి వైద్యాన్ని అందించే ఆసు పత్రులపై నియంత్రణ ఉన్న మాదిరిగానే ఆయుష్ ఆసుపత్రులపై కూడా ఆయుష్ శాఖకు అధికారాలు సంక్రమిస్తాయి.




కూటమి చొరవతో ఆయుష్ వైద్యానికి మహర్దశ

ఆయుష్ పరిధిలోనికి వచ్చే ఆయుర్వేద, హోమియో, యూనాని, యోగా అండ్ నేచురోపతి కింద వైద్యాన్ని అందించే సంస్థలపై ప్రస్తుతం ప్రభుత్వపరంగా ఎటువంటి నియంత్రణ లేదు. అర్హతలు కలిగిన వారు మాత్రమే కాకుండా లేనివారు సైతం క్లినిక్‌లు నిర్వహిస్తున్నారు. అధిక సంఖ్యలో ఆయుష్ రంగానికి సంబంధించి ఆసుపత్రులు ఉన్నా.. వీటి ద్వారా రోగులు వైద్యసేవలు పొందుతున్నా అధికారికంగా చెప్పేందుకు వీల్లేని పరిస్థితులు రాష్ట్రంలో నెలకొన్నాయి. ఈ పరిస్థితుల్లో అచేతనావస్థలో ఉన్న ఆయుష్ వైద్యానికి కూటమి ప్రభుత్వం ఊపిరిపోస్తోంది. కేంద్ర ప్రభుత్వ చేయూతతో ఆయుష్ వైద్యానికి మహర్దశను తీసుకువస్తోంది. కొత్తగా ఇంటిగ్రేటెడ్ ఆసుపత్రులు, ఆయుష్ వైద్య కళాశాలలు ప్రభుత్వరంగంలో రాబోతున్నాయి. ఈ పరిస్థితుల్లో అల్లోపతి మాదిరిగానే ఆయుష్ వైద్యరంగాన్ని సైతం ప్రభుత్వపరంగా పటిష్టం చేసేందుకు కూటమి ప్రభుత్వం తీసుకుంటోంది. ఇందులో భాగంగా ప్రైవేట్ మెడికల్ కేర్ ఎస్టా బ్లిష్‌మెంట్స్ చట్టానికి సవరణ జరిగింది. ఇందుకు అనుగుణంగా మంత్రి జారీ చేసిన ఆదేశాల మేరకు ఆయుష్ ఇన్‌చార్జి డైరెక్టర్ రోణంకి గోపాలకృష్ణ కమిటీల ఏర్పాటు, ఇతర చర్యలకు ఉపక్ర మించారు. ఈ విధివిధానాల రూపకల్పనలో భాగంగా కేరళ, కర్నాటక, తమిళనాడు రాష్ట్రాల్లో అమలులోఉన్న బెస్ట్ ప్రాక్టీసెస్ ను కూడా కమిటీలు పరిశీలిస్తాయి. టెక్నికల్ కమిటీ ముఖ్యంగా ఆయుష్ ట్రీట్మెంట్ ప్రొటోకాల్స్‌ను, ఎక్స్‌పెర్ట్ కమిటీ రెగ్యులేటరీ విధానంపై, స్టేక్ హోల్డర్స్ కమిటీ ప్రజల అభిప్రాయాల్ని తెలుసు కుంటాయి. వీటన్నింటినీ క్రోడీకరించి చివరగా విధివిధానాల రూపకల్పనపై ప్రభుత్వానికి నివేదికను అందజేస్తాయి.

ఆయుష్ శాఖ నుంచి రిజిస్ట్రేషన్ తప్పనిసరి

- కొత్తగా రాబోయే నిబంధనలు అనుసరించి క్లినిక్‌లు, ఆసుపత్రులు ఆయుష్ శాఖ నుంచి రిజిస్ట్రేషన్ పొందాల్సి ఉం టుంది. రిజిస్ట్రేషన్ పొందడం వల్ల నిర్దిష్ట ప్రమాణాలు అనుస రించి క్లినిక్‌లు, ఆసుపత్రుల ద్వారా వైద్యసేవలు ప్రజలకు అందుబాటులోకి వస్తాయి. విద్యార్హతలు కలిగిన వారి ద్వారా మాత్రమే ప్రజలకు ఆయుష్ వైద్యసేవలు అందుతాయి. ప్రస్తు తం ఉన్న నకిలీల బెడద క్రమంగా తగ్గిపోతుంది. అందుబా టులో ఉన్న ప్రాథమిక సమాచారం ప్రకారం ప్రస్తుతం రాష్ట్రంలో 2,558 ఆయుర్వేదంలో (యూజీ/పీజీ), హోమియోపతిలో (యూజీ/పీజీ)లో 4,599, యూనానిలో 788, నేచురోపతి అండ్ యోగాలో 379 మంది అర్హత కలిగిన వైద్యులు రిజిస్ట్రేష న్ పొందారు. చట్టసవరణ ద్వారా వీరికి మరింత గుర్తింపు పెరుగుతుంది. నకిలీల బెడద తగ్గుతుంది.

రాష్ట్రంలో ప్రస్తుతం 1400 ఆయుష్ క్లినిక్‌లు

నేషనల్ కమిషన్ ఫర్ ఇండియన్ సిస్టమ్ ఆఫ్ మెడిసిన్ (ఎన్‌సీఐఎస్ఎమ్), నేషనల్ కమిషన్ ఫర్ హోమియోపతి (ఎన్‌సీహెచ్), నేషనల్ ఆయుష్ మిషన్ (ఎన్ఏఎం) గణాంకాల ప్రకారం.. రాష్ట్రంలో 1400 వరకు ప్రైవేట్ రంగంలో ఆయుష్ క్లినిక్‌లు ఉన్నాయి. 40 వరకు ఆయుష్ ఆసుపత్రులు ఉన్నా యి.. ప్రభుత్వరంగంలో 737 ఆయుష్ డిస్పెన్సరీలు ఉన్నాయి. ప్రభుత్వ రంగంలో 8 ఆసుపత్రులు ఉన్నాయి. ప్రైవేట్ రంగంలో 1,440 క్లినిక్‌లు, ఆసుపత్రులు ఉన్నా వీటికి వైద్య ఆరోగ్య శాఖ (ఆయుష్) తరపున ఎటువంటి గుర్తింపు లేదు. కొందరు సదరు స్థానిక సంస్థల నుంచి సాధారణ స్థాయిలో అనుమతులు పొందు తున్నారే కానీ... వైద్యసేవలు అందించడంపై అనుమతులు పొందే అవకాశం లేకుండాపోయింది. క్లినిక్‌లు, ఆసుపత్రులు ఆయుర్వేద రంగానికి సంబంధించినవి ఎక్కువగా ఉన్నాయి. ఆ తరువాత హోమియోపతి, నేచురోపతి, యునాని క్లినిక్‌లు, ఆసుపత్రులు ఉన్నాయి.

# అనధికార లౌడ్ స్పీకర్లపై డీజీపీకి లేఖ

- సుప్రీంకోర్టు మార్గదర్శకాలు అమలు చేయాలి
- నిబంధనలు ఉల్లంఘించే వారిపై చర్యలు చేపట్టాలి
- డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు విజ్ఞప్తి

అమరావతి (చైతన్యరథం): ప్రార్థనా స్థలాల్లో అనధికార లౌడ్ స్పీకర్లపై ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఏపీ డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తాకి రఘురామ సోమవారం లేఖ రాశారు. ఈ లేఖలో పలు అంశాలను ప్రస్తావించారు. శబ్ద కాలుష్య నియంత్రణ నిబంధనలు కఠినంగా అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రార్థనా స్థలాల్లో అధిక శబ్దంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. లౌడ్‌స్పీకర్లతో విద్యార్థులు, వృద్ధులు, రోగులకు తీవ్ర ఇబ్బంది కలుగుతోందని వ్యాఖ్యానించారు. ఏడాదిలో గరిష్ఠంగా 15 రోజులు మాత్రమే లౌడ్‌స్పీకర్లకు అనుమతి ఉందని గుర్తు చేశారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాలను అమలు చేయాలని పోలీసు లకు విజ్ఞప్తి




చేశారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై బీఎన్ఎస్ సెక్షన్ల కింద చర్యలు తీసుకోవాలని సూచించారు. పబ్లిక్ న్యూసెన్స్ సృష్టించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనధికార సౌండ్ సిస్టమ్‌లను స్వాధీనం చేసుకునే అధికారం పోలీసులకు ఉందని స్పష్టం చేశారు. నివాస ప్రాంతాల్లో శాంతి భద్రతలు కాపాడాలని డీజీపీకి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఒకే విధంగా నిబంధనలు అమలు చేయాలని కోరారు.

# అటు వడగాల్పులు.. ఇటు వర్షాలు

వాతావరణ శాఖ తాజా అప్డేట్

అమరావతి (చైతన్యరథం): ఉత్తర శ్రీలంక తీరం, నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం అదే ప్రాంతంలో కొనసాగుతోందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ తెలిపారు. ఇది రాగల 48 గంటల్లో మరింత బలపడే అవకాశం ఉందని ఆయన వెల్లడించారు. దీని ప్రభావంతో మంగళవారం శ్రీకాకుళం, విజయనగరం, మన్యం, అల్లూరి, పోలవరం, విశాఖ, అనకాపల్లి, కాకినాడ, కోనసీమ, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడా పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. వర్షం పడే సమయంలో ప్రజలు బహిరంగ ప్రదేశాల్లో ఉండకుండా సురక్షిత భవనాల్లో ఆశ్రయం పొందాలన్నారు. పాత భవనాలు, భారీ హోర్డింగ్స్ వద్ద నిలబడరాదని హెచ్చరించారు. రైతులు వ్యవసాయ పనుల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పొలాల్లో ఉన్న రైతులు, పశు కాపరులు మరింత అప్రమత్తంగా ఉండాలని, ఆకాశం మేఘావృతమై ఉరుములు వినిపించిన వెంటనే సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలన్నారు. చెట్ల కిందకు వెళ్లొద్దని విజ్ఞప్తి చేశారు.

మరోవైపు అల్లూరి జిల్లా జీకే వీధి, ముంచింగిపుట్టు, పెదబయలు, పోలవరం జిల్లా చింతూరు, కూనవరం, మారేడుమిల్లి,



వరరామచంద్రాపురం, గుర్తేడు మండలాల్లో వడగాలులు వీచే అవకాశం ఉందన్నారు. కొన్ని జిల్లాల్లో అక్కడక్కడా ఎండ ప్రభావం చూపుతుందన్నారు.

సోమవారం ఎన్టీఆర్ జిల్లా విజయవాడ తూర్పులో 42.3, ఏలూరు జిల్లా కుక్కునూరు, పోలవరం జిల్లా కూనవరంల్లో 42.1, కర్నూలు జిల్లా మంత్రాలయంలో 41.5, ప్రకాశం జిల్లా కొప్పెరపాడులో 41.4, కడపలో 41.3, పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిలో 41.2, పల్నాడు జిల్లా అచ్చంపేటలో 40.9, అనంతపురం జిల్లా రాయదుర్గంలో 40.8, కృష్ణా జిల్లా పెద్దపారుపూడి, నంద్యాల జిల్లా దొర్నిపాడుల్లో 40.7, మార్కాపురం జిల్లా నందనమారెళ్లలో 40.6 గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదైనట్లు ప్రఖర్ జైన్ పేర్కొన్నారు.

## ఎచ్చెర్లలో తేనెటీగల దాడి

ఉపాధి హామీ కూలీలకు 108 సిబ్బంది తక్షణ వైద్య సేవలు




ఎచ్చెర్ల (చైతన్యరథం): ఎచ్చెర్ల మండలంలో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలపై తేనెటీగలు ఒక్కసారిగా దాడి చేశారు. పలువురు మహిళా కూలీలు అస్వస్థతకు గురయ్యారు. సమాచారం అందుకున్న వెంటనే 108 అంబులెన్స్ సిబ్బంది సంఘటనాస్థలానికి చేరుకుని బాధితులకు అత్యవసర వైద్య సేవలు అందించారు. పరిస్థితి విషమంగా ఉన్న వారిని అంబులెన్స్‌లో సమీప ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితుల ఆరోగ్య పరిస్థితిపై వైద్యులు పర్యవేక్షణ కొనసాగిస్తున్నారు. సమయానికి స్పందించి బాధితులకు సేవలు అందించిన 108 సిబ్బందిని స్థానికులు, గ్రామస్తులు అభినందించారు.

## పెద్ద దస్తగిరి హత్య కేసులో లొంగిపోయిన నిత్యానందరెడ్డి



కడప (చైతన్యరథం): వైసీపీ నేత, కడప మాజీ డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి లొంగిపోయారు. వైసీపీ కార్యకర్త పెద్ద దస్తగిరి హత్య కేసులో నిత్యానందరెడ్డి ప్రధాన నిందితుడిగా ఉన్నారు. గత 20 రోజులుగా వైసీపీ నేత కోసం తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర రాష్ట్రాల్లో పోలీసులు గాలిస్తున్నారు. ఎట్టకేలకు సోమవారం ఉదయం ఎస్పీ కార్యాలయంలో పోలీసుల ఎదుట నిత్యానందరెడ్డి లొంగిపోయారు. కొద్దిరోజుల క్రితం కడపలో వైసీపీ కార్యకర్త పెద్ద దస్తగిరి దారుణ హత్యకు గురయ్యారు. హత్యపై కేసు నమోదు చేసిన పోలీసులు దాదాపు 11 మందిని అరెస్ట్ చేశారు. నిత్యానంద రెడ్డి చెప్పడం వల్లే దస్తగిరిని చంపినట్లు నిందితులు వాంగ్మూలం ఇచ్చారు. దీంతో ఈ కేసులో నిత్యానంద రెడ్డిని ప్రధాన నిందితు డిగా పోలీసులు చేర్చారు. అప్పటి నుంచి పరారీలో ఉన్న నిత్యానందరెడ్డి కోసం పోలీసులు విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టారు. నిత్యానందరెడ్డి నివాసంలో సోదాలు జరిపిన పోలీసు లు.. విలువైన డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నారు.

## ప్రభుత్వ ప్రతిష్టను దెబ్బతీసేలా ప్రతిపక్షాల కుట్రలు... బాధ్యులపై చర్యలు తప్పవు

**●టెక్కలి జిల్లా ఆసుపత్రిని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆకస్మిక తనిఖీ**

**●ఆసుపత్రి సూపరింటెండెంట్‌కు ప్రశ్నలు వర్షం కురిపించిన మంత్రి కె. అచ్చెన్న**



టెక్కలి (చైతన్యరథం): రాష్ట్ర వ్యవసాయ, సహకార మరియు మార్కెటింగ్ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సోమవారం ఉదయం టెక్కలి జిల్లా ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉదయం 8:45 గంటలకే ఆసుపత్రికి చేరుకున్న మంత్రి, రిజిస్టర్లు, వార్డులు మరియు వైద్య సేవలను క్షుణ్ణంగా పరిశీలించారు.తనిఖీ సమయంలో సుమారు 44 మంది సిబ్బంది విధులకు గైర్హాజరు కావడాన్ని మంత్రి తీవ్రంగా పరిగణించారు. ప్రజల ఆరోగ్యంతో ఆటలాడితే సహించేది లేదని హెచ్చరిస్తూ, ఇటీవల జరిగిన నీటి సమస్యపై తీవ్రంగా పరిగణలోకి తీసుకున్నారు తక్షణమే విచారణ జరిపి 24 గంటల్లో సమగ్ర నివేదిక సమర్పించాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు.

**ప్రతిపక్షాల కుట్రపూరిత చర్యలు**

ఆసుపత్రిలో నీటి సమస్యను సాకుగా చూపి ప్రతిపక్ష పార్టీలు కావాలనే రాద్ధాంతం చేస్తున్నాయని మంత్రి మండిపడ్డారు. "సమస్య ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలి కానీ, ముందస్తు ప్రణాళికతో పక్క పార్టీ వారు వాటర్ ట్యాంకర్లతో రావడమేంటని" అధికారులకు ప్రశ్నల వర్షం కురిపించారు,ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకురావాలనే దురుద్దేశంతోనే ఇటువంటి పనులు చేస్తున్నారని, వీటికి సహకరించే వారిపై కఠిన చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు.

**వైద్యులకు దిశానిర్దేశం**

"వైద్యో నారాయణో హరి" అన్న నానుడిని గుర్తు చేస్తూ, పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని మంత్రి సూచించారు. చిన్న సమస్యలకు సైతం రోగులను ఇతర ప్రాంతాలకు రిఫర్ చేయడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు.

అనంతరం, రూ. 20 లక్షల సీఎస్ఆర్ (CSR) నిధులతో సమకూర్చిన అత్యాధునిక వైద్య పరికరాలను ఆసుపత్రికి అందజేశారు.

**వార్డుల పరిశీలన**

తనిఖీలో భాగంగా మంత్రి చిన్నపిల్లల వార్డు, గర్భిణీల విభాగం మరియు డయాగ్నోస్టిక్ సెంటర్‌ను సందర్శించారు. రోగులతో స్వయంగా మాట్లాడి, వైద్యులు అందుబాటులో ఉంటున్నారా? మందులు సక్రమంగా ఇస్తున్నారా? అని అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి పరిసరాలను పర్యావరణ హితంగా మరియు పరిశుభ్రంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు.

**మంత్రి అచ్చెన్నాయుడు చొరవతో సి ఎస్ ఆర్ కింద రూ. 20 లక్షల విలువైన వైద్య పరికరాలు పంపిణీ**

రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు చొరవతో కార్పొరేట్ సామాజిక బాధ్యత (సి ఎస్ ఆర్) నిధులు సుమారు రూ.20 లక్షల విలువైన ఆసుపత్రి వసతులను సమకూర్చారు. ఇందులో ఆపరేషన్ టేబుల్లు - 4, మల్టీపార మానిటర్ లు - 5, వీన్ ఫైండర్స్ - 2, రోగుల విశ్రాంతి చైర్స్ - 20 అందజేశారు. తక్షణమే ఆయా విభాగాలలో ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి ఇన్చార్జి సూపరిండెంట్ డా,మహారాజ్, డా, లక్ష్మణ రావు, చీఫ్ ఫార్మసీ ఆఫీసర్ వరలక్ష్మి, వైద్యులు అపర్ణ, ఉదయశ్రీ, మురళీకృష్ణ పాల్గొన్నారు.

## విజయనగరం పార్టీ కార్యాలయానికి భూమి పూజ

**● శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు**



విజయనగరం (చైతన్యరథం): విజయనగరం జిల్లా కేంద్రంలోని అయ్యన్నపేట వద్ద సోమవారం టీడీపీ జిల్లా నూతన కార్యాలయం నిర్మాణానికి మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు కిమిడి నాగార్జున భూమి పూజ చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నాయకత్వంలో రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు విజయవంతంగా కొనసాగుతున్నాయని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ చెప్పారు. సామాన్య కార్యకర్తలను ఎమ్మెల్యేలు, ఎంపీలుగా చేసిన ఘనత దేశంలో టీడీపీకి దక్కుతుందని ఎంపీ కలిశెట్టి చెప్పారు. టీడీపీలో కష్టపడి పనిచేసిన కార్యకర్తలకు మంచి గుర్తింపు ఉంటుందని ఆయన ప్రకటించారు. మారుతున్న పరిస్థితులు దృష్ట్యా కార్యకర్తల, నాయకుల సౌలభ్యం కొరకై రాష్ట్రవ్యాప్తంగా పార్టీ శ్రేణుల ఆకాంక్షల నిమిత్తం పార్టీ అధిష్టానం నిర్ణయాలు మేరకు ప్రతీ జిల్లా హెడ్ క్వార్టర్ లో పార్టీ కార్యాలయాన్ని నిర్మించడంలో భాగంగా నూతన కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకోవడం సంతోషంగా ఉందని ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ ఎమ్మెల్యేలు కొండ్రు మురళీమోహన్, బేబీ నాయన, పొలిట్‌బ్యూరో సభ్యురాలు గంట్యాడ శ్రీదేవి, మార్క్ ఫెడ్ ఛైర్మెన్ కర్రోతు బంగార్రాజు, టీడీపీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## రహదారి నిర్మాణ పనుల్లో రాజీకి తావు ఇవ్వొద్దు

**● అధికారులకు సూచించిన వీఎంఆర్డీఏ చైర్మన్ ఎం.వి ప్రణవ్‌గోపాల్**



విశాఖపట్నం (చైతన్యరథం): భోగాపురం విమానాశ్రయానికి అనుసంధానం చేస్తూ వీఎంఆర్డీఏ పరిధిలో చేపట్టిన ప్రాధాన్యత బృహత్ ప్రణాళిక రహదారుల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని వీఎంఆర్డీఏ చైర్మన్ ఎం.వి ప్రణవ్ గోపాల్, మెట్రోపాలిటన్ కమిషనర్ తేజ్ భరత్ కాంట్రాక్టు సంస్థ, అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం నేరెళ్ళవలస నుంచి తాళ్ళవలస వరకు జరుగుతున్న రహదారి దీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా రహదారి నిర్మాణ పనులను సంబంధించి ఇంజనీరింగ్ అధికారులతో మాట్లాడారు. నిర్దేశించిన సమయానికి రహదారి పనులు పూర్తి చేయాలని, నిర్మాణ పనుల నాణ్యతలో ఎటువంటి రాజీకి తావు ఇవ్వొద్దు అని సూచించారు. వీఎంఆర్డీఏ చేపట్టిన 7 ప్రధాన రహదారుల్లో ఇప్పటికే 3 రహదారులు నిర్మాణం వంద శాతం పూర్తి చేయడం జరిగిందని, మిగిలిన రహదారులు కూడా జూన్ నెలలో పూర్తి చేయటం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పర్యవేక్షక ఇంజినీర్ మధుసూదనరావు, కార్యనిర్వహక ఇంజనీర్ దుర్గా ప్రసాద్, ఉప కార్యనిర్వహక ఇంజనీర్ రవి శంకర్ ఇంజనీరింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బంగాళాఖాతంలో భారీ అల్పపీడనం... పలు జిల్లాల్లో వర్షాలు

విశాఖపట్నం (చైతన్యరథం): ఉత్తర శ్రీలంక తీరం, నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ఈరోజు అదే ప్రాంతంలో కొనసాగుతోందని విశాఖ వాతావరణ శాఖ అధికారి జగన్నాధ కుమార్ తెలిపారు. ఇది రాగల 48 గంటల్లో మరింత బలపడే అవకాశం ఉందని వెల్లడించారు. దీని ప్రభావంతో మంగళవారం శ్రీకాకుళం, విజయనగరం, మన్యం, అల్లూరి, పోలవరం, విశాఖ, అనకాపల్లి, కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. వర్షం పడే సమయంలో ప్రజలు బహిరంగ ప్రదేశాల్లో ఉండకుండా సురక్షిత భవనాల్లో ఆశ్రయం పొందాలన్నారు. పాత భవనాలు, భారీ హోర్డింగ్స్ వద్ద నిలబడరాదని హెచ్చరించారు. రైతులు వ్యవసాయ పనుల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పొలాల్లో ఉన్న రైతులు, పశు కాపరులు మరింత అప్రమత్తంగా ఉండాలని, ఆకాశం మేఘావృతమై ఉరుములు వినిపించిన వెంటనే సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలన్నారు. చెట్ల క్రిందకు వెళ్లొద్దని విజ్ఞప్తి చేశారు.

## సుముద్రంపైకి సింగల్ డ్రైవ్... సమ్మర్‌లో ఇదే బెస్ట్ టూరిస్ట్ స్పాట్



అమలాపురం (చైతన్యరథం): సముద్రంపైకి సింగల్ రైడ్‌కి వెళ్లాలనే కోరిక మనలో చాలా మందికి ఉంటుంది. కాని ఎగసిపడుతున్న అలలు, వేగంగా దూసుకొచ్చే నీటి అలజడికి సముద్రంలోకి ఒంటరిగా వెళ్లాలంటే భయం మొదలవుతుంది. అయితే బోట్ రైడ్ పేరుతో ఆరుగురు అంతకంటే ఎక్కువ మంది సముద్రంపై లేదా నదులపై షికారు చేయడం చూస్తుంటాం. కానీ ఆ సముద్ర తీర ప్రాంతంలో అందమైన గోదావరి సముద్రంలో కలిసే ప్రాంతంలో సింగల్ రైడ్ ఇన్ బీచ్ అని ప్రత్యేక వెహికల్ ఏర్పాటు చేశారు. అంటే సాగర సంగమం ప్రాంతంలో చక్కగా రైడ్ చేయడం ఎంత మజాగా ఉంటుందో చెప్పనక్కర్లేదు. ఈ సమ్మర్‌కి టూరిస్టులు, ప్రకృతి ప్రేమికుల్ని కట్టిపడేయడానికి అంబేద్కర్ కోనసీమ జిల్లా రాజోలు తాలుకాలో ఈ సింగిల్ బోట్ రైడ్ అందర్ని ఆకర్షిస్తోంది.

**అంతర్వేదిలో అద్భుతం..**

అందమైన గోదావరి ఆపై సముద్ర తీర ప్రాంతాలు అంతకుమించి అటవీ ప్రాంతాలకు పెట్టింది పేరైన గోదావరి జిల్లాలో అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి ఆలయ సమీపంలో ఇటు సముద్రం అటు గోదావరి పరివాహక ప్రాంతం కలిసే ప్రాంగణంలో అందమైన సూపర్ రైడ్ కార్యక్రమం ప్రారంభమైంది. అంతర్వేది బీచ్ లో జెటెస్కీ , ఏటీవీ ఆల్ టెరైన్ వెహికల్ ప్రారంభమైంది. ఈ వెహికల్ పై సింగల్ రైట్ సముద్రంలోకి వెళ్లాలనుకునే వారందరికీ అద్భుతంగా ముందుకు వెళ్ళచ్చని నిర్వాహకులు చెబుతున్నారు. అందమైన సముద్ర తీర ప్రాంతంలో రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్, అమలాపురం ఎంపీ గంటి హరీష్ బాలయోగి ప్రారంభించారు.

## గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో పేరుకుపోయిన సమస్యలు : ఎమ్మెల్యే ఆదిరెడ్డి

**●కూటమి అధికారంలోకి వచ్చాక ఒక్కోక్కటిగా పరిష్కరిస్తున్నాం**



రాజమహేంద్రవరం (చైతన్యరథం): నగరంలోని 10వ డివిజన్ సాయి దీపికా నగర్ ప్రాంతంలో రూ.20 లక్షల వ్యయంతో నిర్మించనున్న నూతన సీసీ రోడ్డు పనులకు రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో 10వ డివిజన్‌లో అనేక మౌలిక వసతుల సమస్యలు పేరుకుపోయాయని విమర్శించారు. ప్రజలు ఇచ్చిన తీర్పుతో కూటమి ప్రభుత్వం బాధ్యతాయుతంగా అభివృద్ధి పనులు చేపడుతోందని పేర్కొన్నారు. సాయి దీపికా నగర్ సమీపంలో అభివృద్ధి చేసిన ఫ్రూట్ పార్క్ గురించి ప్రత్యేకంగా ప్రస్తావించిన ఎమ్మెల్యే వాసు ఇది రాజమహేంద్రవరంలోనే అత్యుత్తమ పార్క్‌లలో ఒకటిగా నిలుస్తుందని తెలిపారు. పార్క్‌లో ఏర్పాటు చేసిన పండ్ల ఆకృతులు, వాటి ఉపయోగాలపై పిల్లలకు అవగాహన కలిగేలా రూపొందించామని చెప్పారు. చిన్నారుల్లో ఆరోగ్య చైతన్యం పెంపొందించడమే లక్ష్యమన్నారు. పార్కుల నిర్వహణలో సమస్యలను పరిష్కరించేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని తెలిపారు. నగరంలోని 12 పార్కుల నిర్వహణ కోసం టెండర్ల ప్రక్రియ ప్రారంభించామని వెల్లడించారు. ప్రైవేట్ సంస్థల సహకారంతో పార్కులను మెరుగ్గా నిర్వహించనున్నట్లు చెప్పారు. అల్కాపురి ప్రాంతంలో కూడా రోడ్లు, డ్రైనేజీ సమస్యలు తీవ్రంగా ఉన్నాయని, వాటి పరిష్కారానికి పుష్కర అభివృద్ధి పనుల కింద సుమారు రూ.4 కోట్లతో రోడ్లు, డ్రైన్లు నిర్మించనున్నట్లు ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ వెల్లడించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని నగరంలో డీసిల్టింగ్ పనులను వేగవంతం చేస్తున్నామని తెలిపారు. ఇటీవల కురిసిన అకాల వర్షాలతో కొన్ని ప్రాంతాల్లో ఇంకా డ్రైన్ల శుభ్రత అవసరం ఉన్నట్లు గుర్తించామని, వెంటనే చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. పారిశుధ్య పనులు, డ్రైనేజీ శుభ్రత, వర్షపు నీటి పారుదలపై ప్రత్యేక దృష్టి పెట్టి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు. ఆరోగ్యకరమైన, పరిశుభ్రమైన, ఆధునిక రాజమహేంద్రవరాన్ని నిర్మించేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు చొప్పెర్ల భద్రరావు పాల్గొన్నారు.

## సాగునీరు అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం : మంత్రి కందుల



నిడదవోలు (చైతన్యరథం): వ్యవసాయానికి వెన్నెముక వంటి జలవనరులను సంరక్షించి ప్రతి ఎకరాకు సాగునీరు అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. నియోజకవర్గంలోని జలవనరుల పరిరక్షణ, గ్రామాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. సోమవారం మండలంలోని కోరుమామిడి గ్రామంలో చెరువుల పూడికతీత, కాలువల్లో అడ్డంకిగా మారిన గుర్రపుడెక్క తొలగింపు పనుల కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ.. 2026-27 ఆర్థిక సంవత్సరానికిగాను నియోజకవర్గంలో ఎర్ర కాలువ సెక్షన్ పరిధిలోని అభివృద్ధి పనులకు, ప్రస్తుతం రూ. 81.91 లక్షల విలువైన 8 పనులకు అనుమతులు లభించినట్లు తెలిపారు. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని, రైతాంగానికి ఇబ్బంది కలగకుండా ఈ పనులన్నింటినీ యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం కోరుమామిడి గ్రామంలో పాదయాత్ర చేస్తూ స్థానిక సమస్యలను తెలుసుకున్నారు.

## ఆధ్యాత్మిక భావనతోనే ప్రశాంతమైన సమాజం : ఎమ్మెల్యే చింతమనేని



చింతలపూడి (చైతన్యరథం): నియోజకవర్గంలోని లింగపాలెం మండలం అయ్యప్పరాజుగూడెం గ్రామంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. గ్రామంలో నూతనంగా నిర్మించిన 35 అడుగుల అత్యంత ఎత్తైన శ్రీ అభయాంజనేయ స్వామి వారి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం సోమవారం అత్యంత వైభవంగా జరిగింది. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమానికి దెందులూరు శాసనసభ్యులు చింతమనేని ప్రభాకర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆలయానికి విచ్చేసిన ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌కి ఆలయ నిర్వాహకులు, అర్చకులు మరియు గ్రామస్థులు ఘన స్వాగతం పలికారు. అనంతరం స్వామివారి విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమాల్లో భాగంగా నిర్వహించిన ప్రత్యేక పూజల్లో, ఆయన పాల్గొన్నారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, ఆ హనుమంతుని ఆశీస్సులు అందరిపై ఉండాలని కాంక్షిస్తూ ఆయన ప్రార్థించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింతమనేని మాట్లాడుతూ... సమాజంలో భక్తి భావం, ఆధ్యాత్మిక చింతన పెరిగినప్పుడే ప్రశాంతమైన జీవనం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. హనుమంతుడు ధైర్యానికి, విజయానికి నిదర్శనమని, అటువంటి స్వామివారి 35 అడుగుల భారీ విగ్రహాన్ని ప్రతిష్ఠించడం గ్రామ ప్రజల భక్తికి నిదర్శనమని అభినందించారు. ఆలయాల అభివృద్ధికి మరియు హిందూ ధర్మ పరిరక్షణకు తమ ప్రభుత్వం ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని ఆయన పునరుద్ఘాటించారు. పూజా కార్యక్రమాల అనంతరం వేద పండితులు ఎమ్మెల్యేకి వేద ఆశీర్వచనం అందజేసి, స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు, అయ్యప్పరాజుగూడెం గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు మరియు చుట్టుపక్కల గ్రామాల నుంచి విచ్చేసిన అనేక మంది భక్తులు పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వంలో విజయవంతంగా సాగుతున్న సంక్షేమాభివృద్ధి



భీమడోలు (చైతన్యరథం): భీమడోలు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో సోమవారం రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారధి ఆధ్వర్యంలో ఏలూరు జిల్లాలోని ఏడు నియోజకవర్గాల టీడీపీ ఇన్‌ఛార్జ్‌లు, ఎమ్మెల్యేల సమన్వయ సమావేశం జరిగింది. జిల్లా అధ్యక్షుడు బడేటి రాధాకృష్ణయ్య అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో నెల్లూరులో జరగనున్న టీడీపీ మహానాడును విజయవంతం చేయడంపై విస్తృతంగా చర్చించారు. రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు ప్రతి నియోజకవర్గంలో ముందుగా మినీ మహానాడులు నిర్వహించి, అనంతరం జిల్లా స్థాయి మినీ మహానాడును ఘనంగా నిర్వహించాలని నిర్ణయించారు. జిల్లా స్థాయి కార్యక్రమాన్ని పోలవరం నియోజకవర్గంలో నిర్వహించేందుకు ఇంచార్జులు సూత్రప్రాయ అంగీకారం తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి పార్థసారధి మాట్లాడుతూ యువనేత నారా లోకేష్ మంచి సంప్రదాయాన్ని ప్రారంభించారని తెలిపారు. ప్రభుత్వ పాలనలో లోపాలు, కార్యకర్తల సమస్యలపై జిల్లా స్థాయిలో ఇంచార్జులు సమావేశమై చర్చించాలని పార్టీ పిలుపునిచ్చిందని, ఆ దిశగా ఇప్పటికే ఏలూరులో సమావేశం నిర్వహించామని చెప్పారు. ఈసారి ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు నివాసంలో సమావేశం ఏర్పాటు చేసినట్లు వివరించారు. కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో విజయవంతంగా ముందుకు సాగుతోందని మంత్రి పేర్కొన్నారు. పార్టీ జిల్లా ఇన్‌ఛార్జ్ బడేటి రాధాకృష్ణయ్య మాట్లాడుతూ నియోజకవర్గాల్లో మినీ మహానాడుల నిర్వహణకు కార్యాచరణ సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు, బొరగం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఫలించిన ఎమ్మెల్యే నసీర్ కృషి... నాట్కో సెంటర్‌లో 14న పెట్ స్కాన్ ప్రారంభం



గుంటూరు (చైతన్యరథం): ప్రభుత్వాస్పత్రిలోని నాట్కో సెంటర్ లో పెట్ స్కాన్ ఏర్పాటుకు గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ ఛైర్మన్ చేసిన కృషి ఫలించింది. ఇప్పటికే క్యాన్సర్ వైద్యంలో రాష్ట్రానికే తలమానికంగా ఉన్న జీజీహెచ్ లోని నాట్కో సెంటర్ ఇకపై మరింత అధునాతన సేవలను అందుబాటులోకి తీసుకురానుంది. నాట్కో సెంటర్ లో పెట్ స్కాన్ కోసం గతంలో అసెంబ్లీలోనూ, వైద్యశాఖ మంత్రి వద్ద ఎమ్మెల్యే నసీర్ అనేక సార్లు విన్నవించారు. ఈ మేరకు నాట్కో విభాగంలో ఈ నెల 14వ తేదీన పెట్ స్కాన్ సెంటర్ ప్రారంభించనున్నారు. సోమవారం దీనికి సంబంధించిన ఏర్పాట్లను ఎమ్మెల్యే నసీర్ పరిశీలించారు. పెట్ స్కాన్ ద్వారా ఎంత సమయంలో రిపోర్టులు వస్తాయి? ఎలాంటి రోగాలను గుర్తించే అవకాశం ఉంటుంది? ప్రతి రోజు ఎంత మందికి స్కాన్ చేసే సామర్థ్యం ఉంటుంది? దీనికి సంబంధించిన సిబ్బంది వివరాలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా గుంటూరు ప్రభుత్వాస్పత్రి నాట్కో సెంటర్‌లో క్యాన్సర్ రోగులకు కార్పొరేట్ వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే 120 పడకలతో క్యాన్సర్ పేషెంట్లకు సేవలందిస్తున్నారని, తాజాగా మరో 130 పడకలను అందుబాటులోకి తీసుకొస్తున్నారని చెప్పారు. గతంలో క్యాన్సర్ ను రాచపుండుగా నిలిచే వారని, ఈ వ్యాధికి గురైన రోగికి ఇక నయం కాదనే ఉద్దేశంతో ఉండేవారని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జీజీహెచ్ లో అన్ని రకాల వైద్య సేవలను అందుబాటులోకి తీసుకొచ్చామని చెప్పారు. రూ. 20 కోట్లతో ఏర్పాటు చేయనున్న పెట్ స్కాన్ ద్వారా ఏడాదిన్నరపాటు ఉచితంగా రోగులకు సేవలందించనున్నట్లు తెలిపారు. ఒక్కో స్కాన్ విలువ రూ. 25 వేలు ఉంటుందన్నారు. ఈ నెల 14న కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర వైద్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తో కలిసి ప్రారంభిస్తామని తెలిపారు.

## ఢిల్లీలో సీఎం సమావేశానికి హాజరైన ఎంపీ సానా సతీష్ బాబు



కాకినాడ / ఢిల్లీ (చైతన్యరథం): ఢిల్లీ పర్యటన నిమిత్తం దేశ రాజధానికి విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకి ఢిల్లీలోని ఇంద్రాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. రాజ్యసభ సభ్యులు సానా సతీష్‌బాబుతో పాటు పలువురు ఎంపీలు, పార్టీ నాయకులు, అధికారులు సీఎం చంద్రబాబుకు స్వాగతం పలికారు. అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జనపథ్‌లో ఎంపీలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వంతో రాష్ట్రానికి సంబంధించిన కీలక అంశాలపై చర్చలు జరపనున్న నేపథ్యంలో, కేంద్ర మంత్రులతో సమావేశాలకు ముందు ఎంపీలతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర అభివృద్ధి, పెండింగ్ ప్రాజెక్టులు, కేంద్ర నిధులు, పోలవరం, అమరావతి, మౌలిక వసతుల అభివృద్ధి వంటి అంశాలపై చర్చించినట్లు సమాచారం. రాష్ట్ర ప్రయోజనాల సాధనలో కేంద్రంతో సమర్థవంతమైన సమన్వయం అవసరమని సీఎం చంద్రబాబు ఎంపీలకు సూచించినట్లు తెలిసింది.

## అనధికార లౌడ్ స్పీకర్లపై డీజీపీకి రఘురామ లేఖ

ఉండి (చైతన్యరథం): ప్రార్థనా స్థలాల్లో అనధికార లౌడ్‌స్పీకర్లపై ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఏపీ డీజీపీ హరీశ్ కుమార్ గుప్తాకి రఘురామ సోమవారం లేఖ రాశారు. ఈ లేఖలో పలు అంశాలను ప్రస్తావించారు. శబ్దకాలుష్య నియంత్రణ నిబంధనలు కఠినంగా అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రార్థనా స్థలాల్లో అధిక శబ్దంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. లౌడ్‌స్పీకర్లతో విద్యార్థులు, వృద్ధులు, రోగులకు తీవ్ర ఇబ్బంది కలుగుతోందని రఘురామ వ్యాఖ్యానించారు. ఏడాదిలో గరిష్ఠంగా 15 రోజులు మాత్రమే లౌడ్‌స్పీకర్లకు అనుమతి ఉందని గుర్తుచేశారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాలను అమలు చేయాలని పోలీసులకు విజ్ఞప్తి చేశారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై బీఎన్ఎస్ సెక్షన్ల కింద చర్యలు తీసుకోవాలని సూచించారు. పబ్లిక్ న్యూసెన్స్ సృష్టించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## శాంతిభద్రతల విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదు

- రూ.1.40 కోట్లతో నిర్మించిన నూతన పోలీస్ స్టేషన్ భవనాన్ని ప్రారంభించిన హోమ్ మంత్రి అనిత, మంత్రి కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యే యార్లగడ్డ



గన్నవరం (చైతన్యరథం): నియోజకవర్గంలో రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత పర్యటించారు. తొలుత రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర, ప్రభుత్వ విప్, గన్నవరం శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావుతో కలిసి ఉంగుటూరు మండలం ఆత్కూరు గ్రామంలో రూ. 1.20 కోట్ల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు. అనంతరం రూ. 1.40 కోట్లతో నిర్మించిన నూతన పోలీస్ స్టేషన్ భవనాన్ని ప్రారంభించి పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో హోంమంత్రి అనిత మాట్లాడుతూ, రాష్ట్రం మొత్తం గన్నవరం ఎన్నికల ఫలితంపై ఉత్కంఠగా ఎదురుచూసిన వేళ తెలుగుదేశం పార్టీ గౌరవాన్ని నిలబెట్టేలా ప్రజలు యార్లగడ్డ వెంకట్రావును అఖండ మెజారిటీతో గెలిపించారని ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. 2018లో మాజీ ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్య నాయుడు శంకుస్థాపన చేసిన పోలీస్ స్టేషన్ భవనాన్ని గత ప్రభుత్వం ఐదేళ్ల పాటు పట్టించుకోలేదని విమర్శించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాతే భవన నిర్మాణం పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చామని తెలిపారు. శాంతిభద్రతల విషయంలో ఎలాంటి రాజీ ఉండదని, మహిళల రక్షణే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర కీలకమని, రాష్ట్రవ్యాప్తంగా లక్ష కెమెరాల ఏర్పాటు లక్ష్యంగా పెట్టుకుని ఇప్పటికే 70 శాతం పనులు పూర్తి చేశామని తెలిపారు. పోక్సో కేసుల్లో మూడు నెలల్లోనే శిక్షలు పడేలా చర్యలు తీసుకుంటున్నామని, ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ, మహిళా హోంమంత్రిగా అనిత ఎక్కడ సమస్య వచ్చినా అర్ధరాత్రి అయినా వెళ్లి బాధితులను పరామర్శిస్తున్నారని ప్రశంసించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మార్గదర్శకత్వంలో పోలీస్ శాఖ సమర్థవంతంగా పనిచేస్తోందని తెలిపారు. మహిళలపై వేధింపులకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. అత్యధిక మెజారిటీతో గెలిచిన యార్లగడ్డ వెంకట్రావు నియోజకవర్గ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తూ నిధులు తీసుకువస్తున్నారని కొనియాడారు. ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ... గత ప్రభుత్వ హయాంలో గన్నవరం నియోజకవర్గంలో అక్రమ కేసులు, వేధింపులు అధికంగా ఉండేవని, తాను ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత ఒక్క తప్పుడు కేసు కూడా నమోదు కాకుండా చూసుకున్నామని తెలిపారు. గతంలో 4500 కేసులు నమోదైతే ప్రస్తుతం ఆ సంఖ్య వెయ్యిలోపుకు తగ్గిందని వివరించారు.

## గిరి ప్రదక్షిణ బీటీ రోడ్డు పనులను ఆకస్మికంగా తనిఖీ చేసిన చీఫ్ విప్ జీవీ



వినుకొండ (చైతన్యరథం): వినుకొండలో చేపట్టిన గిరి ప్రదక్షిణ బీటీ రోడ్డు నిర్మాణ పనులను ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. రూ. 1.85 కోట్ల అంచనా వ్యయంతో నిర్మిస్తున్న ఈ బీటీ రోడ్డు పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. పనులు నాణ్యతతో పాటు వేగంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ప్రస్తుతం రోడ్డు నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయని అధికారులు తెలిపారు. గిరి ప్రదక్షిణకు వచ్చే భక్తులు, స్థానిక ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని ఈ సందర్భంగా జీవీ ఆంజనేయులు పేర్కొన్నారు. అభివృద్ధి పనుల్లో ఎలాంటి నిర్లక్ష్యం సహించబోమని, ప్రజలకు ఉపయోగపడే పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కూటమి నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రాజెక్టులు వేగవంతంగా పూర్తి చేయాలి

- ఎన్ హెచ్ 16 పై 6- లేన్ల ఫ్లైఓవర్ నిర్మాణం
- కనకదుర్గ ఫ్లైఓవర్ నుండి గంగూరు వరకు ఎలివేటెడ్ కారిడార్
- ఢిల్లీలో సీఎం చంద్రబాబును కలిసి అభ్యర్థన తెలిపిన ఎంపీ కేశినేని చిన్ని



ఢిల్లీ ఎయిర్‌పోర్టు / విజయవాడ (చైతన్యరథం): విజయవాడ ఎన్ హెచ్ 16పై 6 లేన్ల ఫ్లైఓవర్ నిర్మాణం మరియు కనకదుర్గ ఫ్లైఓవర్ నుండి బెంజ్ సర్కిల్ మీదుగా 14 కిలోమీటర్ల ఒక ఎలివేటర్ కారిడార్‌ను అభివృద్ధి చేయాలని విజయవాడ మచిలీపట్నం యొక్క డి.పి.ఆర్‌ను పరిశీలించి త్వరితగతిన పనులు ప్రారంభించి నిర్మాణాలు వెంటనే చేపట్టాలని సీఎం చంద్రబాబును ఎంపీ కేశినేని చిన్ని అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని చిన్ని ముఖ్యమంత్రికి అభ్యర్థిస్తూ విజయవాడ బెంజ్ సర్కిల్ మరియు గన్నవరం విమానాశ్రయం మధ్య మార్గంలో తీవ్రమైన ట్రాఫిక్ రద్దీ కొనసాగుతున్నందున విజయవాడలోని కొన్ని ప్రధాన కూడళ్లలో వాహనాలు రాకపోకలు తరచుగా నిలిచిపోతున్నాయి దీనివలన దూర ప్రాంతాలు వెళ్లే వారికి సమయం చాలా ఆలస్యం అవుతుంది. అయితే మహానాడు జంక్షన్ నుండి నిడమానూరు రైల్వే వంతెన వరకు 6-లేన్ల ఫ్లైఓవర్ నిర్మాణానికి ఇప్పటికే ప్రాజెక్టు మంజూరు అయిందని కానీ నిర్మాణం ఇప్పటివరకు జరగడం మొదలు కాలేదని ఎంపీ చిన్ని సీఎంకు తెలియజేశారు ఈ నిర్మాణం త్వరగా చేపడితే ట్రాఫిక్ సమస్యను చాలావరకు నియంత్రించే అవకాశం ఉంటుందని ఎంపీ తెలిపారు. మరొకవైపు కనకదుర్గ ఫ్లైఓవర్ చివరి నుండి గంగూరు వరకు సుమారుగా 14 కిలోమీటర్ల పొడవైన ఒక ఎలివేటర్ కారిడార్‌ను అభివృద్ధి చేయాలని ఎంపీ కేశినేని చిన్ని ప్రతిపాదన తెలిపారు ప్రస్తుతం ఉన్న రహదారిపై రద్దీనీ తగ్గించడానికి ట్రాఫిక్ యొక్క తీవ్రతను మెరుగుపరచడానికి భద్రతను పెంచడానికి మరియు భవిష్యత్తు ట్రాఫిక్ అవసరాలు సైతం తీర్చడానికి ఇది చాలా అవసరమని మరొకవైపు మచిలీపట్నం పోర్ట్ కార్యకలాపాలతో ముడిపడి ఉన్న పెరిగిన రవాణా దృష్టిలో ఉంచుకుంటే ఇది చాలా ముఖ్యమైనదని ఎంపీ వివరించారు

ఇక విజయవాడ మచిలీపట్నం సెక్షన్ యొక్క డిపిఆర్‌ను పునరుద్ధరించాలని కూడా ఎంపీ చిన్ని ముఖ్యమంత్రికి తెలిపారు డిపిఆర్ ప్రస్తుతం 4+000 నుండి కిలోమీటర్లు 63+700 వరకు ప్రతిపాదన చేశారు. అయితే బెంజ్ సర్కిల్ మరియు గంగూరు మధ్య ఇప్పటికే ప్రతిపాదిత ఎలివేటెడ్ కారిడార్ దృష్ట్యా కారిడార్ యొక్క సరైన ఏకీకరణ మరియు ప్రణాళికను నిర్ధారించడానికి డిపిఆర్ పరిమితులను సవరించి కిలోమీటర్లు9000 నుండి పరిగణలోకి తీసుకోవాలని ఎంపీ సీఎంను కోరారు. అయితే పైన తెలిపిన అభ్యర్థనలకు ముఖ్యమంత్రి చంద్రబాబు సానుకూలంగా స్పందిస్తూ త్వరితగతిన పనులన్నీ పూర్తయ్యే విధంగా చూస్తానని హామీ ఇచ్చారు.

## రాష్ట్రానికి ఉపాధి కేంద్రంగా అమరావతి : ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

- పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించిన టీడీపీ ఎమ్మెల్యే



విజయవాడ (చైతన్యరథం): పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు చక్కటి విద్యను అందించి సమాజానికి ఉత్తమ పౌరులను అందించడానికి కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుందని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ చెప్పారు. పదో తరగతి ఫలితాల్లో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాదిలో విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించారంటే అది విద్యాశాఖా మంత్రి నారా లోకేష్ తీసుకున్న సంకల్పం వల్లనేనని పేర్కొన్నారు. ఇటీవల విడుదలైన పదో తరగతి పరీక్షా ఫలితాల్లో తూర్పు నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుని అత్యధిక మార్కులు పొందిన విద్యార్థులతో సోమవారం ఉదయం ఎమ్మెల్యే గద్దె రామమోహన్ ర్యాలీ నిర్వహించారు. పటమటలోని ఎన్టీఆర్ సర్కిల్ నుంచి ఆటోనగర్ బస్ టెర్మినల్ ఎదురుగా ఉన్న యార్లగడ్డ గ్రాండియర్ వరకు ఈ ర్యాలీ జరిగింది. అనంతరం జరిగిన కార్యక్రమంలో విద్యార్థులను ఎమ్మెల్యే గద్దె రామమోహన్ సన్మానించి నగదు పురస్కారంతో సత్కరించారు. ఎన్టీఆర్ తెలుగుదేశం టీడీపీ అధ్యక్షులు గద్దె అనురాధ, యువ నాయకులు గద్దె క్రాంతి కుమార్ కూడా పాల్గొన్నారు. విజయవాడ తూర్పు నియోజకవర్గంలో మొదటి, రెండవ, మూడవ ర్యాంకులు సాధించిన 40 మందికి ఎమ్మెల్యే తన సొంత నిధుల నుండి నగదు బహుమతి అందజేశారు. మొదటి ర్యాంకు సాధించిన 13 మందికి రూ.7 వేలు చొప్పున, రెండవ ర్యాంకు సాధించిన 13 మందికి రూ.5 వేలు చొప్పున, మూడవ ర్యాంకు సాధించిన 14 మందికి రూ.3 వేలు చొప్పున మొత్తం రూ.1,98,000/- శాసనసభ్యులు విద్యార్థినీ విద్యార్థులకు అందజేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే గద్దె **రామ్మోహన్ మాట్లాడుతూ...** సమాజానికి ఉత్తమ పౌరులను అందించడానికి కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులు 2026వ సంవత్సరం పదో తరగతి పరీక్షా ఫలితాల్లో అత్యధిక మార్కులతో ఉత్తీర్ణులు అయ్యారంటే విద్యాశాఖా మంత్రి నారా లోకేష్ తీసుకున్న సంస్కరణల వల్లనేనని అభిప్రాయపడ్డారు.

**తెలుగుదేశం పార్టీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షురాలు గద్దె అనురాధ మాట్లాడుతూ...** మరికొంత మంది విద్యార్థుల్లో స్ఫూర్తిని కలిగించడానికి ఇలాంటి కార్యక్రమాలు దోహదం చేస్తాయని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విద్యారంగానికి ప్రాధాన్యత ఇచ్చి అధికారంలోకి వచ్చిన వెంటనే డిఎస్సీని ప్రకటించి పారదర్శకంగా 16 వేల టీచర్ పోస్టులను భర్తీ చేశారని పేర్కొన్నారు.

## సీఎం చంద్రబాబునాయుడు చిత్రపటానికి పాలాభిషేకం చేసిన వడ్డెరలు

- క్వారి లీజుల్లో 15% కల్పిస్తుంది ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం హర్షం



వినుకొండ (చైతన్యరథం): వడ్డెర సామాజిక వర్గానికి క్వారి లీజుల కేటాయింపులో సీఎం చంద్రబాబు నాయుడు తీసుకున్న నిర్ణయం పట్ల వడ్డెరలు హర్షం వ్యక్తం చేశారు. దీనిలో భాగంగా సోమవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో సీఎం చంద్రబాబునాయుడు చిత్రపటానికి వడ్డెర సోదరులు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... వడ్డెరలకు క్వారి డీజిల్‌లో 15% రిజర్వేషన్లు కల్పించాలని, లీజ్ సీనరేజ్లో 50% రాయితీ కల్పిస్తూ కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వడ్డెర జీవితాల్లో వెలుగులు నింపి ఆదుకోటమేనన్నారు. నిరుపేద వడ్డెర్ల ఆర్థిక అభివృద్ధికి, వారి స్వతహాగా పరిశ్రమలు పెట్టుకునేందుకు సీఎం చంద్రబాబు నాయుడు తీసుకున్న నిర్ణయం ఎంతో దోహదపడుతుందన్నారు. ఎన్నికల సమయంలో వడ్డెర్లకు రోడ్డు మెటల్, ఇతర గనుల లీజులు కేటాయిస్తామని ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం ముందుకొచ్చి రాయితీలు కల్పిస్తూ గనుల శాఖ ఆదేశాలు ఇవ్వటం ఎంతో సంతోషకరమన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు క్వారి లీజ్, సీనరైజ్ రాయితీ వడ్డెరలను ఎంతగానో ఆదుకుంటుందని, ఇంత మంచి అవకాశాన్ని కల్పించి వడ్డెరలను ఆదుకున్న కూటమి ప్రభుత్వానికి, సీఎం చంద్రబాబు నాయుడు, చీఫ్ విప్ జీవీ ఆంజనేయులుకు వినుకొండ వడ్డెరల సంఘం తరపున ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో వినుకొండ నియోజకవర్గ వడ్డెర సంఘం నాయకులు పాల్గొన్నారు.

## ప్రధాని, ముఖ్యమంత్రుల భేటీతో రాష్ట్రానికి అదనపు ప్రయోజనాలు



చిలకలూరిపేట (చైతన్యరథం): “ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబుల మర్యాదపూర్వక భేటీ ఒక చారిత్రాత్మక రాజకీయ సమావేశమనే చెప్పాలి. ఈ భేటీని రాజకీయ విశ్లేషకులు ఒక అసాధారణ ఊహాతీత రాజకీయ చర్యగా అభివర్ణిస్తున్నారు. రాజకీయాలకు అతీతంగా జరిగిన ఈ మైత్రీ సమావేశం కేంద్ర, రాష్ట్ర సంబంధాలు, ప్రజల ఆకాంక్షలకు సాక్షిగా నిలుస్తుంది. గతంలో ప్రధానిగా ఉన్నప్పుడు వాజ్ పేయ్ కూడా అప్పటి రాజకీయ పరిస్థితులకు అనుగుణంగా పలు సందర్భాల్లో మిత్రపక్షాల నాయకులతో ఇలాంటి భేటీలు జరిపేవారు. నాడు పాలనా పరమైన, ప్రజాహిత నిర్ణయాల్లో ఆయన విధిగా తమ మద్దతుదారుల ఆలోచనల్ని గౌరవించి, వారి అభిప్రాయాలకు విలువ నిచ్చేవారు. అదే తరహా సంస్కృతి, సత్సంబంధాలను నేడు మోదీ కొనసాగిస్తూ దేశ ప్రజాస్వామ్యానికి శుభ పరిణామం. సమాఖ్య ప్రభుత్వ వ్యవస్థలో ఈ తరహా సమావేశాలు పరస్పర సహకార, సామరస్య, స్నేహపూర్వక సంబంధాలను బలపరుస్తాయి. మోదీ, చంద్రబాబుల వ్యూహాత్మక భేటీ, సుదీర్ఘ చర్చలు రాష్ట్రాభివృద్ధికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సహృద్భావతకు నిదర్శనం. ఇద్దరు రాజకీయ దిగ్గజాల ప్రత్యేక ఆంతరంగిక సమావేశం.. తమ రాజకీయ ప్రత్యర్థులకు బలమైన సంకేతాలు పంపిందనే చెప్పాలి. ఈ సమావేశంతో ఎన్డీయే పక్షంలో నమ్మకమైన భాగస్వామిగా ఉన్న టీడీపీకి జాతీయస్థాయిలో మరింత ప్రాధాన్యత, ప్రత్యేక గుర్తింపుతో పాటు అదనపు ప్రయోజనాలు లభిస్తాయి.” అని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు ఒక ప్రకటనలో తెలిపారు.

## గ్రామీణాభివృద్ధికి కూటమి ప్రభుత్వం తొలి ప్రాధాన్యత : ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య

నందిగామ (చైతన్యరథం): ఉజ్వల 2.0 పథకం కింద నందిగామ మండలం అంబారుపేట గ్రామంలో సోమవారం 66 మంది మహిళా లబ్ధిదారులకు గ్యాస్ కనెక్షన్లు ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అప్పుల్లో ఉన్నప్పటికీ కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమం, గ్రామీణాభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తోందన్నారు. సూపర్ సిక్స్ హామీలు.. సూపర్ హిట్గా అమలవుతున్నాయని చెప్పారు. అంబారుపేట గ్రామంలో గత రెండేళ్లలో ఎన్ఆర్ఈజీఎస్ పథకం కింద రూ.20 లక్షల వ్యయంతో సీసీ రోడ్ల నిర్మాణ పనులు చేపట్టామన్నారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం రూ.60 లక్షలతో ప్రతిపాదనలు పంపించామని వెల్లడించారు. గ్రామంలో విద్యుత్ సమస్యలకు శాశ్వత పరిష్కారం కల్పించేందుకు రూ.4.5 కోట్ల వ్యయంతో సబ్ స్టేషన్ నిర్మాణానికి ఇప్పటికే శంకుస్థాపన చేశామన్నారు. ఎస్సీ కమ్యూనిటీ హాల్ కాంపౌండ్ వాల్ నిర్మాణానికి రూ.20 లక్షల నిధులు మంజూరు చేసినట్లు వెల్లడించారు. ప్రభుత్వం గ్రామాభివృద్ధి, మహిళా సంక్షేమం, మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారిస్తోందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. కార్యక్రమంలో అంబారుపేట గ్రామ శ్రీ సత్తెమ్మ తల్లి దేవస్థాన కమిటీ ఛైర్మన్, స్థానిక ప్రజా ప్రతినిధులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.



# మాది అభివృద్ధి నినాదం.. కాకాణిది తిట్ల దండకం!

## సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ఎద్దేవా



సర్వేపల్లి (చైతన్యరథం): తోటపల్లి గూడూరు మండలం కోడూరు పంచాయతీలో రూ.1.15 కోట్లతో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం సందర్భంగా సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి మాట్లాడారు. పాతపాళెంలో సిమెంట్ రోడ్ల నిర్మాణం రూ.10 లక్షలు ముత్యాలతోపు పెద్దపాళెం, చిన్నపాళెంలో సిమెంట్ రోడ్ల నిర్మాణం రూ.15.50 లక్షలు పట్టపుపాళేనికి తారు రోడ్డు, రూ.5 లక్షలు పాతపాళెంలో బీటీ రోడ్డు, రూ.3 లక్షలు వెంకటేశ్వరపాళెంలో సిమెంట్ రోడ్ల నిర్మాణం రూ.7 లక్షలు రూ.14 లక్షలు సెయిల్ సీఎస్ఆర్ నిధులతో 2 వేల లీటర్ల సామర్థ్యం కలిగిన రెండు ఆర్వో ప్లాంట్లు రూ.60 లక్షలు సెయిల్ సీఎస్ఆర్ నిధులతో 20 వేల లీటర్ల సామర్థ్యం కలిగిన రెండు మినరల్ వాటర్ ప్లాంట్లు రూ.1.15 కోట్లతో కోడూరు పంచాయతీలో అభివృద్ధి పనులను ప్రారంభించుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. రూ.3.75 కోట్లతో కోడూరు బీచ్ రోడ్డు పనులు జరుగుతున్నాయన్నారు. నిత్యం పర్యాటకులు వచ్చే కోడూరు బీచ్ కు వెళ్లే రోడ్డు చాలా దారుణంగా ఉండేదని, అటు బీచ్, ఇటు వేళాంగిణి చర్చికి వచ్చే భక్తులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్న పరిస్థితి ఇప్పుడు నిత్యం నాపై తిట్ల పురాణం చదువుతున్న కాకాణి గోవర్ధన్ రెడ్డి అధికారంలో ఉన్నప్పుడు బీచ్ రోడ్డు బాగును పట్టించుకున్న పాపాన పోలేదుని ఎద్దేవా చేశారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఏపీ టూరిజం ఆధ్వర్యంలో నిర్మించిన రిసార్టులను కూడా శిథిలావస్థకు చేర్చారన్నారు. కూటమి ప్రభుత్వంలో బీచ్ రోడ్డు నిర్మాణం జరుగుతుండగా, టూరిజం రిసార్ట్స్ పర్యాటకులతో కళకళలాడుతున్నాయన్నారు. కోడూరు పంచాయతీ పరిధిలో ఇరిగేషన్ లో రూ.40 లక్షలతో కాలువల్లో పూడికలు తీయించామన్నారు. గత ప్రభుత్వ పాలనలో ఇరిగేషన్‌లో పనులు చేయకుండానే బిల్లులు చేసుకున్నారన్నారు. మేం ప్రతి పనిని రైతుల భాగస్వామ్యంతో వారికి ఉపయోగపడేలా చేస్తున్నాం ఎవరెన్ని అడ్డంకులు సృష్టించినా సర్వేపల్లి నియోజకవర్గ సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు.



# 'మహానాడు' ఏర్పాట్ల పరిశీలన

నెల్లూరు (చైతన్యరథం): నెల్లూరులో ఈ నెల 27, 28 29 తేదీల్లో జరగబోయే మహానాడుకు ఏర్పాట్లు ఊపందుకున్నాయి. క్షేత్రస్థాయిలో జరుగుతున్న ఏర్పాట్లను సోమవారం మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ, సీఎం ప్రోగ్రాం కో ఆర్డినేటర్ మంతెన సత్యనారాయణరాజు, టీడీపీ నెల్లూరు పార్లమెంటరీ అధ్యక్షుడు బీద రవిచంద్ర, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిలతో కలిసి టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి పరిశీలించారు.

# టీడీపీతోనే మార్కాపురం అభివృద్ధి

## ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి

మార్కాపురం (చైతన్యరథం): శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి కొనకనమిట్ల మండలంలోని వెలిగండ్ల, మునగపాడు, బస్వాపురం, వద్దిమడుగు, ఇరసల గుండం పెదారికట్ల గ్రామాలలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల గ్రామ కమిటీలు, బూత్ కమిటీలతో సమావేశం అయ్యారు. వారితో ఎమ్మెల్యే కందుల మాట్లాడుతూ గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో గ్రామాలలో అయినా పట్టణాల్లోనైనా అభివృద్ధి జరిగిందని తర్వాత వచ్చిన వైసిపి ప్రభుత్వం అభివృద్ధిని పక్కనపెట్టి అరాచకాలు చేసిందని అన్నారు. ఇప్పటికే మార్కాపురం జిల్లా ప్రకటించామని త్వరలోనే వెలుగొండ ప్రాజెక్టును పూర్తి చేసి ఈ ప్రాంతాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తామని అన్నారు. ఈ మండలంలో ఇప్పటికే రెండు వేల కోట్ల రూపాయలతో రిలయన్స్ బయో గ్యాస్ ప్లాంటును నెలకొల్పుతున్నామని తద్వారా వేలమంది లబ్ధి పొందుతారని అన్నారు. మన ప్రభుత్వం గతంలో చేసిన అభివృద్ధిని గ్రామ కమిటీలు బూత్ కమిటీలు ప్రజల్లోకి వెళ్లి ప్రతి ఒక్కరికి వివరించాలని ప్రతి ఒక్కరిని కోరారు. ఈ సమావేశాలలో కొనకనమిట్ల మండల నాయకులు ఆయా గ్రామాల తెలుగుదేశం నాయకులు పాల్గొన్నారు.



# సీఎం చంద్రబాబు విజన్‌తో సీమకు బంగారు భవిష్యత్తు

మడకశిర (చైతన్యరథం): ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వ పాలనలో రతనాల సీమ రాయలసీమ పేరు సార్థకమవుతోందని మడకశిర ఎమ్మెల్యే తెలుగుదేశంపార్టీ అధ్యక్షుడు రాజు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన సోమవారం ఉదయం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రపంచ ప్రఖ్యాత మోటార్ సైకిళ్ల తయారీ సంస్థ రాయల్ ఎన్ ఫీల్డ్ సంస్థ తెలుగునేలపై అడుగుపెట్టడం ప్రతి తెలుగువాడికి గర్వించదగిన విషయం అని తెలిపారు. తెలుగు ప్రజల హితం కోరి పనిచేసే నాయకులు నారా చంద్రబాబునాయుడు గారు అని, ఆయన విజన్ నుండే తెలుగువారి కీర్తిప్రతిష్టలు ప్రపంచస్థాయికి ఎదిగిందని చెప్పడానికి ఇదొక ఉదాహరణ. చిత్తూరుజిల్లా, సత్యవేడులో 267 ఎకరాల విస్తీర్ణంలో, రూ.2,200కోట్ల పెట్టుబడితో, 5వేల మందికి పైగా ప్రత్యక్ష ఉద్యోగాలు ఇచ్చేందుకు రాయల్ ఎన్ ఫీల్డ్ సంస్థ ఏపీకి దూసుకొస్తోందన్నారు.



# కులం కాదు.. మతం కాదు ప్రజాసేవే పరమార్థం

## పుట్టిన రోజు వేడుకల్లో డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి వెల్లడి

దర్శి (చైతన్యరథం): కులం కాదు.. మతం కాదు ప్రజా సేవే తన రాజకీయ ప్రస్థాన పరమార్థమని దర్శి టీడీపీ ఇన్చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి పేర్కొన్నారు. టీడీపీ కార్యాలయం వద్ద కూటమి శ్రేణుల ఆధ్వర్యంలో దర్శి డాక్టర్ గొట్టిపాటి జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. మాజీ శాసనసభ్యులు నారపుశెట్టి పాపారావు, టీడీపీ యువ నాయకులు డాక్టర్ కడియాల లలిత్ సాగర్, దర్శి మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, దర్శి ఏఎంసి చైర్మన్ దారం తదితరులు ఆశీర్వదించారు. భారీ కేక్ కట్ చేసి, గజమాలతో దర్శి నియోజకవర్గంలోని టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, మహిళలు, కార్యకర్తలు, అభిమానులు సత్కారించారు. ఈ కార్యక్రమం లో నియోజకవర్గంలోని మండల పార్టీ అధ్యక్షులు మోడీ ఆంజనేయులు, పిడతల నెమిలయ్య, మారెళ్ల వెంకటేశ్వర్లు, కూరపాటి శ్రీను, మేడగం వెంకటేశ్వర రెడ్డి, నియోజకవర్గం లోని వివిధ హోదాల్లో ఉన్న టిడిపి సీనియర్ నాయకులు, మహిళలు, టీడీపీ జనసేన, బిజెపి నాయకులు కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున హాజరైన టిడిపి, కూటమి శ్రేణులు. కోలాహలంగా డాక్టర్ లక్ష్మీ జన్మదిన వేడుకల్లో పాల్గొన్నారు.

# కావలిలో వైసీపీ కంచుకోట బద్దలు

## వైకుంఠపురంలో టీడీపీలోకి భారీ చేరికలు

కావలి (చైతన్యరథం): కావలి నియోజకవర్గం వైకుంఠపురంలో వైసీపీ కంచుకోట బద్దలైంది. 35వ వార్డు నుంచి దామ మల్లికార్జున, గంగిశెట్టి కమలాకర్, వెంకటరమణ, ఖల్నాయక్, కలేషా, 36వ వార్డు నుంచి నరేష్, వెంకటేష్, కృష్ణ, సందీప్, ఉదయ్, అఖిల్, సురేందర్, సయ్యద్ నయాబ్, విష్ణు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వారి అనుచరులు కూడా పార్టీలో భారీగా చేరారు. వారందరికీ ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి పసుపు కండువాలు కప్పి టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా మహిళలు, యువకులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, మంత్రి లోకేష్, ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి నాయకత్వంపై నమ్మకంతోనే తాము టీడీపీలో చేరామన్నారు. ఈ చేరికలతో కావలి నియోజకవర్గంలో టీడీపీ మరింత బలపడింది. త్వరలో మరిన్ని భారీ చేరికలు ఉంటాయని ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి వెల్లడించారు.



# విద్యార్థులకు సొంత నిధులతో నగదు పురస్కారాలు

## ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ ప్రకటన



సూళ్లూరుపేట (చైతన్యరథం): పదవ తరగతి ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రోత్సహించేందుకు సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ కీలక నిర్ణయం తీసుకున్నారు. నియోజకవర్గంలోని ప్రతి మండలంలో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన మొత్తం 25 మంది విద్యార్థులకు తన సొంత నిధుల నుండి నగదు పురస్కారాలను అందజేయనున్నట్లు ఆమె ప్రకటించారు. ఈ ఏడాది ఫలితాల్లో పెళ్లకూరు మండలానికి చెందిన ఎస్. తనుష (589 మార్కులు), నాయుడుపేట మండలానికి చెందిన సి.హెచ్. శశి (588), నాయుడుపేట టౌన్ నుండి కె. పల్లవి సి.హెచ్. భాను (587) వంటి విద్యార్థులు అత్యుత్తమ మార్కులతో అగ్రస్థానంలో నిలిచారు. విద్యార్థులు తమ చదువును కొనసాగించి భవిష్యత్తులో గొప్ప డాక్టర్లుగా, ఇంజనీర్లుగా ఎదగాలని ఆమె ఆకాంక్షించారు. ప్రతిభకు పేదరికం అడ్డంకి కాకూడదనే ఉద్దేశంతోనే ఈ చిన్నపాటి ప్రోత్సాహాన్ని అందిస్తున్నట్లు ఎమ్మెల్యే ఈ సందర్భంగా తెలియజేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయకత్వంలోని ప్రభుత్వం ప్రవేశపెట్టిన విప్లవాత్మక మార్పుల వల్లనే నేడు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు అద్భుతమైన ఫలితాలు సాధిస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ విజయశ్రీ పేర్కొన్నారు. ఇటీవల విడుదలైన ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల ఉత్తీర్ణత శాతం గత ఏడాది 72.8శాతం నుండి 78.39 శాతం పెరగడం శుభపరిణామమని ఆమె హర్షం వ్యక్తం చేశారు.

# ఇవి మంత్రి నారా లోకేశ్ ప్రణాళికతో వచ్చిన ఫలితాలు

ఎమ్మిగనూరు (చైతన్యరథం): పట్టణంలోని మచాని సోమప్ప జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థినుల సన్మాన కార్యక్రమం పతకాలు, ప్రశంసా పత్రాల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయ నాగేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని దీపప్రజ్వలనతో ప్రారంభించి, మా తెలుగు తల్లికి మల్లెపూదండ గీతాన్ని ఆలపించారు. అనంతరం ఎస్ఎస్‌సీ పరీక్షల్లో 550కు పైగా 500కు పైగా మార్కులు సాధించిన విద్యార్థినులను పతకాలు, ప్రశంసా పత్రాలతో సత్కరించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు తల్లిదండ్రులు మాట్లాడుతూ, ప్రభుత్వం అమలు చేసిన 100 రోజుల ప్రత్యేక ప్రణాళిక తమకు ఎంతో ఉపయోగపడిందని, ఉన్నత మార్కులు సాధించడంలో కీలక పాత్ర పోషించిందని తెలిపారు. విద్యార్థులను పెద్ద లక్ష్యాలతో ముందుకు సాగాలని ప్రోత్సహిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి విశేష కృషి చేస్తున్న విద్యా శాఖ మంత్రి నారా లోకేష్‌కి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య, మెరుగైన మౌలిక వసతులు, ఆధునిక సదుపాయాలు కల్పించేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రతి విద్యార్థి ఉత్తమ విద్యను ప్రభుత్వ పాఠశాలల ద్వారానే పొందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ పాఠశాలలో చదివే విద్యార్థులు ప్రతిష్టాత్మక విద్యాసంస్థల్లో ప్రవేశాలు పొందే స్థాయికి చేరుకోవడం గొప్ప విజయమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్‌కి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓలు, ప్రధాన ఉపాధ్యాయులు, మార్కెట్ యార్డు చైర్మన్, కోఆపరేటివ్ టౌన్ బ్యాంక్ చైర్మన్, స్కూల్ విద్యా కమిటీ చైర్మన్, టీడీపీ పార్లమెంట్ నాయకులు, పట్టణ కమిటీ సభ్యులు, వార్డ్ కమిటీ సభ్యులు, క్లస్టర్ కన్వీనర్లు, స్థానిక నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థినులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.






# వైసీపీ నుంచి 30 కుటుంబాలు టీడీపీలో చేరిక

## సాదరంగా ఆహ్వానించిన మండిపల్లి

రాయచోటి (చైతన్యరథం): అన్నమయ్య జిల్లా రాయచోటి నియోజకవర్గం రాయచోటి మున్సిపాలిటీ పరిధిలోని ఆంజనేయ స్ట్రీట్ 13వ వార్డు (బూత్ నెం. 106-117,118ల్లో వైసీపీకి చెందిన 30 కుటుంబాల వారు తెలుగుదేశం పార్టీలో చేరారు. రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సోదరుడు డాక్టర్ లక్ష్మీప్రసాద్‌రెడ్డి సమక్షంలో టీడీపీ రాయచోటి పట్టణ 13వ వార్డు ఇన్చార్జి పి.శ్రీనివాసులు ఆధ్వర్యంలో చాన్‌బాషా, నాగార్జున, శివ, రెడ్డి, వెంకటరమణ, శ్రీరాములు, బాషా, వెంకటరమణ రెడ్డయ్య తదితరులు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీడీపీ చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సంక్షేమ పథకాలపై విశ్వాసంతో పార్టీలో చేరినట్టు తెలిపారు. వారిని టీడీపీ నియోజకవర్గ నాయకుడు మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి ఆత్మీయంగా ఆహ్వానించి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపాలిటీకి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# భూమి హక్కులకు రక్షణ కల్పించడమే లక్ష్యం

## పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాం కుమార్

పత్తికొండ (చైతన్యరథం): మండలం చక్రాల గ్రామంలో రాజముద్ర, క్యూఆర్ కోడ్‌తో కూడిన నూతన పట్టాదారు పాస్ పుస్తకాలను రైతులకు పంపిణీ చేసిన పత్తికొండ శాసనసభ సభ్యుడు కేఈ శ్యాం కుమార్ రైతుల భూ హక్కులకు పూర్తి రక్షణ కల్పించడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో రెవెన్యూ రికార్డుల్లో చోటుచేసుకున్న తప్పులను సరిదిద్దుతూ, పూర్తి పారదర్శకతతో కూటమి ప్రభుత్వం రాజముద్రతో కూడిన నూతన పాస్ పుస్తకాలను రైతులకు అందజేస్తోందన్నారు. వెబ్‌ల్యాండ్‌లో నమోదైన వివరాల ఆధారంగానే ఎటువంటి పొరపాట్లు లేకుండా పాస్ పుస్తకాల పంపిణీ జరుగుతుందని తెలిపారు. రైతుల ఇళ్ల వద్దకే రెవెన్యూ అధికారులు వెళ్లి పాస్ పుస్తకాలను అందజేస్తారని, పంపిణీ సమయంలో రైతుల వేలిముద్ర తప్పనిసరిగా తీసుకోవాలని అధికారులకు ఆదేశించినట్లు వెల్లడించారు. గత ప్రభుత్వ కాలంలో నిర్వహించిన రీసర్వే ప్రక్రియ కారణంగా రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని, భూహక్కు పత్రాలపై రాజకీయ నాయకుల ఫోటోలు ముద్రించడం రైతులను తీవ్ర ఆందోళనకు గురి చేసిందన్నారు. ఇప్పుడు మాత్రం కూటమి ప్రభుత్వం రైతుల గౌరవాన్ని కాపాడుతూ, రాజముద్ర క్యూఆర్ కోడ్‌తో కూడిన భద్రతా ప్రమాణాలున్న పాస్ పుస్తకాలను అందజేస్తోందని స్పష్టం చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ కూటమి ప్రభుత్వం రైతు సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తోందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్ర పునర్నిర్మాణం దిశగా ముందుకు సాగుతున్నామని, గ్రామాల అభివృద్ధే రాష్ట్రాభివృద్ధికి పునాది అని తెలిపారు. 2026 సంవత్సరం రాష్ట్రానికి సుభిక్షాన్ని తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, టీడీపీ నాయకులు, జనసేన బీజేపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, రైతులు రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.




# సమ్మర్ క్యాంపుల ఆకస్మిక తనిఖీ

## తెల్లారకముందే పీటీసీ మైదానానికి ఎమ్మెల్యే దగ్గుపాటి



అనంతపురం (చైతన్యరథం): అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ సమ్మర్ క్యాంపులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. గత కొన్ని రోజులుగా ప్రభుత్వం, శాప్ ఆధ్వర్యంలో పీటీసీ మైదానంలో వేసవి శిక్షణ శిబిరాలు నడుస్తున్నాయి. వీటిని సోమవారం ఉదయం 6 గంటలకే ఎమ్మెల్యే దగ్గుపాటి ఆకస్మికంగా తనిఖీలు చేశారు. శిక్షణ శిబిరాలకు ఎంతమంది విద్యార్థులు హాజరవుతున్నారు. కోచ్ లు సరిగా వస్తున్నారా లేదా వంటి అంశాల గురించి ఆరా తీశారు. కాసేపు పిల్లలతో మాట్లాడుతూ సరదాగా ఆటలాడారు. ప్రభుత్వం ఎంతో ఖర్చు చేసి ఈ శిబిరాలను ఏర్పాటు చేసిందని వీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం పిటిసిలో వాకింగ్ చేస్తున్న వాకర్స్, యోగా చేస్తున్న వారితో ఎమ్మెల్యే దగ్గుపాటి మాట్లాడారు. పిటిసిలో ఉన్న సౌకర్యాల గురించి ఆరా తీశారు. ప్రస్తుతం ఇక్కడ ఉన్న జిమ్ లో పరికరాలు దెబ్బతిన్నాయని.. ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. వాటిని త్వరలోనే మరమ్మతులు చేయడం లేదా కొత్త వాటిని ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ వేసవిలో విద్యార్థులకు క్రీడల్లో శిక్షణ ఇవ్వాలన్న ఉద్దేశంతో సమ్మర్ క్యాంపులను ఏర్పాటు చేసిందని చెప్పారు. గత ప్రభుత్వంలో ఇలాంటి కార్యక్రమాలు ఎక్కడా కనిపించలేదని విమర్శలు చేశారు. అవినీతి తప్ప ప్రజలు విద్యార్థుల గురించి ఆలోచించిన పాపాన పోలేదన్నారు. ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో పాటు ప్రజల ఆరోగ్యం, ఆహ్లాదం కోసం ఇలాంటి కార్యక్రమాలు కూడా ఏర్పాటు చేస్తోందని చెప్పారు. మైదానంలో ప్రస్తుతం 3వేలమంది ప్రతిరోజు వాకింగ్, యోగా వంటివి చేస్తున్నారన్నారు. ఇక్కడ సౌకర్యాలు మరింత మెరుగుపరుస్తామని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు.

# మంత్రి నారా లోకేష్ పర్యటనకు చురుగ్గా ఏర్పాట్లు



అనంతపురం (చైతన్యరథం): టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి నారా లోకేష్ గారి పర్యటనకు అనంతపురం నగరంలో ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. నగరంలోని మైత్రివనం సమీపంలో ఉన్న గల్లా టౌన్ షిప్‌లో ఈనెల 15న ఆయన కార్యకర్తలతో సమావేశం నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను జిల్లా అధ్యక్షుడు పూల నాగరాజు, ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, పార్టీ అబ్జర్వర్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు గారు, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ చౌదరి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఉమ్మడి జిల్లా పర్యటనలో భాగంగా ఈనెల 14, 15 తేదీల్లో మంత్రి లోకేష్ వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటారు. అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో కార్యకర్తలతో సమావేశం ఉన్న నేపథ్యంలో ఈ పర్యటనను పార్టీ నాయకులు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. మంత్రి లోకేష్ భారీ స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. అలాగే కార్యకర్తల సమావేశంలో ఎలాంటి లోటు పాట్లు లేకుండా ఏర్పాట్లు సాగుతున్నాయి. మంత్రి లోకేష్ పర్యటనలో పాల్గొనేందుకు కార్యకర్తలు, నాయకులు ఎంతో ఉత్సాహంగా ఉన్నారని ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు పూల నాగరాజు తెలిపారు. మంత్రి నారా లోకేష్ పర్యటనకు అన్ని ఏర్పాట్లు జరుగుతున్నాయని చెప్పారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం అహర్నిశలు శ్రమిస్తున్న నారా లోకేష్ పార్టీకి కూడా అంతే ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. ఆర్డిటికీ ఎఫ్.సి.ఆర్.ఏ చేయించిన ఘనత మంత్రి లోకేష్‌కే దక్కుతుందన్నారు. ఆయన పర్యటనను విజయవంతం చేసేందుకు పార్టీ శ్రేణులంతా కష్టపడి పని చేస్తున్నట్లు పూల నాగరాజు వివరించారు.



# ఏపీ ప్రగతికి మీరే బ్రాండ్ అంబాసిడర్లు

## మంత్రి లోకేష్‌కు సింగపూర్ ప్రవాసాంధ్రుల ఆత్మీయ స్వాగతం

**సింగపూర్:** సింగపూర్ పర్యటనకు వెళ్లిన ఆంధ్రప్రదేశ్ ఐటీ, విద్యా శాఖల మంత్రి నారా లోకేష్‌కు ప్రవాసాంధ్రులు ఘన స్వాగతం పలికారు. రాష్ట్ర అభివృద్ధికి లోకేష్ చూపుతున్న చొరవను కొనియాడుతూ ఎన్ఆర్ఐలు ఆయనతో ముచ్చటించారు. ప్రపంచ ప్రఖ్యాత మోటార్ సైకిల్ తయారీ సంస్థ 'రాయల్ ఎన్‌ఫీల్డ్' పరిశ్రమను ఆంధ్రప్రదేశ్‌కు తీసుకువచ్చినందుకు ప్రవాసాంధ్రులు లోకేష్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తక్కువ కాలంలోనే ఇటువంటి భారీ పెట్టుబడులను ఆకర్షించడం పట్ల వారు సంతోషం వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ.. "మీరంతా విదేశాల్లో ఉన్నా మన రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వాములు కావాలి. మీరు పనిచేస్తున్న అంతర్జాతీయ సంస్థల్లో ఆంధ్రప్రదేశ్‌లో మారుతున్న పారిశ్రామిక వాతావరణం, ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను వివరించాలి. రాష్ట్ర ప్రగతికి మీరే నిజమైన బ్రాండ్ అంబాసిడర్లు" అని పిలుపునిచ్చారు. రాష్ట్రానికి మరిన్ని పెట్టుబడులు, అత్యాధునిక సాంకేతికతను తీసుకురావడమే లక్ష్యంగా తన సింగపూర్ పర్యటన సాగుతుందని ఆయన పేర్కొన్నారు. యువతకు ఉపాధి కల్పించే ఐటీ, తయారీ రంగాలపై ప్రత్యేక దృష్టి సారిస్తానని చెప్పారు.



# గ్లోబల్ రీసెర్చ్ హబ్‌గా ఏపీ

## 'స్టాన్‌ఫర్డ్' మేధావులతో విశాఖపట్నం ఎంపీ మతుకుమిల్లి శ్రీభరత్ భేటీ



**స్టాన్‌ఫర్డ్:** అమెరికా పర్యటనలో భాగంగా స్టాన్‌ఫర్డ్ ఫ్యాకల్టీ క్లబ్‌లో స్టాన్‌ఫర్డ్–భారత్ ఫ్యాకల్టీల మధ్య ప్రత్యేక సమావేశానికి విశాఖపట్నం ఎంపీ మతుకుమిల్లి శ్రీభరత్ ఆతిథ్యం ఇచ్చారు. ఈ సందర్భంగా AI, వైద్యం, విద్య, పబ్లిక్ పాలసీ, సస్టైనబిలిటీ, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ విషయాలపై లోతైన చర్చలు జరిగాయి. స్టాన్‌ఫర్డ్ యూనివర్సిటీ ఫ్యాకల్టీలు, పరిశోధకులు, క్లినీషియన్లు, ఆల్మనైలో భారత్‌తో... ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌తో ప్రభావవంతమైన కార్యక్రమాల్లో సహకారం చేయడానికి ఆసక్తి కనబర్చారు. AI–ఆధారిత ఆరోగ్య సంరక్షణ, మానసిక ఆరోగ్యం, విద్య, సస్టైనబిలిటీ, శక్తి, పరిశోధన భాగస్వామ్యాల్లో అవకాశాలపై విస్తృత చర్చ జరిగింది. శాశ్వత ప్రభావం కోసం బలమైన సంస్థలు, నమ్మకమైన సహకారాల అవసరం అని తెలిపారు. ఆవిష్కరణలు, పరిశోధనల గ్లోబల్ హబ్‌గా ఆంధ్రప్రదేశ్ ఎదుగుతుందని శ్రీభరత్ ఆకాంక్షించారు. ఈ లోతైన చర్చలను సమీకరించిన విద్యాని సూర్యదేవరకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

స్టాన్‌ఫర్డ్ యూనివర్సిటీ నుంచి అనురాధ చిరలా (కార్డియోవాస్కులర్ మెడిసిన్ క్లినికల్ అసిస్టెంట్ ప్రొఫెసర్), రాజేష్ దాష్ (మెడిసిన్–కార్డియోవాస్కులర్ మెడిసిన్ అసోసియేట్ ప్రొఫెసర్), నీరాజా కంభం (పాథాలజీ ప్రొఫెసర్), లియో జోసెఫ్ (గ్రాడ్యుయేట్ స్కూల్ ఆఫ్ బిజినెస్), వినిత్ బి.మహాజన్ (ఆప్తాల్మాలజీ ప్రొఫెసర్), దిన్షా మిస్త్రీ (హూవర్ ఇన్‌స్టిట్యూషన్ హూవర్ రీసెర్చ్ ఫెలో), శ్రీధర్ నారాయణన్ (సెబాస్టియన్ ఎస్.క్రెస్జ్ మార్కెటింగ్ ప్రొఫెసర్), హయగ్రీవరావు (గ్రాడ్యుయేట్ స్కూల్ ఆఫ్ బిజినెస్ అథోల్ మెక్‌బీన్ ప్రొఫెసర్, సోషియాలజీ కొర్టెసీ ప్రొఫెసర్), గులికా రెడ్డి (లా అసోసియేట్ ప్రొఫెసర్ (టీచింగ్)), నవదీప్ ఎస్. సాహ్నీ (గ్రాడ్యుయేట్ స్కూల్ ఆఫ్ బిజినెస్ మార్కెటింగ్ ప్రొఫెసర్), కౌస్తుభ్ సుపేకర్ (సైకియాట్రీ అండ్ బిహేవియరల్ సైన్సెస్ క్లినికల్ అసోసియేట్ ప్రొఫెసర్), విద్యాని సూర్యదేవర (జెనెటిక్స్ ఇన్‌స్ట్రక్టర్)–వైద్యం, బిజినెస్, లా, జెనెటిక్స్, సైకియాట్రీ, మార్కెటింగ్, సోషియాలజీ, పరిశోధనల్లో వారి సహకారాలకు శ్రీభరత్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. గొప్ప ఫ్యాకల్టీలు, శాస్త్రవేత్తలతో భేటీ కావడం ఆనందంగా ఉందన్నారు. ఈ రకమైన బహిరంగ చర్చలు వ్యక్తిగత ప్రయత్నాలను స్కేలబుల్ ప్రభావంగా మార్చడానికి అత్యంత ముఖ్యమని చెప్పారు.

# అమెరికాలో తెలుగు టెక్కీ విషాదాంతం

## వ్యాలీ ఫీవర్‌తో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ చిరంజీవి కన్నుమూత

## కుటుంబానికి అండగా GoFundMe ద్వారా విరాళాల సేకరణ

**కాలిఫోర్నియా:** అమెరికాలో స్థిరపడిన ఒక తెలుగు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అరుదైన ఫంగల్ ఇన్ఫెక్షన్‌తో ప్రాణాలు కోల్పోయాడు. కాలిఫోర్నియాలో నివసిస్తున్న చిరంజీవి కొల్లా (37) అనే టెక్కీ నెల పాటు మృత్యువుతో పోరాడి కన్నుమూశాడు. ఆయన మరణం స్థానిక తెలుగు కమ్యూనిటీలో తీవ్ర విషాదం నింపింది.

**అసలేం జరిగింది?**

ఏప్రిల్ మొదటి వారంలో చిరంజీవికి సాధారణ జ్వరం, దగ్గు వంటి లక్షణాలు కనిపించాయి. అది మామూలు ఫ్లూ అని భావించినప్పటికీ ఆరోగ్యం క్షీణించడంతో ఆస్పత్రికి వెళ్లాడు. వైద్యులు మొదట దీనిని తీవ్రమైన నిమోనియాగా భావించారు. అయితే తదుపరి పరీక్షల్లో ఆయనకు వ్యాలీ ఫీవర్ సోకినట్టు తేలింది. ఫంగస్



ఆయన ఊపిరితిత్తులపై తీవ్ర ప్రభావం చూపింది. పరిస్థితి విషమించడంతో వైద్యులు వెంటిలేటర్‌పై ఉంచి చికిత్స అందించారు. సుమారు 30 రోజుల పాటు పోరాడిన చిరంజీవి చివరకు ఈ నెల 5న తుదిశ్వాస విడిచాడు. చిరంజీవికి భార్య పావని, ఐదేళ్ల కుమారుడు విహాన్ ఉన్నారు. ఈ కుటుంబానికి అండగా చిరంజీవి బంధువు రామకోటేశ్వరరావు ఆయన కుటుంబానికి అండగా నిలిచేందుకు GoFundMe ద్వారా విరాళాల సేకరణ ప్రారంభించారు.

లక్ష్యం: 3,00,000 డాలర్లు.

ఉపయోగం: ఆస్పత్రి ఖర్చులు, అంత్యక్రియలు, ఆయన భార్య, చిన్నారి భవిష్యత్తు అవసరాలకు ఈ నిధిని వినియోగించనున్నారు. ఇప్పటికే సుమారు 2,700 మందికి పైగా దాతలు స్పందించి లక్ష్యంలో 60% పైగా నిధులను సమకూర్చారు.

### వ్యాలీ ఫీవర్ అంటే....

ఇది కోకిడియోయిడ్స్ అనే శిలీంధ్రం వల్ల వచ్చే శ్వాసకోశ ఇన్ఫెక్షన్.

వ్యాప్తి: ఈ ఫంగస్ ప్రధానంగా మట్టిలో ఉంటుంది. కాలిఫోర్నియా, అరిజోనా వంటి పొడి, ఎడారి ప్రాంతాల్లో ఇది ఎక్కువగా కనిపిస్తుంది. గాలి వీచినప్పుడు, మట్టిని తవ్వినప్పుడు ఈ ఫంగస్ కణాలు గాలిలోకి చేరుతాయి. వీటిని పీల్చడం వల్ల ఇన్ఫెక్షన్ సోకుతుంది.

లక్షణాలు: సాధారణ జ్వరం, దగ్గు, అలసట, ఛాతీ నొప్పి, ఒళ్లు నొప్పులు.

ప్రమాదం: చాలా మందిలో ఇది తక్కువ సమయంలోనే తగ్గిపోతుంది. కానీ రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్నవారిలో లేదా వ్యాధి ముదిరినప్పుడు ఇది ప్రాణాంతకంగా మారుతుంది.

విదేశాల్లో ఉండే భారతీయులు ఇటువంటి అరుదైన వ్యాధుల పట్ల అవగాహన కలిగి ఉండాలి. లక్షణాలు కనిపించిన వెంటనే సరైన నిపుణులను సంప్రదించడం ఎంతో ముఖ్యం.



# కనుల పండువగా శ్రీసీతారామ కల్యాణం

**రాలీ, నార్త్ కరోలినా:** భారతీయ ఆధ్యాత్మిక ప్రవాహాన్ని ప్రోత్సాహిస్తున్న ఉత్తర అమెరికా తెలుగు సంఘం (నాట్స్) తాజాగా రాలీలో చిన్న జీయర్ సంస్థ జెట్ క్యారీతో కలిసి సీతారామ కల్యాణ మహోత్సవం నిర్వహించింది. ఈ ఆధ్యాత్మిక వేడుక ప్రవాసంలో ఉన్న మన సంస్కృతి, సంప్రదాయాల వైభవాన్ని ప్రతిబింబిస్తూ విజయవంతంగా సాగింది. వేదమంత్రోచ్ఛారణల మధ్య పవిత్రమైన, మంగళకరమైన వాతావరణంలో జరిగిన ఈ వేడుకను వీక్షించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. దివ్య దంపతులైన శ్రీరాముడు, సీతాదేవి కల్యాణ ఘట్టం ధర్మం, ప్రేమ ఐక్యతకు ప్రతీకగా నిలిచింది. అర్చకస్వాములు క్రతువులను సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. కల్యాణం అంతరార్థాన్ని కూడా వివరించడంతో అన్ని వయస్సు వారికీ ఈ వేడుక అత్యంత అర్థవంతంగా అనిపించింది. పండుగ వాతావరణాన్ని ప్రతిబింబించేలా వేదికను అందమైన పుష్పాలతో, సంప్రదాయక అలంకరణలతో పవిత్రంగా తీర్చిదిద్దారు. ఈ మహత్కార్యం విజయవంతంగా సాగేందుకు నాట్స్, జెట్ క్యారీ వలంటీర్లు ఎంతో సమన్వయంతో, అంకితభావంతో కృషి చేశారు. భక్తి గీతాలు, సాంస్కృతిక ప్రదర్శనలు ప్రేక్షకులను ఆధ్యాత్మిక పారవశ్యంలో ముంచెత్తాయి. ఇది కేవలం ఒక మత పరమైన వేడుకగా మాత్రమే కాకుండా సమాజంలోని కుటుంబాల మధ్య అనుబంధాన్ని బలపరిచే వేదికగా నిలిచింది. చివరగా భక్తులందరికీ ప్రసాద వితరణ చేయడంతో కార్యక్రమం సంతోషకరంగా ముగిసింది. మన సంప్రదాయాలను భావితరాలకు అందిస్తూ, సమాజంలో ఐక్యతను పెంపొందించే దిశగా నాట్స్ రాలీ చాప్టర్, జెట్ క్యారీ చేసిన ఈ ప్రయత్నం అందరి ప్రశంసలు అందుకుంది. ఇంత చక్కటి కార్యక్రమంలో భాగస్వామిగా మారి సీతారామ కల్యాణం దిగ్విజయం చేయడంలో కీలక పాత్ర పోషించిన 'నాట్స్' రాలీ విభాగం నాయకులను 'నాట్స్' చైర్మన్ కిషోర్ కంచర్ల, 'నాట్స్' అధ్యక్షుడు శ్రీహరి మందాడి ప్రత్యేకంగా అభినందించారు.

# తమిళనాడు మాజీ సీఎంతో తాజా సీఎం భేటీ



తమిళనాడు కొత్త సీఎం విజయ్ మాజీ సీఎం ఎంకే స్టాలిన్ తో భేటీ అయ్యారు. టీవీకే చీఫ్ సోమవారం డీఎంకే అధినేత నివాసానికి వెళ్లి మర్యాదపూర్వకంగా కలిశారు. స్టాలిన్ నివాసంలో జరిగిన ఈ భేటీలో మాజీ ఉపముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ కూడా పాల్గొన్నారు. ఈ నేతలు రాష్ట్రానికి సంబంధించిన వివిధ అంశాలపై చర్చించారు. రాష్ట్ర ఖజానాను గత డీఎంకే ప్రభుత్వం ఖాళీ చేసిందని ఇప్పటికే విజయ్ ఆరోపించారు. దీనికి స్టాలిన్ కూడా బదులిచ్చారు. అప్పులు పరిమితికి లోబడే ఉన్నాయన్నారు. కొవిడ్ లాంటి విపత్తును ఎదుర్కొని, నిధులు ఇవ్వడంలో అడ్డంకులు సృష్టించిన భాజపాను తట్టుకుని దీటుగా నిలబడ్డామని తెలిపారు. ఈ నేపథ్యంలో వీరిద్దరు సమావేశం కావడం ప్రాధాన్యం సంతరించుకుంది.

**సర్టిఫికేట్ మర్చిపోయి.. ప్రమాణస్వీకారానికి దూరం**

టీవీకే విజయ్ నేతృత్వంలో ఆదివారం తమిళనాడులో కొత్త ప్రభుత్వం కొలువుదీరింది. మే 13న ఈ ప్రభుత్వం అసెంబ్లీలో బలపరీక్ష ఎదుర్కోనుంది. మరోవైపు నేడు కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేల ప్రమాణ స్వీకారం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా అనూహ్య సంఘటన చోటుచేసుకుంది. నిన్న మంత్రిగా ప్రమాణం చేసిన యువనేత కీర్తన.. నేడు ఎమ్మెల్యేగా ప్రమాణస్వీకారం చేయలేకపోయారు. ఎలక్షన్ సర్టిఫికేట్ను తీసుకురాకపోవడమే అందుకు కారణం. తర్వాత వెనక్కి వెళ్లిన ఆమె దానిని తీసుకొచ్చి, సమర్పించడంతో ఎట్టకేలకు ఎమ్మెల్యేగా ప్రమాణస్వీకారం చేశారు.

# సర్ వల్లే సీట్లు కోల్పోయాం : సుప్రీం కోర్టులో టీఎంసీ పిటిషన్



ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) అంశంలో టీఎంసీ పిటిషన్పై సుప్రీంకోర్టు విచారణ జరిపింది. ఈ సందర్భంగా 'సర్' వల్ల ఫలితాలు తారుమారయ్యాయని టీఎంసీ వాదనలు వినిపించింది. పలుచోట్ల స్వల్ప తేడాతో ఓడిపోయామంది. 'సర్' లో తొలగించిన ఓట్ల పునురుద్ధరణ కోసం వేలల్లో అప్పీళ్లు పెండింగ్లో ఉన్నాయని తెలిపింది. అవి పరిష్కరించకుండానే ఎన్నికలు జరిగాయని పేర్కొంది. వేలల్లో పెండింగ్లో ఉన్న 31అసెంబ్లీ స్థానాల్లో వందల ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యామని వెల్లడించింది. ఒక నియోజకవర్గంలో తమ పార్టీ అభ్యర్థి కేవలం 862 ఓట్ల తేడాతో ఓడిపోయారని టీఎంసీ పేర్కొంది. ఆ నియోజకవర్గంలో ఓటర్ల జాబితా నుంచి 5,000కు పైగా పేర్లు తొలగించారని ఆరోపించింది. రాష్ట్రంలో తమ పార్టీకి, భాజపాకు మధ్య మొత్తం ఓట్ల తేడా సుమారు 32 లక్షలు ఉండగా.. ఓట్ల తొలగింపులకు వ్యతిరేకంగా దాఖలైన అప్పీళ్లు 35 లక్షలకు పైగా ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేసింది. ఇటువంటి అవకతవకల వల్లే ఎన్నికల ఫలితాలు తారుమారు అయ్యాయంది. టీఎంసీ వాదనలపై సుప్రీం కోర్టు స్పందిస్తూ.. ఓట్ల తొలగింపులు చేపట్టిన ప్రాంతాల్లో స్వల్ప తేడాతో పార్టీ ఓడిపోతే దానిపై తిరిగి దరఖాస్తు చేసుకునే స్వేచ్ఛ బాధితులకు ఉంటుందని పేర్కొంది. అటువంటి స్థానాలలోని ఓటర్లు లేదా పార్టీలు కొత్త దరఖాస్తులు చేసుకోవచ్చని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జయమాల్య బాగ్చీ నేతృత్వంలోని ధర్మాసనం వెల్లడించింది. అటువంటి కేసులను తాము పరిశీలిస్తామంది.

# వచ్చే నెల 1 నుంచి కొత్త ఉపాధి పథకం అమలు : కేంద్రం



'మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం' (ఎంజీనరేగా)ను రద్దు చేసి దాని స్థానంలో కేంద్ర ప్రభుత్వం 'వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్ గార్ అండ్ ఆజీవికా మిషన్ను తీసుకువచ్చిన విషయం తెలిసిందే. ఈ కొత్త చట్టాన్ని లై 1నుంచి అమలు చేయనున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ఇది గ్రామీణ కుటుంబాలకు 125 రోజుల చట్టబద్ధమైన వేతన ఉపాధికి హామీ ఇస్తుందని తెలిపింది. జీవనోపాధి భద్రత, గ్రామీణ ప్రజలకు ఆదాయ కల్పన, మౌలిక సదుపాయాల అభివృద్ధి, గ్రామీణ ప్రజల్లో పరివర్తనను తీసుకురావడమే ఈ చట్టం లక్ష్యమని గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ తెలిపింది. ఎంజీనరేగా నుంచి కొత్త విధానానికి మారే ప్రక్రియలో కార్మికులకు ఎలాంటి అంతరాయం కలగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించింది. కొత్త గ్రామీణ రోజ్ గార్ గ్యారంటీ కార్డులు జారీ అయ్యే వరకు ప్రస్తుతం ఉన్న ఇ-కేవైసీ ఎంజీనరేగా కార్డులే చెల్లుబాటులో ఉంటాయంది. జాబ్ కార్డులు లేని కార్మికులు గ్రామ పంచాయతీలో నమోదు చేసుకోవాలని సూచించింది.వేతన చెల్లింపులు, ఫిర్యాదుల పరిష్కారం, పని కేటాయింపు నిబంధనలు, పరిపాలనా వ్యయం వంటి ఇతర విషయాల గురించి రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలతో సంప్రదిస్తున్నట్లు గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ తెలిపింది. త్వరలో ప్రజాభిప్రాయ సేకరణ కోసం వాటిని ప్రచురిస్తామంది. వేతనాలను నేరుగా కార్మికుల బ్యాంకు ఖాతాలు లేదా పోస్ట్ ఆఫీస్ ఖాతాల్లోకి బదిలీ చేయనున్నట్లు పేర్కొంది.

# సైనిక స్థావరాలు లక్ష్యంగా పేలుళ్లకు పాక్ కుట్ర



భారత్‌లో తన ఉగ్ర నెట్వర్క్ ను విస్తరించడానికి పాక్ నిఘా సంస్థ ఐఎస్ఐ కుట్ర పన్నుతున్నట్లు నిఘా వర్గాలు అనుమానం వ్యక్తం చేస్తున్నాయి. 2024లో పంజాబ్ యూట్యూబర్ రోజెర్ సంధూ ఇంటి వద్ద కాల్పుల కేసులో ఐఎస్ఐతో సంబంధమున్న పాక్ గ్యాంగ్‌స్టర్ పేరు బయటకు రావడంతో ఈ అనుమానం నెలకొంది. భారత్‌లో జరిగిన పలు దాడుల్లో పాక్ గ్యాంగ్‌స్టర్ షహజాద్ భట్టీ హస్తం ఉంది. గతంలో ఎన్సీపీ నేత బాబా సిద్ధిఖీ హత్య కేసులో కూడా అతడి పేరు బయటకు వచ్చింది. అతడు దుబాయ్‌లో ఉంటూ భారత్లో దాడులకు ప్రణాళికలు రచిస్తున్నట్లు నిఘా వర్గాలు భావిస్తున్నాయి. కొన్ని నెలలుగా అతడు సోషల్ మీడియా వేదికగా.. మతపరమైన రెచ్చగొట్టే ప్రసంగాలు చేస్తున్నాడు. వాటితో దేశంలో పలు ప్రాంతాల్లోని యువతను ఉగ్రవాదం వైపు మళ్లించడానికి ప్రయత్నిస్తున్నట్లు నిఘా వర్గాలు వెల్లడించాయి. ఎన్క్రిప్టెడ్ యాప్ ద్వారా అతడితో సంప్రదింపులు జరుపుతున్న మధ్యప్రదేశ్, యూపీ, జమ్మూకశ్మీర్, పంజాబ్, గుజరాత్లకు చెందిన 9 మంది యువకులను అదుపులోకి తీసుకున్నట్లు అధికారులు పేర్కొన్నారు. దిల్లీ సహా దేశంలోని ప్రసిద్ధ రెస్టారంట్లు, రద్దీ ప్రదేశాలు, హరియాణాలోని సైనిక స్థావరాలపై కాల్పులు జరపాలని షహజాద్ వీరికి ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. తమ ముఠా ప్రపంచవ్యాప్తంగా 16-17 దేశాలలో విస్తరించి ఉందని షహజాద్ చెబుతున్న ఓ వీడియో సోషల్ మీడియాలో వైరల్గా మారింది. దాదాపు 300 మంది యువకులు తనతో కలిసి పనిచేస్తున్నారని అతడు తెలిపాడు. గ్యాంగ్ స్టర్ లారెన్స్ బిష్ణోయ్ తోనూ అతడికి సంబంధం ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) అతడి కోసం గాలింపు చేపట్టింది.



# బాంగ్లా సరిహద్దు కంచె కోసం బీఎస్ఎఫ్‌కు భూమి కేటాయింపు

## పశ్చిమ బెంగాల్ కొత్త ప్రభుత్వం కీలక నిర్ణయం

పశ్చిమ బెంగాల్‌లో ఏర్పాటైన నూతన ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. భారత్, బంగ్లాదేశ్ సరిహద్దుల్లో కంచె నిర్మాణం కోసం బీఎస్ఎఫ్‌కు భూమిని కేటాయిస్తూ తొలి మంత్రివర్గ సమావేశంలోనే నిర్ణయం తీసుకుంది. దీనిపై ముఖ్యమంత్రి సువేందు అధికారి మాట్లాడుతూ ఎన్నికల్లో హామీ ఇచ్చినట్లుగానే బంగ్లాదేశ్ వెంబడి ఉన్న సరిహద్దుల్లో కంచె నిర్మాణానికి బీఎస్ఎఫ్కు భూమిని బదిలీ చేశామన్నారు. మరో 45రోజుల్లో ఈ ప్రక్రియ పూర్తవుతుందన్నారు. కేంద్రం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఆయుష్మాన్ భారత్ పథకంతో పాటు ఇతర పథకాలనూ రాష్ట్రంలో అమలు చేయనున్నట్లు ప్రకటించారు. ఎన్నికల ప్రచార సమయంలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా హామీ ఇచ్చినట్లుగా.. పాఠశాలల్లో ఉద్యోగాల భర్తీకి వయో పరిమితిని ఐదేళ్లు పొడిగించే ప్రతిపాదనకు కూడా క్యాబినెట్ ఆమోదం తెలిపిందని సువేందు పేర్కొన్నారు. హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ జారీ చేసిన జూన్ 2025 జనగణన సర్క్యులర్ను గత ప్రభుత్వం విస్మరించిందని.. దానిని తక్షణమే అమలు చేసేలా మంత్రివర్గం నిర్ణయం తీసుకుందన్నారు.

# నీట్‌గా ప్రవేశ పరీక్ష పేపర్ లీక్

## దర్యాప్తు జరుగుతోందని నిర్వహణా సంస్థ వెల్లడి

వైద్యవిద్య కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన 'నీట్ యూజీ ప్రవేశపరీక్ష 2026కు సంబంధించి ప్రశ్నపత్రం లీక్ కలకం సృష్టిస్తోంది. పరీక్షకు ముందు రాజస్థాన్‌లో సర్క్యులేట్ అయిన గెస్ మెటీరియల్లో పరీక్ష పత్రంలోని పలు ప్రశ్నలు పోలిఉన్నట్లు అధికారులు గుర్తించారు. దీంతో విద్యార్థులు ఆందోళనకు గురయ్యారు. దీనిపై రాజస్థాన్ స్పెషల్ ఆపరేషన్స్ గ్రూప్ దర్యాప్తు చేపట్టింది. మే 3న జరిగిన పరీక్షలో వచ్చిన ప్రశ్నలను పోలిన సుమారు 140 ప్రశ్నలతో ఉన్న ఓ గెస్ పేపరు అధికారులు గుర్తించారు. ఈ మెటీరియల్ రాజస్థాన్లోని సికార్లో పరీక్షకు రెండు రోజుల ముందు అందుబాటులోకి వచ్చినట్లు తెలిపారు. దీనిని విద్యార్థులకు రూ.20వేల నుంచి రూ.2 లక్షల వరకు విక్రయించినట్లు గుర్తించామన్నారు.ఈ ప్రశ్నలు యాదృచ్ఛికంగా ఒకే మాదిరిగా ఉన్నాయా, లేదా ఎవరైనా పేపర్ లీక్ చేశారా అనే దానిపై అధికారులు దర్యాప్తు చేపట్టారు. అయితే పలు ప్రశ్నలలోని జవాబుల క్రమం కూడా ఒకేలా ఉండడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఆ ప్రాక్టీస్ పేపర్ కేరళలోని ఓ వైద్య కళాశాలలో చదువుతున్న ఎంబీబీఎస్ విద్యార్థికి చెందినదని తేలినట్లు అధికారులు పేర్కొన్నారు. అతను మే 1న సికార్లోని తన స్నేహితుడికి ఈ మెటీరియల్ ఇచ్చాడని.. ఆ తర్వాత అది పీజీ వసతిగృహాలు, కోచింగ్ నెట్వర్క్లు, కెరీర్ కౌన్సెలర్లు, పరీక్షకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు చేరిందని వెల్లడించారు. ఆ మెటీరియల్లో ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీకి సంబంధించిన 300కు పైగా చేతిరాత ప్రశ్నలు ఉన్నాయన్నారు. ఈ ఘటనపై జాతీయ పరీక్షల సంస్థ స్పందిస్తూ.. నీట్ యూజీ2026కి సంబంధించి అవకతవకలు జరిగినట్లు వస్తున్న ఆరోపణలు తమ దృష్టికి వచ్చినట్లు తెలిపింది. పరీక్ష జరిగిన నాలుగు రోజుల తర్వాత ఈ సమాచారం అందిందని పేర్కొంది. ఆ వివరాలను సంబంధిత ఏజెన్సీలకు అందించామంది. ఈ ఘటనపై దర్యాప్తు జరుగుతోందని దీన్ని పారదర్శకంగా పరిశీలించి పూర్తి వివరాలను వెల్లడిస్తామని పేర్కొంది.



# “మునీర్ ప్రకటనలన్నీ డొల్లే”



ఆపరేషన్ సిందూర్ వేళ అమెరికా సాయం కోసం పాకిస్థాన్ లాబీయింగ్ యత్నాలు బహిర్గతమయ్యాయి. ఈ విషయం యూఎస్ ఫారిన్ ఏజెంట్స్ రిజిస్ట్రేషన్ యాక్ట్ కింద దాఖలైన ఫైలింగ్స్‌లో వెల్లడైంది. రక్షణ, ఆర్థికశాఖ అధికారులు, జర్నలిస్టులతో పాక్ లాబీ సంస్థలు 60సార్లకు పైగా భేటీ అయినట్టు పేర్కొంది. కాల్పుల విరమణ కోసం అమెరికా ద్వారా భారత్ ప్రయత్నాలు చేసిందని, ప్రాంతీయ శాంతి కోసం పాక్ ఆ అభ్యర్థనలను అంగీకరించిందని ఆదివారం రావల్పిండిలోని ఆర్మీ జనరల్ హెడ్క్వార్టర్స్‌లో ఆసిమ్ మునీర్ ప్రకటనలు చేశారు. అవి డొల్లే అని తాజాగా తేలిపోయింది.

పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారం తీర్చుకునేందుకు భారత్ ఆపరేషన్ సిందూర్ (రాజూవతీఫ్‌అశీఅ రాఱఅఎశీశీ)ను చేపట్టిన సంగతి తెలిసిందే. ఉగ్రస్థావరాలను మన సైన్యం నేలమట్టం చేసింది. ఆ సమయంలో వాషింగ్టన్‌లోని కీలక నేతలు, అధికారులతో పాక్ హడావుడిగా చర్చలు జరిపింది. మే 6 అర్ధరాత్రి భారత్ దాడుల ధాటికి కంగుతిన్న పాక్ 30సార్లు వేర్వేరుగా సంప్రదింపులు చేపట్టింది. పాక్ అంబాసిడర్‌కు అమెరికా నేతలతో సమావేశాల కోసం ప్రయత్నాలు చేసింది. ఇక మే 7, 8న తమ ప్రాంతంలో ఉద్రిక్తతలపై చర్చించేందుకు లాబీయింగ్ చేసిందని రికార్డులు వెల్లడించాయి. మే 9న లాబీయింగును మరింత పెంచింది. రక్షణ, జాతీయ భద్రతకు చెందిన వ్యక్తులతో 20నుంచి 25సార్లు సంప్రదింపులు చేపట్టింది. అమెరికా మీడియాలోని ప్రముఖ జర్నలిస్టులతోనూ పాక్ లాబీ సంస్థలు భేటీ అయ్యాయి.

వాషింగ్టన్‌లో భారత్, పాకిస్థాన్ కార్యకలాపాలకు పూర్తి వ్యత్యాసం కనిపించిందని ఆ ఫైలింగ్స్ ద్వారా వెల్లడవుతోంది. ఉగ్రవాదాన్ని ఖండించడం పైనా, పహల్గాం ఉగ్రదాడికి వ్యతిరేకంగా దౌత్యపరమైన మద్దతు కూడగట్టడంపైనా భారత్ సంప్రదింపులు చేపట్టింది. ఇదిలాఉంటే.. పాకిస్థాన్‌తో ఉద్రిక్తతల విషయంలో భారత్ తొలినుంచి మూడోపక్షం జోక్యాన్ని వ్యతిరేకిస్తూ వస్తోంది. ఆపరేషన్ సిందూర్ దెబ్బకు కంగుతిన్న పాక్ చివరకు కాళ్లబేరానికి రావడంతో మన ప్రభుత్వం కాల్పుల విరమణకు అంగీకరించిన విషయం తెలిసిందే.

# విమానసంస్థనే కొనడానికి రెడీ అయిపోయారు..!?

**టిక్‌టాక్ ఇన్‌ఫ్లుయెన్సర్ వీడియోకు వైరల్ స్పందన**




దివాలా తీసిన విమానయాన సంస్థను కొనుగోలు చేద్దామంటూ టిక్‌టాక్ ఇన్‌ఫ్లుయెన్సర్ ఒకరు చేసిన జోక్‌ను ప్రజలు సీరియస్‌గా తీసుకున్నారు. దానికి మళ్లీ పూర్వవైభవం తీసుకువచ్చేందుకు ముందుకువచ్చారు. దాంతో 335 మిలియన్ డాలర్ల మేర (రూ.3వేల కోట్లకు పైగా) ఆర్థిక సహకారం చేసేందుకు ముందుకువచ్చారు. ఇంతకీ విషయం ఏంటంటే..? అమెరికాకు చెందిన స్పిరిట్ ఎయిర్‌లైన్స్ ఆర్థికంగా చితికిపోయింది. దాంతో కార్యకలాపాలను నిలిపివేస్తున్నట్లు ఇటీవల ప్రకటించింది. మూడు దశాబ్దాలపాటు అన్ని వర్గాలకు అందుబాటులో ఉండే ధరలకు విమానాలు నడిపింది. ఇప్పుడు అది పతనం కావడంతో ఒక టిక్‌టాక్ క్రియేటర్ హంటర్ పీటర్సన్ ‘లెట్స్ బై స్పిరిట్ ఎయిర్’ ప్రచారాన్ని ప్రారంభించారు. దానికి సంబంధించి తొలుత ఒక టిక్‌టాక్ వీడియోను హంటర్ షేర్ చేశారు. దానికి లక్షల్లో వీక్షణలు వచ్చాయి. దివాలా తీసిన ఎయిర్‌లైన్స్‌ను ప్రజల సంస్థగా పునఃప్రారంభించేందుకే ఈ ప్రయత్నమని అతడు పేర్కొన్నారు. ప్రజల స్పందన చూసి, ఒక వెబ్సైట్ లాంచ్ చేశారు. విమాన సంస్థలో యాజమాన్య వాటాలు పొందేలా వారు తమ ఆర్థికసాయం గురించి వెల్లడి చేసేలా దానిని తీర్చిదిద్దారు. శనివారం రాత్రికి రూ.3వేల కోట్లకు పైగా ఇచ్చేందుకు జనం ముందుకువచ్చారు. కానీ ఇప్పటివరకు ఎవరినుంచి డబ్బు సేకరించలేదు. మొదట తాను సరదాగానే ఈ ప్రతిపాదన చేశానని పీటర్సన్ వెల్లడించారు.

కాగా.. ఆర్థికసంక్షోభంతో సతమతమైన స్పిరిట్ ఎయిర్లైన్స్ మే 2న అధికారికంగా తన కార్యకలాపాలను నిలిపివేసింది. సేవలు కొనసాగించేందుకు అది చేసిన ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయి. దాంతో అనూహ్యంగా సర్వీసుల్ని రద్దు చేసింది. ఈ క్రమంలోనే టిక్‌టాక్ క్రియేటర్ ఫండ్ రైజింగ్‌ను ప్రారంభించారు. మరి ఆ ప్రయత్నం పూర్తిస్థాయిలో కొనసాగుతుందో, లేదో చూడాలి

# ఇజ్రాయెల్‌కు హిజ్బుల్లా షాక్

**ఐరన్ డోమ్‌ను ధ్వంసం చేసిన ఘటన**





లెబనాన్ దేశానికి చెందిన మిలిటెంట్ సంస్థ హిజ్బుల్లా తాజాగా ఇజ్రాయెల్‌కు షాకిచ్చింది. అత్యంత శక్తిమంతమైన గగనతల రక్షణ వ్యవస్థగా పేరుపొందిన ఐరన్ డోమ్‌ను ఛేదించగలిగింది. ఐరన్ డోమ్ వ్యవస్థలో కీలక భాగమైన మిసైల్ లాంచింగ్ యూనిట్‌ను ఎఫ్‌పీవీ డ్రోన్‌తో ధ్వంసం చేసినట్టు హిజ్బుల్లా ప్రకటించింది. ఇందుకు సంబంధించిన ఫుటేజీని కూడా విడుదల చేసింది. అంతర్జాతీయ మీడియా కథనాల ప్రకారం కొన్నిరోజుల క్రితమే ఈ దాడి జరిగింది. అయితే ఈ దాడి ఫుటేజీని సేకరించేందుకు హిజ్బుల్లా కొంత సమయం తీసుకున్నట్టు సమాచారం. హిజ్బుల్లా ప్రకటనపై ఇజ్రాయెల్ డిఫెన్స్ దళాలు ఇంకా స్పందించలేదు. ఎఫ్‌పీవీ డ్రోన్స్‌ను అడ్డుకోవడం ఇజ్రాయెల్ దళాలకు సవాలుగా మారిందన్న వార్తలు ఇప్పటికే అనేకం వెలువడ్డాయి. సంప్రదాయక మిసైల్స్, రాకెట్స్, డ్రోన్స్‌ను అడ్డుకునేందుకు ఇజ్రాయెల్ అభివృద్ధి చేసుకున్న ట్రాకింగ్ వ్యవస్థలు, జామర్లు ఎఫ్‌పీవీ డ్రోన్‌ల విషయంలో తడబడుతున్నట్టు సమాచారం.

రేడియో సిగ్నల్స్, జీపీఎస్ ద్వారా సంప్రదాయక డ్రోన్స్ తమ లక్ష్యాన్ని చేరుకుంటాయి. ఈ సిగ్నల్స్‌ను జామ్‌చేసి ఇజ్రాయెల్ వాటిని ధ్వంసం చేస్తోంది. అయితే, ఎఫ్‌పీవీ డ్రోన్స్‌కు అనుసంధానమైవున్న ప్రత్యేక ఆప్టిక్ ఫైబర్ కేబుల్ ద్వారా ఆపరేటర్లు వాటిని నియంత్రిస్తారు. డ్రోన్స్‌కు ఉన్న కెమెరాల ద్వారా అందే దృశ్యాలను చూస్తూ వాటిని లక్ష్యం వైపు నడిపిస్తారు. ఈ ఆప్టిక్ తీగల్లోని సిగ్నల్స్‌ను అడ్డుకోవడం జామర్స్‌కు సాధ్యం కాదు. ఫలితంగా ఎఫ్‌పీవీ డ్రోన్స్ తమ లక్ష్యాలను ధ్వంసం చేస్తున్నాయి. ఈ ముప్పు గురించి ఇజ్రాయెల్ సైనికాధికారి ఒకరు ముందే అప్రమత్తం చేశారు. ఎఫ్‌పీవీ దాడులనుంచి ఐరన్ డోమ్‌ను కాపాడుకోలేకపోతే నష్టం మరింత పెరుగుతుందని అన్నారు. ఇక పరిస్థితిని చక్కదిద్దేందుకు ఇజ్రాయెల్ పలు ప్రయత్నాలు చేస్తోంది. ఎఫ్‌పీవీ డ్రోన్స్‌నుంచి ఐరన్ డోమ్ యూనిట్లకు రక్షణ భారీ వలలను ఏర్పాటు చేస్తోంది. ఈ వలలకు ఎఫ్‌పీవీ డ్రోన్స్ చిక్కి విఫలమవుతాయని ఇజ్రాయెల్ చెబుతోంది.

# అమెరికాలో భారతీయుడి దాతృత్వం

***176మంది గ్రాడ్యుయేట్ల విద్యా రుణాలు చెల్లిస్తున్నట్లు ప్రకటన***



అమెరికాలోని నార్త్ కరోలినా స్టేట్ యూనివర్సిటీకి చెందిన విల్సన్ కాలేజ్ ఆఫ్ టెక్స్‌టైల్స్ విద్యార్థులను భారతీయ సంతతి వ్యక్తి సర్‌ప్రైజ్ చేశారు. ఫైనల్ ఇయర్ చదువుతున్న 176మంది గ్రాడ్యుయేట్ విద్యార్థుల రుణాలు చెల్లించనున్నట్టు ప్రకటించారు. రలేగ్‌లోని రేనాల్డ్స్ కొలేషియంలో గ్రాడ్యుయేషన్ సెర్మనీ జరిగింది. ఈ ఘటనపై న్యూయార్క్ పోస్టు ఓ కథనాన్ని రాసింది. భారతీయ వ్యక్తి అనిల్ కొచ్చార్ తన దాతృత్వాన్ని చాటుకున్నారు. తన తండ్రి ప్రకాశ్ చాంద్ కొచ్చార్ జ్ఞాపకంగా విద్యార్థుల రుణాలను చెల్లిస్తున్నట్టు పేర్కొన్నారు. పంజాబ్‌కు చెందిన తన తండ్రి.. రలేగ్‌కు వలస వచ్చినట్టు ఆయన ఆ సెర్మనీలో మాట్లాడుతూ వెల్లడించారు. విల్సన్ కాలేజీలో ఫైనల్ ఇయర్ గ్రాడ్యుయేషన్ చదువుతున్న విద్యార్థులందరికీ గిఫ్ట్ ఇస్తున్నానని, 2025-26 అకాడమిక్ సంవత్సరానికి చెందిన విద్యార్థుల ఫీజులను చెల్లించనున్నట్లు చెప్పారు. మారిలిన్ తాను కలిసి ఈ నిర్ణయం తీసుకున్నామని, స్వేచ్ఛగా మీరు మీ డిగ్రీని పొందాలని, మీ లక్ష్యాలను మీరు చేరుకోవాలని, దేని కోసం కష్టపడ్డారో ఆ జీవితాన్ని నిర్మించుకోవాలని అనిల్ తన ప్రసంగంలో తెలిపారు.

80 ఏళ్ల క్రితం ప్రకాశ్ చాంద్‌కొచ్చార్ .. పంజాబ్ నుంచి అమెరికా వెళ్లారు. 1946లో ఎన్‌సీ రాష్ట్రంలో అతను టెక్స్‌టైల్ మాన్యుఫ్యాక్చరింగ్ విద్యను అభ్యసించారు. 1950లో బ్యాచిలర్స్ డిగ్రీ పొందారు. 1952లో మాస్టర్స్ పూర్తి చేశారు. న్యూయార్క్ సిటీలోని రేయాన్ ఇండస్ట్రీలో సర్వీస్ కోఆర్డినేటర్‌గా పని చేశారు. 1985లో ఆయన మరణించారు. విల్సన్ కాలేజ్ ఆఫ్ టెక్స్‌టైల్స్ కాలేజీ ఒక్కటే అమెరికాలో వస్త్ర రంగ విద్యకు అంకితమైంది. కొచ్చార్ కుటుంబం మూడు తరాలనుంచి ఆ రంగంలోనే పనిచేస్తున్నది. తన తండ్రి ఆ చదువుతో టెక్స్‌టైల్ రంగంలో ఉన్నత దశకు చేరుకున్నట్టు అనిల్ కొచ్చార్ తెలిపారు.

# ‘హంటా వైరస్’ నౌకలోని భారతీయులు నెదర్లాండ్స్‌కు



హంటా వైరస్ కలకలానికి కేంద్ర బిందువైన క్రూజ్ నౌక ఎండీ హొండియస్ నుంచి ప్రయాణికులను వారి స్వదేశాలకు తరలించే ప్రక్రియ ఆదివారం ప్రారంభమైంది. పశ్చిమాఫ్రికాలోని టెనెరీఫ్ ద్వీపంవద్ద నిలిచిన ఈ నౌక నుంచి ప్రయాణికులను ముందు చిన్న పడవల్లో తరలిస్తున్నారు. అనంతరం అక్కడి నుంచి విమానాల్లో వారి దేశాలకు పంపనున్నారు. మన దేశానికి చెందిన ఇద్దరు నౌకా సిబ్బందిని ప్రస్తుతానికి నెదర్లాండ్‌కు తరలించారు. హొండియస్ నౌకలో ఉన్న 140 మందిలో ఈ వైరస్ లక్షణాలు కనిపించలేదని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్వో) స్పష్టం చేసింది. ఈ వైరస్ వ్యాప్తివల్ల సాధారణ ప్రజలకు ముప్పు తక్కువగానే ఉంటుందని డబ్ల్యూహెచ్‌వో డైరెక్టర్ జనరల్ టెడ్రోస్ అధనోమ్ మరోమారు పునరుద్ఘాటించారు. టెఫరీన్ నుంచి మాడ్రీద్‌కు 14మంది స్పెయిన్ జాతీయులను తరలిస్తున్న విమానం ఆదివారం బయలుదేరింది. అక్కడినుంచి వారిని సైనిక ఆసుపత్రికి తరలించి క్వారంటైన్‌లో ఉంచనున్నట్టు స్పెయిన్ అధికారులు తెలిపారు. అన్ని దేశాల ప్రయాణికుల తరలింపు పూర్తయ్యాక హంటా వైరస్ బారినపడి మరణించిన ఒకరి మృతదేహం నౌకలోనే ఉంటుందని వెల్లడించారు. నౌక నెదర్లాండ్స్‌లోని రోటర్యాంకు ప్రయాణిస్తుందని, అక్కడ దానికి క్రిమి సంహారక చర్యలు చేపడతామని పేర్కొన్నారు. అమెరికా, బ్రిటన్, నెదర్లాండ్స్, ఐర్లాండ్, తుర్కియే, గ్రీస్, జర్మనీ, బెల్జియం, అర్జెంటీనా దేశాలు నౌకలోని తమ పౌరులను తరలించేందుకు విమానాలు పంపనున్నాయి. నౌకలోని అమెరికా పౌరులను నెబ్రాస్కాలోని వైద్య కేంద్రంలో క్వారంటైన్ చేయనున్నారు.

## ఐసీసీ వన్డే వార్షిక ర్యాంకింగ్స్..

# అగ్రస్థానంలోనే టీమిండియా

ఢిల్లీ: వన్డే వార్షిక ర్యాంకింగ్స్ జాబితాను ఐసీసీ తాజాగా విడుదల చేసింది. భారత జట్టు 118 రేటింగ్ పాయింట్లతో మరోసారి తన అగ్రస్థానాన్ని నిలబెట్టుకుంది. ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్ జాబితాలో నూ టీమిండియానే అగ్రస్థానంలో నిలిచిన సంగతి తెలిసిందే. టీ20 ప్రపంచ కప్ 2026 గెలవడంతో పొట్టి ఫార్మాట్‌లోనూ భారత్ పై చేయి సాధించింది. కాగా 2025 ఛాంపియన్స్ ట్రోఫీలో ఘన విజయం సాధించిన టీమిండియా.. తాజా వన్డే ర్యాంకింగ్స్ లో తమ ఆధిపత్యాన్ని చాటింది. న్యూజిలాండ్ 113 పాయింట్లతో రెండో స్థానంలో ఉండగా.. 109 పాయింట్లతో ఆస్ట్రేలియా మూడో స్థానంలో కొనసాగుతోంది. అయితే భారత్ కంటే న్యూజిలాండ్ కేవలం 5 పాయింట్ల తేడాతోనే రెండో స్థానంలో ఉండటం విశేషం. అద్భుత ప్రదర్శనలతో వరుస విజయాలు సాధించిన సౌతాఫ్రికా 102 పాయింట్లతో నాలుగో స్థానానికి ఎగబాకింది. ఈ క్రమంలో పాకిస్థాన్(98)ను వెనక్కి నెట్టింది. ఇదిలా ఉంటే, ఇదొక్కటి తప్పించి టాప్ 10 జట్ల జాబితాలో ఎలాంటి మార్పు లేదు. శ్రీలంక(96), ఆఫ్ఘనిస్థాన్ (93), ఇంగ్లండ్ (89), బంగ్లాదేశ్(84), వెస్టిండీస్(74) పాయింట్ల తో ఆ తర్వాతి స్థానాల్లో కొనసాగుతున్నాయి.

ఐర్లాండ్ 54 పాయింట్లతో 11వ స్థానానికి చేరి జింబాబ్వేను వెనక్కి నెట్టింది. జింబాబ్వే 53 పాయింట్లతో 12వ స్థానానికి పడిపోయింది. మరోవైపు అమెరికా 46 పాయింట్లతో 13వ స్థానానికి ఎగబాకి స్కాట్లాండ్‌ను అధిగమించింది. స్కాట్లాండ్ ప్రస్తుతం 44 పాయింట్ల తో 14వ స్థానంలో ఉంది. ఐసీసీ ప్రకటించిన నిబంధనల ప్రకా రం 2027 మార్చి 31 నాటికి ఐసీసీ ర్యాంకింగ్స్‌లో టాప్ 8లో నిలిచే జట్లు నేరుగా వన్డే వరల్డ్ కప్ 2027కు అర్హత సాధిస్తాయి. ఆతిథ్య దేశాలైన సౌతాఫ్రికా, జింబాబ్వే ఇప్పటికే టోర్నీకి నేరుగా అర్హత పొందాయి. ఈ నేపథ్యంలో దక్షిణాఫ్రికా టాప్ 8లోనే కొనసాగితే 9వ స్థానంలో ఉన్న మరో జట్టుకు ప్రత్యక్ష అర్హత లభించే అవకాశం ఏర్పడనుంది. దీంతో ప్రస్తుతం 9వ స్థానం కోసం పోటీ ఆసక్తికరంగా మారింది.



# ఫ్రాంచైజీ ఓనర్లకు బీసీసీఐ హెచ్చరిక!

ఢిల్లీ: ఐపీఎల్ 2026 ఉత్సాహభరితంగా కొనసాగుతోంది. లీగ్ స్టేజ్ దాదాపు ముగింపు దశకు చేరుకుంది. ఈ నేపథ్యంలో ఐపీఎల్ ఫ్రాంచైజీ ఓనర్ల తీరుపై బీసీసీఐ అసంతృప్తి వ్యక్తం చేసింది. బోర్డు జారీ చేసిన నిబంధనలను కొందరు జట్టు యజ మానులు ఉల్లంఘిస్తున్నారని గుర్తించింది. ఇకపై రూల్స్ అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేసింది. బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా ఇటీవలే ఐపీఎల్ ఫ్రాంచైజీలకు ప్రత్యేక మార్గదర్శకాలు పంపించారు. మ్యాచ్ జరుగుతున్న సమయంలో జట్టు యజమానులు ప్లేయింగ్ ఏరియాలోకి రావొద్దని, ప్లేయర్లు లేదా సపోర్ట్ స్టాఫ్‌తో ప్రత్యక్షంగా మాట్లాడకూడదని స్పష్టం చేశారు. అయితే కొందరు ఓనర్లు ఈ నిబంధనలను పట్టించుకోవ డం లేదని బీసీసీఐ గుర్తించింది. 'ఐపీఎల్ ఫ్రాంచైజీ ఓనర్లకు ఇప్పటికే వార్నింగ్ ఇచ్చాం. డగౌట్ సమీపంలో యజమానులు తిరుగుతూ కనిపించారు. మరికొందరు మొబైల్ ఫోన్లతో మైదానం లోకి వచ్చి ఫొటోలు కూడా తీశారు. వాటికి సంబంధించిన ఆధారాలు కూడా ఉన్నాయి. పలుమార్లు హెచ్చరించినా వారి తీరులో మార్పు రాలేదు. అందుకే ఇదే రిపీట్ అయితే కఠిన చర్యలు తప్పవు' అని ఐపీఎల్‌కు సంబంధించిన అధికారి వెల్లడిం చారు. ఇదిలా ఉండగా, ఐపీఎల్




2026 సీజన్‌లో 'హనీ ట్రాప్' ప్రమాదాలపై కూడా బీసీసీఐ అన్ని ఫ్రాంచైజీలను అప్రమత్తం చేసింది. ఆటగాళ్లు లేదా అధికారులపై లైంగిక వేధింపుల వంటి ఆరోపణలు వచ్చే అవకాశాలు ఉన్నాయని హెచ్చరించింది. హై ప్రొఫైల్ క్రీడా వాతావరణాల్లో ఇలాంటి ప్రమాదాలు ఎక్కువగా ఉంటాయని, ప్రతి ఫ్రాంచైజీ అప్రమత్తంగా వ్యవహరించాలని దేవజిత్ సైకియా సూచించారు. ఈ నేపథ్యంలో బీసీసీఐ, ఐపీఎల్ ఆపరేషన్స్ సభ్యులతో ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసింది. ఈ బృందాలు హోటల్ గదుల్లో తనిఖీలు నిర్వహిస్తుంటాయి. అనుమతి లేని వ్యక్తులు.. ఆటగాళ్ల గదుల్లోకి ప్రవేశించినట్లు తేలితే కఠిన క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని బీసీసీఐ హెచ్చరించింది.

## ముంబైతో మ్యాచ్‌లో

# కృనాల్ పాండ్యకు గాయం

ముంబై: ఐపీఎల్ 2026లో భాగంగా ఆదివారం ముంబై ఇండియన్స్‌తో జరిగిన ఉత్కంఠ పోరులో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు 2 వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఆఖరి బంతి వరకు పోరాడిన ఆర్సీబీ.. ఈ గెలుపుతో అగ్రస్థానానికి చేరుకుంది. దాదాపు ఓటమి ఖాయమనుకున్న మ్యాచ్‌లో ఆర్సీబీ ఆల్‌రౌండర్ కృనాల్ పాండ్య అద్భుత ప్రదర్శనతో జట్టు విజ యంలో కీలక పాత్ర పోషించాడు. ఐదో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చి 46 బంతుల్లో 73 పరుగులు చేశాడు. ఓ వైపు వికెట్లు పడిపోతున్నా మొండిగా క్రీజులో నిలబడ్డాడు. కాలు పట్టేసినా సిక్సర్లతో విరుచుకుపడ్డాడు. ఇదే సమయంలో కార్బిన్ బాష్ బౌలింగ్‌లో కృనాల్‌కు తీవ్ర గాయమైంది. దానికి సంబంధించిన ఫొటోను అతడు సోషల్ మీడియా వేదికగా పంచుకున్నాడు. ఓ వైపు కాలు పట్టేసి తీవ్ర ఇబ్బంది పడుతున్నా జట్టు కోసం షాట్లు బాదేస్తున్నాడు. ఇదే సమయంలో ముంబై బౌలర్ బాష్ బౌలింగ్‌లో కృనాల్ కడుపుపై తీవ్ర గాయమైంది. ఫిజియో వచ్చి చికిత్స చేసిన తర్వాత పుంజుకుని భారీ షాట్లు ఆడాడు. అయితే మ్యాచ్‌లో తగిలిన గాయం ఫొటోను పంచుకుంటూ కృనాల్ ఇన్‌స్టాలో స్టోరీ పెట్టాడు. 'కొన్ని గుర్తులు పోరాటం వృథా కాలేదని చెబుతాయి' అంటూ భావోద్వేగంగా క్యాప్షన్ ఇచ్చాడు. ఆ ఫొటో కాస్తా సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది. 'అప్పుడు గాయం తీవ్రత తెలియలేదు కానీ చాలా గట్టిగానే తగిలింది' అంటూ నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు. 'కాలు పట్టేసినా, గాయమైనా.. జట్టుకు విజయాన్ని అందించాడు' అంటూ ప్రశంసలు కురిపిస్తున్నారు. ఇదిలా ఉంటే, ఆర్సీబీ విజయం సాధించడంతో ఐపీఎల్ 2026 సీజన్ నుంచి ముంబై ఇండియన్స్, లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ అధికారికంగా ఎలిమి నేట్ అయ్యాయి. 14 పాయింట్లతో ఆర్సీబీ పాయింట్ల పట్టికలో అగ్రస్థానానికి చేరుకుంది.





# ప్లేఆఫ్స్ లెక్కలు ఖరారు!

### రెండు జట్లు ఔట్

ఐపీఎల్ 2026 కీలక దశకు చేరుకుంది. ఆదివారం ఒక్క రోజే రెండు జట్లు టోర్నీ నుంచి నిష్క్రమించాయి. ముంబై ఇండియన్స్‌తో జరిగిన ఉత్కంఠ పోరులో ఆర్సీబీ చివరి బంతికి గెలిచింది. అలానే మరో మ్యాచ్‌లో లఖ్‌నవూపై చెన్నై సూపర్ కింగ్స్ 5 వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఈ రెండు మ్యాచ్‌ల ఫలితంతో ముంబై ఇండియన్స్, లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ అధికారికంగా ప్లేఆఫ్ రేసు నిష్క్రమించాయి. మిగిలిన ఎనిమిది జట్లు టాప్-4లో నిలిచి ప్లేఆఫ్ బెర్తును దక్కించు కోవడమే లక్ష్యంగా హోరాహోరీగా తలపడనున్నాయి. 8 జట్ల ప్లేఆఫ్స్ సమీకరణాలు ఎలా ఉన్నాయో ఇప్పుడు చూద్దాం...

**రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు:**

ఇప్పటివరకు 11 మ్యాచ్‌లు ఆడిన ఆర్సీబీ 14 పాయింట్లతో టాప్‌లో కొనసాగుతోంది. మరో మ్యాచ్ గెలిస్తే 16 పాయింట్లతో ప్లేఆఫ్స్ బెర్తు దాదాపు ఖాయమైనట్లే. ఒకవేళ ఆర్సీబీ మిగిలిన 3 మ్యాచ్‌ల్లోనూ విజయం సాధిస్తే 20 పాయింట్లతో క్వాలిఫయర్-1కు అర్హత సాధిస్తుంది.

సన్ రైజర్స్ హైదరాబాద్:

ఎస్ఆర్‌హెచ్ కూడా బెంగళూరు మాదిరిగానే 11 మ్యాచ్‌ల్లో 7 విజయాలతో 14 పాయింట్లతో ఉంది. కానీ నెట్ రన్‌రేట్ (0.737) తక్కువగా ఉండటంతో రెండో స్థానంలో నిలిచింది. హైదరాబాద్ జట్టు తమ చివరి 3 మ్యాచ్‌ల్లో రెండింటిలో గెలిస్తే.. ఇతర సమీకరణాలతో సంబంధం లేకుండా నేరుగా ప్లేఆఫ్‌కు అర్హత సాధిస్తుంది. మే 22న ఆర్సీబీతో జరిగే ఆరెంజ్ ఆర్మీ చివరి లీగ్ మ్యాచ్ ఫలితంతో క్వాలిఫయర్-1 స్థానాన్ని ఎవరు దక్కించుకుంటారో తేలిపోనుంది.

**గుజరాత్ టైటాన్స్:**

శుభ్‌మన్ గిల్ సారథ్యంలోని జీటీ ఇప్పటివరకు 11 మ్యాచ్‌లు ఆడి 14 పాయింట్లతో మూడో స్థానంలో ఉంది. ఆర్సీబీ, సన్‌రైజర్స్‌తో పోలిస్తే గుజరాత్ నెట్ రన్‌రేట్(o0.228) తక్కువగా ఉంది. గుజరాత్ ప్లేఆఫ్స్‌కు వెళ్లాలంటే మిగిలిన 3 మ్యాచ్‌ల్లో 2 విజయాలు సాధించాలి. మే 12న గుజరాత్, హైదరాబాద్ మధ్య జరిగే మ్యాచ్ ఇరు జట్లకు నిర్ణయాత్మకం కానుంది.

**పంజాబ్ కింగ్స్:**

ఇప్పటివరకు మిగిలిన జట్లతో పోలిస్తే పంజాబ్ ఒక మ్యాచ్ తక్కువ ఆడింది. 10 మ్యాచ్‌లు ఆడిన పీబీకేఎస్ 13 పాయింట్ల తో ఉంది. చివరి 4 మ్యాచ్‌లలో రెండు విజయాలు సాధిస్తే ఆ జట్టు 17 పాయింట్లతో ప్లేఆఫ్ బెర్తును ఖరారు చేసుకుంటుంది. ఢిల్లీ క్యాపిటల్స్, ముంబై ఇండియన్స్, ఆర్సీబీ, లఖ్‌నవూలతో పంజాబ్ తలపడనుంది.

**చెన్నై సూపర్ కింగ్స్:**

5 సార్లు ఛాంపియన్‌గా నిలిచిన చెన్నై సూపర్ కింగ్స్ ఈసారి క్లిష్టమైన పరిస్థితిని ఎదుర్కొంటోంది. ప్రస్తుతం 12 పాయింట్లతో ఐదో స్థానంలో ఉంది. ఈ జట్టు చివరి 3 మ్యాచ్‌ల్లో రెండింట గెలిస్తే 16 పాయింట్లు వస్తాయి. కానీ, నెట్ రన్‌రేట్(0.185) తక్కువగా ఉండటం సీఎస్కేను టెన్షన్ పెడుతోంది. చెన్నై టీమ్ నేరుగా అర్హత సాధించాలంటే మిగిలిన మ్యాచ్‌ల్లో తప్పక గెలవాల్సి ఉంటుంది.

**రాజస్థాన్ రాయల్స్:**

12 పాయింట్లతో రాజస్థాన్ రాయల్స్.. సీఎస్కేతో సమానంగా ఉంది. రాజస్థాన్ మిగిలిన మూడు మ్యాచ్‌ల్లో కనీసం రెండు గెలిస్తే ప్లేఆఫ్స్ అవకాశాలుంటాయి. నాలుగు మ్యాచ్‌ల్లో మూడింట ఓటమిపాలవడంతో ఆర్ఆర్ నెట్ రన్‌రేట్(o0.082) పడిపోయింది. మొత్తంగా నాలుగో స్థానం కోసం సీఎస్కేతో రాజస్థాన్ జట్టు పోటీపడొచ్చు.

**కోల్‌కతా నైట్ రైడర్స్:**

కేకేఆర్ ప్లేఆఫ్స్ చేరేందుకు చాలా తక్కువ అవకాశాలు ఉన్నాయి. ఇప్పటివరకు 10 మ్యాచ్‌లు ఆడిన కేకేఆర్ 9 పాయింట్లతో ఏడో స్థానంలో కొనసాగుతోంది. ఈ జట్టు 17 పాయింట్ల మార్కును చేరుకోవాలంటే మిగిలిన 4 మ్యాచ్‌ల్లోనూ తప్పక గెలవాలి. ఒక్క మ్యాచ్‌లో ఓడినా ఇతర జట్ల ఫలితాలపై ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది.

**ఢిల్లీ క్యాపిటల్స్:**

11 మ్యాచ్‌ల్లో నాలుగు విజయాలే సాధించిన ఢిల్లీ సాంకేతికంగా మాత్రమే ప్లేఆఫ్స్ రేసులో ఉంది. ఈ జట్టు 14 పాయింట్లకు చేరుకోవడానికి మిగిలిన అన్ని మ్యాచ్‌ల్లోనూ తప్పనిసరిగా గెలవాలి. అదే సమయంలో ఇతర జట్ల ఫలితాలపైనా ఆధారపడాల్సి ఉంటుంది. ఆ ఫలితాలు అనుకూలంగా వస్తేనే డీసీప్లేఆఫ్స్ చేరే అవకాశం ఉంటుంది.

చైతన్య రథం సినిమా
మంగళవారం 12 మే 2026 X

# తక్కువ టైంలోనే వేరియేషన్స్

'పెద్ది'లోని పాత్ర వేరియేషన్స్‌కు తగ్గట్టు తక్కువ సమయంలోనే రామ్‌చరణ్ శరీరాకృతిని మార్చుకున్నారని సినిమాటోగ్రాఫర్ రత్నవేలు తెలిపారు. ఆయన బాడీ ట్రాన్స్‌ఫర్మేషన్ తీరుపై ప్రశంసలు కురిపించారు. ఈ ఇద్దరి కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న 'పెద్ది' ప్రమోషన్స్‌లో భాగంగా పాల్గొన్న ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. "పెద్ది'లో చరణ్ తొలుత క్రికెటర్ పాత్ర పోషించారు. మరో వేరియేషన్ తర్వాత వెంటనే మల్లయోధుడిగా నటించాల్సి వచ్చింది. క్రికెట్, కుస్తీ.. ఇలా ఆయా క్రీడల నేపథ్యానికి తగ్గట్టు శరీరాకృతి మార్చుకునేందుకు చరణ్‌కు ఎక్కువ సమయం లేదు. తక్కువ టైంలో చాలా కష్టపడి, అనుకున్న లుక్స్‌లోకి మారారు. పైగా ఆయన అప్పుడు అయ్యప్ప దీక్షలో ఉండటంతో వెజిటేబుల్ డైట్‌నే ఫాలో అయ్యారు. ఈ మూవీ ప్రీ క్లైమాక్స్, క్లైమాక్స్ ఎమోషనల్‌గా ఉంటాయి. చరణ్ కెరీర్ బెస్ట్ పెర్ఫామెన్స్ ఇచ్చారు" అంటూ ఆసక్తి రేకెత్తించారు. సినిమాటోగ్రాఫర్ ఈ




సినిమా కోసం కొన్ని ప్రయోగాలు చేశానన్న రత్నవేలు.. వాస్తవికతకు దగ్గరగా ఉన్న కంటెంట్ అయినప్పటికీ ఇది పక్కా కమర్షియల్ చిత్రమన్నారు. స్పోర్ట్స్ కాకుండా ప్రత్యేకంగా యాక్షన్ సీక్వెన్స్‌లే చాలానే ఉన్నాయని తెలిపారు. హీరోయిన్ జాన్వీకపూర్ ఇంట్రడక్షన్ సీన్ చాలా కొత్తగా ఉంటుందని, ఇప్పటి వరకూ ఏ కథానాయికకు ఇలాంటి పరిచయ సన్నివేశం లేదని అభిప్రాయపడ్డారు. ఎమ్మెల్యే కూతురిగా ఆమె నటించారన్నారు. డాల్బీ విజన్, ఐమ్యాక్స్ ఫార్మాట్లలోనూ ఈ మూవీ రిలీజ్ అవుతుందని తెలిపారు. బుచ్చిబాబు తెరకెక్కిస్తున్న ఈ చిత్రం జూన్ 4న ప్రేక్షకుల ముందుకు రానుంది. మూవీ ట్రైలర్‌ను ఈ నెల 18న విడుదల చేయనున్నారు.

# దృశ్యం-3.. డబ్బింగ్‌తోనే..




మలయాళంలో తెరకెక్కిన 'దృశ్యం' ఫ్రాంచైజీకి సినీ అభిమానుల్లో విశేష క్రేజ్ ఉంది. రీమేక్ అయి ఇతర భాషల్లోనూ ఈ కథ థ్రిల్ చేసిన సంగతి తెలిసిందే. మలయాళంలో మోహన్‌లాల్ హీరోగా ఇప్పటికే రెండు భాగాలు రాగా.. మూడో భాగం విడుదలకు సిద్ధమైంది. మరోవైపు, వెంకటేశ్ హీరోగా తెలుగులో తెరకెక్కిన 'దృశ్యం' కూడా రెండు పార్టులుగా వచ్చింది. మూడోభాగం వస్తుందా, రాదా? అన్న సందిగ్ధతకు తెర పడింది. రీమేక్‌కు బదులు.. మోహన్‌లాల్ 'దృశ్యం 3'నే తెలుగులో డబ్ అయింది. తాజాగా ట్రైలర్ విడుదలైంది. డబ్బింగ్ కాబట్టి హీరో పాత్ర పేరును మార్చలేదు. మలయాళం సినిమాలోని జార్జికుట్టినే ఇందులోనూ కొనసాగించారు. మలయాళం, తెలుగుతోపాటు తమిళం, కన్నడలో ఈనెల 21న ఈ సినిమా విడుదల కానుంది. ఈ సినిమా సెన్సార్ కార్యక్రమాలు కూడా పూర్తయ్యాయి. సెన్సార్ బోర్డు యూ/ఏ సర్టిఫికెట్ జారీ చేసిన ఈ సినిమా రన్టైమ్ 2 గంటల 39 నిమిషాలు. హిందీలో 'దృశ్యం 3' కూడా రీమేక్ అవుతోంది. అజయ్ దేవగన్ హీరోగా అభిషేక్ పాఠక్ తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమా అక్టోబరు 2న రిలీజ్‌కు రెడీ అవుతోంది. వేరే కొత్త కథతో హిందీ 'దృశ్యం-3'ని తెరకెక్కిస్తున్నారంటూ జరిగిన ప్రచారాన్ని ఇప్పటికే.. జీతూ జోసెఫ్ ఖండించారు. తాను రాసిన కథతోనే హిందీ చిత్రం కూడా రూపొందుతుందన్నారు.

# మరో క్రేజీ ప్రాజెక్టుకు త్రిష గ్రీన్ సిగ్నల్



40 ప్లస్ వయసులోనూ వరుస ఆఫర్లతో దూసుకుపోతున్న త్రిష, తాజాగా మరో మెగా ప్రాజెక్ట్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రజినీకాంత్ -కమల్ హాసన్ కాంబినేషన్‌లో నెల్సన్ దిలీప్ కుమార్ తెరకెక్కించనున్న భారీ మల్టీస్టారర్‌లో ఆమె హీరోయిన్‌గా ఎంపికైనట్టు సమాచారం. ఈ సినిమాతో ఆమె రాజకీయాల్లోకి వెళుతుందనే రూమర్లకు చెక్ పడినట్లయింది. ఈ ప్రతిష్టాత్మక చిత్రం కోసం త్రిష ఏకంగా రూ.12 కోట్లు రెమ్యునరేషన్ అందుకోబోతున్నట్లు టాక్. ఆమె కెరీర్‌లోనే ఇది అత్యధిక రెమ్యూనరేషన్ కావడం విశేషం. వచ్చే ఏడాది ప్రారంభంలో ఈ సినిమా సెట్స్ మీదకు వెళ్లనుంది. తెలుగులో ఇప్పటికే చిరంజీవి సరసన 'విశ్వంభర'లో నటిస్తున్న త్రిష, ఇప్పుడు తమిళంలో ఇద్దరు లెజెండరీ హీరోల సరసన నటించే అవకాశం అందుకోవడం విశేషం. సీనియర్ హీరోయిన్లలో ఇప్పటికీ మోస్ట్ వాంటెడ్ స్టార్‌గా ఆమె తన క్రేజ్‌ను నిలబెట్టుకుంటోంది.




# ఓటీటీకి మధువీధు

ఓటీటీ ప్రేక్షకుల్లో మలయాళ సినిమాలకు ఉన్న ఆదరణ గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఇప్పటికే ఎన్నో చిత్రాలు వినోదం పంచగా.. మరో సినిమా సందడి చేసేందుకు సిద్ధమైంది. అదే రొమాంటిక్ కామెడీగా రూపొందిన 'మధువీధు'. ఈ మూవీ విడుదల తేదీ వివరాలను ఓటీటీ సంస్థ సోనీలివ్ ప్రకటించింది. ఈనెల 22 నుంచి స్ట్రీమింగ్ అవుతుందని వెల్లడించింది. మలయాళంతోపాటు తెలుగు, తమిళం, కన్నడ, హిందీ ఆడియోతో అందుబాటులో ఉంటుందని తెలిపింది. మధువీధు అంటే హనీమూన్ అని అర్థం. మహిళల్లేని ఇంటికి కోడలిగా వెళ్లిన స్నేహ అనే యువతి పరిస్థితేంటన్నది ప్రధానాంశంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించారు దర్శకుడు విష్ణు అరవింద్. దానికి కామెడీని టచ్ చేశారు. 'నారదన్', 'మాస్టర్పీస్' లాంటి సినిమాలు, వెబ్సిరీస్‌ల్లో కీలక పాత్రలు పోషించిన షరఫ్ హీరో కాగా.. కల్యాణీ పాణిక్కర్ హీరోయిన్. ఇప్పటికే ఈ సినిమా మలయాళంలో థియేటర్లలో విడుదలైంది.

# నా సినిమాల్లో కథే హీరో

హీరోయిన్ సమంత సోషల్ మీడియాలో ఎప్పుడూ ఫ్యాన్స్‌తో టచ్‌లో ఉంటుంది. ఇదే క్రమంలో ఇటీవల జరిగిన ఓ మ్యాగజైన్ కవర్ షూటింగ్ సమయంలో ఎదురైన ప్రశ్నలకుగానూ సమంత తన పాత్రల ఎంపిక గురించి పలు ఇంట్రెస్టింగ్ విషయాలు చెప్పుకొచ్చింది. సమంత మాట్లాడుతూ.. 'నేను చేసే సినిమాల్లో కథే హీరో అవుతుంది. కథ.. నిర్మాత, నటీనటుల కంటే గొప్పది. సమాజంలో మహిళలకు సరైన ప్రాతినిధ్యం ఉండాలనేది నా భావన' అని సామ్ తెలిపింది. సమంత ఇంకా మాట్లాడుతూ.. 'సినిమాలు చూస్తున్న మహిళలు ఆ సినిమాల్లోని పాత్రలతో మమేకం అవ్వాలి. తమను కూడా గుర్తించారని వారు భావించేలా అవి ఉండాలి. ఇకపై అలాంటి చిత్రాల్లోనే భాగం కావాలనుకుంటున్నాను. ఇక 'మా ఇంటి బంగారం' చిత్రాన్ని అత్యంత వినోదాత్మకంగా, కుటుంబం మొత్తం ఆస్వాదించేలా తీర్చిదిద్దాం" అని సమంత చెప్పుకొచ్చింది. మరి మా ఇంటి బంగారం సినిమాతో సామ్ ఎలాంటి విజయాన్ని అందుకుంటుందో చూడాలి.



# డబుల్ యాక్షన్‌కు మాస్ రాజా?



మాస్ మహారాజా రవితేజ ప్రస్తుతం శివ నిర్వాణ దర్శకత్వంలో నటిస్తున్న 'ఇరుముడి' షూటింగ్ తుది దశకు చేరుకుంది. మైత్రీ మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. దీని తర్వాత రవితేజ మరో రెండు క్రేజీ ప్రాజెక్టులను లైన్‌లో పెట్టారు. వివేక్ ఆత్రేయ దర్శకత్వంలో రవితేజ ఒక మాస్ ఎంటర్టైనర్ చేయబోతున్నాడు. నిజానికి వివేక్ ఆత్రేయ ఈ కథను బాలకృష్ణ కోసం సిద్ధం చేసి ఆయన గ్రీన్ సిగ్నల్ కూడా పొందాడు. అయితే బాలయ్య ప్రస్తుతం ఇతర కమిట్‌మెంట్లతో బిజీగా ఉండటంతో ఈ ప్రాజెక్ట్ ఆలస్యమవుతోంది. ఈ గ్యాప్‌లో వివేక్ ఆత్రేయ రవితేజను సంప్రదించగా, ఆయన వెంటనే ఓకే చెప్పాడు. ఈ సినిమాను కూడా మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తోంది. దీంతో పాటు హసిత్ గోలి దర్శకత్వంలో రవితేజ మరో సినిమా చేయనున్నాడు. దిల్ రాజుకు చెందిన శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ ఈ చిత్రాన్ని నిర్మించనుంది. విశేషం ఏమిటంటే, వివేక్ ఆత్రేయ మరియు హసిత్ గోలి సినిమాల షూటింగ్స్ ఒకేసారి జరగనున్నాయి. త్వరలోనే ఈ రెండు చిత్రాలకు సంబంధించి అధికారిక ప్రకటనలు రానున్నాయి. తన స్పీడును పెంచుతూ రవితేజ బ్యాక్ టు బ్యాక్ అనౌన్స్‌మెంట్లతో ఫ్యాన్స్‌ను ఖుషీ చేస్తున్నాడు.